thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 173 కరీంనగర్ ఆదివారం, 31 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇప్పటికీ ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలంటారా?

న్యూఢిల్లీ/హైదరాబాద్ : ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో ఇంతకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫారసు చేస్తామన్న పాకిస్థాన్‌పై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ ఘనకార్యం చేసినందుకు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాకిస్థాన్ కోరుకుంటోందా? అని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో గత నెలలో భారత్-పాక్ మధ్య ఘర్షణ సందర్భంగా ట్రంప్ జోక్యం చేసుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును సిఫారసు చేయనున్నట్టు శనివారం పాకిస్థాన్ ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్‌పై అమెరికా నేరుగా దాడులకు దిగింది. ఇరాన్ అణు కేంద్రాలపై అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా దాడులకు పాల్పడిందని ఒవైసీ అన్నారు. సుమారు 60 లక్షలకు పైగా భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉన్నారని.. యుద్ధం నేపథ్యంలో ప్రవాస భారతీయుల భద్రతపై ఆందోళన కలుగుతోందన్నారు.




## బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంచలన నిర్ణయం ద్వారా 50% రిజర్వేషన్ సీలింగ్ (కోటా పరిమితి) ను సడలించడాన్ని టార్గెట్ చేస్తోంది. ఈ దిశగా ప్రత్యేక జీవో (గవర్నమెంట్ ఆర్డర్) జారీ చేయడానికి సిద్ధం అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం 42% బీసీ రిజర్వేషన్ ను ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయనుంది. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285లో సవరణలు చేయాలని కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణతో బీసీ వర్గాలకు పంచాయతీ రాజ్ ఎన్నికలలో అధిక రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటుంది. ఈ సవరణ ద్వారా, బీసీ వర్గాలు ప్రాతినిధ్యం పెంచుకొని, వారికి మరింత స్థానం, అధిక అవకాశాలు కల్పించడానికి మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 50% సీలింగ్‌ను సడలించేందుకు చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టే నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనితో, రిజర్వేషన్ల కోటా పరిమితిని నెమ్మదిగా పెంచవచ్చు. ప్రస్తుతం దేశంలో ఉన్న 50% రిజర్వేషన్ సీలింగ్ (పరిమితి) ను తొలగించడం ద్వారా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరిన్ని అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

**ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించకపోవడం:** ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆర్డినెన్స్ కు ఆమోదం లభించకపోవడంతో, జీవో (గవర్నమెంట్ ఆర్డర్) ద్వారా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జీవో ద్వారా, కొత్త రిజర్వేషన్ విధానాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ జీవో కోసం ప్రభుత్వ ఆమోదం ఇప్పటికే సిద్ధం అవుతోంది. ఈ జీవో అమలు చేయడం ద్వారా, తెలంగాణలో బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, పంచాయతీ ఎన్నికలలో మరింత ప్రాతినిధ్యం ఉంటుంది.




## కాళేశ్వరం పీపీటీ ప్రజెంటేషన్‌పై మాటల యుద్ధం..

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరంపై అసెంబ్లీలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ నాయకులకు మధ్య మాటలయుద్ధం మొదలయ్యింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీలో పీపీటీ ఇస్తామని చెప్తుంటే.. కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని ఆరోపించారు. పీపీటీకి అవకాశం ఇవ్వడం లేదంటే.. వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే.. ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని చురకలు పెట్టారు. ఏ విషయం గురించైనా నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే.. హరీష్ రావు మాట్లాడిన మాటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చే సాంప్రదాయం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని లేఖ కూడా రాసినట్లు గుర్తుచేశారు. అయినా తమకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. అప్పుడు లేనిది ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6500 కోట్లు వడ్డీ కట్టడంలేదని బీఆర్ఎస్ చేస్తోన్న వాదన సరికాదని విమర్శించారు. వడ్డీ తాము కట్టకపోతే.. బీఆర్ఎస్ నేతలు కడుతున్నారా..? అని భట్టి నిలదీశారు.




## లోకల్ వార్ కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.. సెప్టెంబర్ లోనే స్థానిక ఎన్నికలు

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. స్థానిక ఎన్నికల నిర్వహణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సెప్టెంబర్ లో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనుంది. ఇదే జరిగితే సెప్టెంబర్ లో స్థానిక ఎన్నిల నగారా మోగనుంది.

**రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత...** సీఎం రేవంత్ అధ్యక్షతన ఆగస్టు 30న జరిగిన తెలంగాణ కేబినెట్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది.

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్...** అంతేగాకుండా మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. ఈ సారి అమీర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది.

**స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ..** రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రభుత్వం నుంచి అందిన సంకేతాలతో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాల సవరణ, తుది జాబితా ప్రచురణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నోటిఫికేషన్ జారీ చేశారు.

# ఇక మంత్రిగా అజారుద్దీన్?

## జూబ్లీహిల్స్ రేస్ నుంచి తప్పించడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఇదేనా?




స్టేట్ పాలిటిక్స్ కాక రేపుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల వేళ స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ బై పోల్ చుట్టూ రాజకీయం జోరందుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాంతో పాటు అజారుద్దీన్‌కు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించడం అందరిని సర్ ప్రైజ్ లోకి నెట్టింది. మీర్ అలీఖాన్ ను పక్కన పెట్టి అనూహ్యంగా అజారుద్దీన్ పేరును ఖరారు చేయడం చర్చనీయాశం అవుతున్నది. ఓ వైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న అజారుద్దీన్ ను ఉన్నట్టుండి శాసనమండలికి పంపించాలన్న కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం౦%) అధిష్ఠానం ఆలోచన వెనుక స్ట్రాటజీ ఏంటి అనేది ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ అయింది. సమీకరణాల దృష్ట్యా అజారుద్దీన్ ఎమ్మెల్సీగా విజయం ఖాయం కావడంతో పాటు ఆయనకు డబుల్ బోనస్ దక్కబోతున్నదని టాక్ వినిపిస్తోంది.

**మంత్రిగా అజారుద్దీన్?:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పార్టీ తరఫున మైనార్టీ నేతలెవరూ ఎమ్మెల్యేలుగా గెలవకపోవడంతో కేబినెట్ లో ఆ వర్గానికి స్థానం దక్కలేదు. అలాగే హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ కు ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఈ జిల్లాకు సైతం మంత్రి వర్గంలో ప్రాతినిథ్యం లేదు. ఈ క్రమంలో హైదారాబాద్ కు చెందిన మైనార్టీ వ్యక్తి మీర్ అలీఖాన్ కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినా మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. ఈ క్రమంలో అజారుద్దీన్ ను అన్‌ఎక్స్పెక్టెడ్ గా ఎమ్మెల్సీగా ప్రకటించడం వెనుక ఈయనను మంత్రి వర్గంలోకి తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఇటు మైనార్టీ కోటా, హైదరాబాద్ జిల్లా కోటా కింద అజారుద్దీన్ కు మంత్రి వర్గంలోనూ చోటు కల్పించాలనే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుందనే చర్చ జరుగుతోంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్సీగా గెలుపొందినా మంత్రి పదవి విషయంలో అజారుద్దీన్ అదృష్టాన్ని ఖరారు చేసేంది మాత్రం జూబ్లీహిల్స్ బై పోలేనా అనే చర్చ తెరపైకి వస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మరో మైనార్టీ నేతను రంగంలోకి దింపకుండా ఇతర సామాజిక వర్గానికి చెందిన నేతను బరిలోకి దింపితే అజారుద్దీన్ కు మంత్రి పదవి దాదాపు ఖాయం అని అలా కాకుండా మైనార్టీ నేతనే బరిలోకి దింపినా అజారుద్దీన్ మంత్రి పదవి ఆశలపై మరింత ఉత్కంఠ తప్పదనే టాక్ వినిపిస్తోంది. ఇక సమీకరణాల నేపథ్యంలో ఎంఐఎం పార్టీ సైతం కీలకం కాబోతున్నదనే టాక్ సైతం ఉంది.

**జూబ్లీహిల్స్ రేస్ లో ఎవరు?:** అజారుద్దీన్ పేరును ఎమ్మెల్సీగా ఖరారు చేయబోతున్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో (%జీబఎఱ-శ్రీవవ ఎఱశ్రీశ్రీం ఎఎ జూశీశ్రీశ్రీ%) కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. తాజా పరిణామాలతో ప్రస్తుతం మరో కొంత మంది పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఖైరతాబాద్ డీసీసీ చీఫ్ గా ఉన్న రోహిన్ రెడ్డి, నవీన్ యాదవ్, బొంతురామ్మోహన్ పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. మంత్రి పదవి కోరుతున్న దానం నాగేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల పేర్లు సైతం పరిశీలనలో ఉన్నాయని గాంధీ భవన్ వర్గాల సమాచారం. బీఆర్ఎస్ నుంచి మాగంటి కుటుంబ సభ్యులే పోటీ చేస్తారని ఇందుకు ఆ పార్టీ అధిష్టానం సైతం దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కు సిట్టింగ్ స్థానం కావడం, స్థానిక ప్రజలతో ఆ కుటుంబానికి అనుబంధం ఉండటంతో కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యర్థి విషయంలో లోకల్ ఫ్లేవర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ మైనార్టీయేతర వ్యక్తిని రంగంలోకి దింపుతుందనే అంచనాతో పాటు బీజేపీ సైతం మైనార్టీ ఇష్యూను తమ అస్త్రంగా మలుచుకునే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ సైతం మైనార్టీయేతర వ్యక్తినే అభ్యర్థిగా ప్రకటించి ఈ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు పక్కాగా స్కెచ్ వేస్తున్నట్లు తెలుస్తోంది.

# తగ్గేదే లే!

## అమెరికాకు ఇండియా షాక్..

## ఆ బెదిరింపులు ఇక్కడ సాగవ్, ఇది కొత్త భారత్!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇష్టానుసారంగా టారిఫ్ విధిస్తూ భారత్ ను బెంబేలెత్తిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పైనే అందరి దృష్టి నిలిచింది. ఆయన ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు? తదుపరి చర్యలు ఎలా ఉండబోతోన్నాయనేది చర్చనీయాంశమైంది. ఈ పరిణామాల మధ్య ట్రంప్ కు చెక్ పెట్టనున్నారు ప్రధాని మోదీ. త్వరలోనే చైనా పర్యటన చేపట్టనున్నారు. మూడు రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో చైనా సుప్రీమ్ గి జిన్ పింగ్ తో ముఖాముఖి భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలపై చర్చించనున్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొనడానికి మోదీ ఈ నెల 31వ తేదీన చైనాకు బయలుదేరి వెళ్లనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు టియాన్జియాన్ లో బస చేయనున్నారు. దాదాపుగా ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోదీ ఆ దేశ పర్యటనకు వెళ్లబోతోండటం ఇదే తొలిసారి. 2020లో వీటిని నిలిపివేసింది కేంద్ర ప్రభుత్వం. లఢక్ తూర్పు ప్రాంతం సమీపంలో వాస్తవాధీన రేఖ వద్ద గల గాల్వన్ వ్యాలీలో 2020 జూన్ 15, 16వ తేదీల్లో భారత్- చైనా సైనికుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటనలో 20 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఆ ఘర్షణల్లోనే తెలంగాణకు చెందిన కల్నల్ బీకుమల్ల సంతోష్ బాబు అమరుడయ్యారు. ఈ ఘర్షణలు జరిగినప్పటి నుంచి వాస్తవాధీన రేఖ వద్ద చాలాకాలం పాటు యుద్ధ వాతావరణం కొనసాగుతూనే వచ్చింది. ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటోన్నాయి. ఇటీవలే విదేశాంగ శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ చైనాలో పర్యటించారు. ఆ దేశ పౌరులకు విసాలను సైతం కేంద్రం పునరుద్ధరించింది. డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని మోదీ చైనా పర్యటన చేపట్టారు. జిన్ పింగ్ తో సమావేశం కానున్నారు. ఇవి- డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టినట్టవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. ఇరు దేశాల వాణిజ్యం, కనెక్టివిటీ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత సూత్రాల పై చర్చిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తన్మయ్ లాల్ తెలిపారు. ఈ ఆదివారమే టియాంజియాన్‌లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ భేటీ ఏర్పాటు కానుంది. 20 మందికి పైగా వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు దీనికి హాజరు కానున్నారు. మోదీతో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇందులో పాల్గొననున్నారు. మధ్య-ఆసియా, మిడిల్ ఈస్ట్, దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాల అధ్యక్షులు, ప్రధానులు, విదేశాంగ మంత్రులు హాజరవుతారు.

చురకలు






హైదరాబాద్: ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు.

మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.




హైదరాబాద్: మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టకుండా చూడాలన్నారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది.

తప్పులు చేశారో.. లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీశ్‌రావు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వట్లేదంటే.. అధికార పక్షం భయపడుతున్నట్లే అని పేర్కొన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు.

## తప్పులు చేసిన వారికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు?: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు.



**యూరియా కోసం కేంద్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చాం: మంత్రి తుమ్మల..** తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు వివరించారు.

**కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు: విజయశాంతి....** తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. "వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లీకి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండి" అని విజయశాంతి అన్నారు.

## కాళేశ్వరంపై వేసింది పీసీ ఘోష్ కమిషన్ కాదు.. పీసీసీ కమిషన్: కేటీఆర్

హైదరాబాద్: గన్‌పార్క్ వద్ద భారత రాష్ట్ర సమితి నేతలు నిరసన తెలిపారు. ఖాళీ యూరియా సంచులతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన చేపట్టారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. కొరత తీర్చి రైతులను ఆదుకోవాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని నినాదాలు చేశారు. అన్నదాతలకు వెంటనే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "తూతూమంత్రంగా 4 రోజుల అసెంబ్లీ నడపడం కాదు.. 15 రోజులు నిర్వహించాలి. వరదల వల్ల పంట నష్టపోయిన రైతుల గురించి, ఎరువుల కొరతతో పడుతున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ప్రభుత్వం ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వ్యవసాయ సంక్షోభంపై మాట్లాడే అవకాశమివ్వాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కూడా చర్చ జరగాలి. రాష్ట్రంలో వర్షాల వల్ల చాలా చోట్ల సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అర్థవంతమైన చర్చ జరగడానికి భారత రాష్ట్ర సమితి ఎప్పుడూ ముందుంటుంది. కాళేశ్వరంపై వేసింది పీసీ ఘోష్ కమిషన్ కాదు..



పీసీసీ కమిషన్. తప్పులతడక లాంటి కమిషన్ నివేదికపై మా వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు చెప్తాం. 70 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారు. మీరు రైతుబంధు ఇవ్వరు, రుణమాఫీ చేయరు, సకాలంలో ఎరువులు, విత్తనాలు ఇవ్వరు. పదేళ్లు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ ఒక్కరోజూ ఎరువుల గురించి రైతులకు ఈ సమస్య రాలేదు. ఎరువులు ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెటింగ్, యూరియా మాఫియా చేస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు.

## వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన.. పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్: రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రాల్లోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు.

గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. తాము రాజకీయాల కోసం రాలేదని.. రైతుల కోసం వచ్చినట్లు పేర్కొన్నారు. యూరియా కోసం వెళ్తే రైతులపై దాడి చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొరత సమస్యపై ఒక్కరోజైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు.

## సురవరం సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: పేదల జీవితాలలో మార్పు రావాలని.. వారి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని కొనియాడారు. సమాజంలో అనాగరికాలు రూపుమాపేలా ఆయన ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టారన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం హాజరయ్యారు. "మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యంగెస్ట్ ఎంపీ. సురవరం సుధాకర్‌రెడ్డి గుర్తింపు, ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు



ఇష్టపడతారు. ప్రజల తరఫున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరఫున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారు'' అని సీఎం వ్యాఖ్యానించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ రెండురోజుల పాటు చైనాలో పర్యటించనున్నారు. అమెరికా సుంకాల మోత వేళ జరుగుతోన్న ఈ పర్యటనపై భారత్, చైనా నుంచి ఆసక్తి వ్యక్తమవుతోంది. ఈ రెండు దేశాలు సాంస్కృతికంగా ఎలాంటి సంబంధాలు కలిగిఉన్నాయో తెలియజేసే ఒక చిత్రాన్ని అక్కడి రాయబార కార్యాలయం పోస్ట్ చేసింది.

"టాంగ్ రాజవంశం కాలంలో, మొగావో గుహలలో కనిపించిన గణేశుడి ప్రతిమలు ఇవి. శతాబ్దాల కాలం నుంచే ఇరుదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయనే దానికి ఇవొక అందమైన ప్రతీకలు" అని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యూజింగ్ ఆ చిత్రాలను షేర్ చేశారు. ఒకవైపు మోదీ పర్యటన, మరోవైపు దేశమంతా గణేశ్ నవరాత్రులు నిర్వహించుకుంటోంది. ఈ తరుణంలో ఆ పోస్టు వైరల్‌గా మారింది. నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం రాత్రి దిల్లీ నుంచి జపాన్‌కు బయలుదేరారు. ఈనెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు కొనసాగే పర్యటనలో తొలి రెండు రోజులు జపాన్‌లో, తర్వాత చైనాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేతతో సమావేశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రధాని మోదీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న చైనాలోని తియాన్జిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు హాజరవుతారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. ఎస్‌సీవో సదస్సులో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా 20 మందికిపైగా ప్రపంచ నాయకులు పాల్గొనున్నారు. ఇదిలాఉంటే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థకు స్థిరత్వం తీసుకువచ్చేందుకు భారత్–చైనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధాని చెప్పారు. పరస్పర గౌరవం, ఉభయదేశాల ప్రయోజనాలు, సున్నితత్వాల ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక కోణంలో మున్ముందుకు తీసుకువెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. "ఇవి ఇరుగుపొరుగున ఉన్న అతిపెద్ద ప్రపంచదేశాలు. వీటిమధ్య సంబంధాలు బాగుంటే దాని ప్రభావం ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్త శాంతి, సుసంపన్నతలపై పడుతుంది" అని వ్యాఖ్యానించారు.




## అమెరికా బ్రాండ్ పతనమైంది.. భారత్‌పై సుంకాలు విధించడాన్ని తప్పుబట్టిన మాజీ అధికారి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల చర్యపై తీవ్రంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా జాతీయ మాజీ భద్రతా సలహాదారు జేక్ సులేవాన్ కూడా భారత్‌పై సుంకాలు విధించడాన్ని తప్పుబట్టారు. ఈ సుంకాల కారణంగా అమెరికా బ్రాండ్ పతనమైందని ఆందోళన వ్యక్తంచేశారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిత్ర దేశాలతో సహా ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పుడు అమెరికాకు భాగస్వామిగా ఉండేందుకు ఇష్టపడటం లేదన్నారు. యూఎస్‌ను విఘాతం కలిగించే దేశంగా చూస్తున్నారన్నారు. ఈక్రమంలో చైనా వైపు ఆదరణ పెరిగిపోతుందన్నారు. ఇందుకు భారత్ ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. న్యూదిల్లీపై పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంతో.. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. దీంతో ఆ దేశం బీజింగ్‌తో భాగస్వామ్యం బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ బ్రాండ్ టాయిలెట్‌లో ఉంది. భారత్‌పై ట్రంప్ భారీ వాణిజ్య దాడి చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా న్యూదిల్లీ ఇప్పుడు చైనాతో కలవాలని చూస్తోంది' అని జేక్ సులేవాన్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో.. భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల వేళ మధ్యవర్తిత్వానికి భారత్ క్రెడిట్ ఇవ్వకపోవడం ట్రంప్ కోపానికి కారణమని అమెరికా ఫైనాన్షియల్ సేవల సంస్థ జెఫరీస్ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. ఈక్రమంలో ట్రంప్ వ్యక్తిగత కోపంతో భారత్‌పై 50శాతం సుంకాలు విధించారని తెలిపింది.




## 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి.. కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్: నేడు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన చేపట్టింది. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలని ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు(శనివారం) శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలపైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభంపైన మాట్లాడటం లేదని మండిపడ్డారు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదని ఉద్ఘాటించారు. రైతులు గంటలు తరబడి లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదని స్పష్టం చేశారు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు..? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే దుస్థితి ఎందుకు వచ్చిందని ధ్వజమెత్తారు. పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థలు పడుతున్నారని చెప్పుకొచ్చారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాల పైన చర్చిద్దామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వాటి పైన కూడా చర్చ జరగాలని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, సమస్యలపైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరంతో పాటు అన్ని అంశాలపైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అది పీసీ గోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ గోష్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. దానిపైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

చురకలు



# ఆగస్టు 31... బ్రిటిష్ సైన్యానికి ఢిల్లీ వశమైన దినం

## - ప్రథమ స్వాతంత్ర్య సమర చారిత్రక నేపథ్యం

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. 1857 మే 10 న మీరట్‌లో సిపాయీలతో మొదలైన తిరుగుబాటు, మే 11న సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించడం, ఈ క్రమంలో తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. "ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది". తిరుగు బాటుకు ముఖ్య కారణ నేపథ్యాన్ని పరిశీలిస్తే...1856 డిసెంబరులో బ్రిటిష్ పాలకులు రాయల్ ఎన్ఫీల్డ్ (పి/53 లీ ఎన్ఫీల్డ్ రైఫిల్ 557 కాలిబర్) తుపాకీని ప్రవేశ పెట్టారు. దానికి వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉండేది. ఈ తుటాల చివర ఆవు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రం, పంది ముస్లింలకు నిషేధం. కాబట్టి తూటాలను కొరకడాన్ని భారతీయ సిపాయిలు నిరాకరించారు. ఈ కొత్తరకం తుపాకులు ఇంగ్లండ్ లో ఆయుధ ఫ్యాక్టరీలో తయారయ్యేవి. ఇది హిందూ, ముస్లిం సైనికులను క్రైస్తవులుగా మార్చడానికి పన్నిన కుట్రగా భావించిన సిపాయిలు తిరుగుబాటుకు పూనుకున్నారు. ఆయితే బ్రిటీష్ వారు ఆ తూటాలను మార్చామనీ, కొవ్వులను తేనె పట్టునుండి లేదా నూనె గింజల నుండి సొంతంగా తయారు చేసుకోవటాన్ని ప్రోత్సహించామని చెప్పినప్పటికీ అవి సిపాయిలకు నమ్మకాన్ని కలిగించలేక పోయాయి. 1857 మార్చినెలలో 34వ దేశీయ పదాతి దళానికి చెందిన మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ సార్జంట్ మీద దాడిచేసి ఆయన సహాయకుని గాయ పరచాడు. జనరల్ హెన్రీ మంగళ్ పాండేను మతపిచ్చి పట్టినవాడిగా భావించి, మంగళ్ పాండేను బంధించమని జమేదార్ని ఆజ్ఞాపించటం, జమేదార్, హెన్రీ ఆజ్ఞను తిరస్కరించటంతో తిరుగుబాటు ప్రారంభానికి అంకురార్పణ జరిగింది. బ్రిటీష్ వారు మంగళ్ పాండేను, జమేదారును ఏప్రిల్ 8న ఉరితీసి, దళం మొత్తాన్నీ విధులనుండి బహిష్కరించారు. మే 10న 11వ, 20వ అశ్వదళం సమావేశమై అధికారులను ధిక్కరించి 3వ పటాలాన్ని విడిపించారు. మే 11న ఇతర భారతీయులతో కలసి సిపాయిలు ఢిల్లీ చేరుకొని




చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించి చక్రవర్తిని ఢిల్లీసుల్తాన్ గా తిరిగి అధికారాన్ని స్వీకరించాల్సిందిగా వత్తిడి చేసారు. బహదూర్ షా తొలుత అంగీకరించక పోయినా, తరువాత ఒప్పుకొని తిరుగు బాటుకు నాయకత్వాన్ని వహించాడు. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి విస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. బ్రిటిష్ వారు మొదట వేగంగా స్పందించనప్పటికీ, తరువాత తీవ్రమైన బల ప్రయోగంతో తిరుగు బాటుని అణచి వేసేందుకు యత్నించారు. వారు క్రిమియన్ యుద్ధంలో పాల్గొన్న పటాలాలనీ, చైనా వెళ్ళేందుకు బయలు దేరిన ఐరోపా పటాలాలని తిరుగు బాటును అణచి వేసేందుకు వినియోగించారు. తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. "ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది". ఒకవారం పాటు అడుగడుగునా వీధిపోరాటం జరిగింది. అయితే తిరుగుబాటు దారుల మీద బ్రిటీష్ వారు విజయం సాధించి నగరాన్ని తిరిగి ఆక్రమించారు. 1857 మే 10 న మీరట్‌లో సిపాయీలతో మొదలైన తిరుగుబాటు, ఉత్తర గంగా మైదానంలోను, మధ్య భారతంలోనూ పౌర తిరుగు బాటుగా మారి. తూర్పు భారత దేశంలో కూడా తిరుగుబాటు విస్తరించి, ఆయా ప్రాంతాల్లో బ్రిటిషు వారి అధికారాన్ని పెద్ద ఎత్తున సవాలు చేసి,1858 జూన్ 20 న తిరుగుబాటు దార్లను ఓడించడంతో పూర్తయింది. అలా ఉత్తర, మధ్య భారతదేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు

## ఆగస్టు 31... ఆదిభట్ల నారాయణదాసు జయంతి





తెలుగువారి కళాసాహిత్య సంగీత చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృష్టించిన అపురూప కళారూపం హరికథ. కేవలం ఒక్క కళాకారుడు సంగీత, సాహిత్య, నృత్య, అభినయ కళాభినివేశంతో మృదంగం, వయొలిన్ వాద్య సహకారంతో శ్రోతలను ఆధ్యాత్మిక, కళాసాగరంలో ఓలలాడించే కళారూప సృష్టి హరికథ. సంగీతం, సాహిత్యం మరియు నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని సృజించి 'హరికథా పితామహులుగా, కథావాగ్గేయకారులు'గా ప్రఖ్యాతిగాంచారు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన ప్రాచీన వాగ్గేయకారుల కోవకు చెందినవారు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు చేర్చారు. మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచన చేసి, తెలుగు నాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలను పొందిన కళాకారుడాయన. హరికథ' అనే పేరువింటే నారాయణదాసు, నారాయణదాసుగారు పేరువింటే 'హరికథ' తెలుగు రాష్ట్రములలో వెంటనే స్ఫురిస్తాయి. నారాయణదాసుగారు జగత్ప్రసిద్ధులైన హరికథక పితామహులు, కారణ జన్ములు, విద్వత్కవీంద్రులు, భక్తాగ్రణ్యులు. తాము జీవితంలో భక్తినీ, రక్తినీ, ముక్తినీ పుష్కలంగా పొంది తమను దర్శించిన వారికీ, విన్నవారికీ, శుశ్రూష ఒనర్చినవారికీ వాటిని ప్రసాదించిన మహానుభావులు. వేదశాస్త్ర పురాణేతిహాసాదులలోని సర్వసారజ్ఞులు. సంగీత, సాహిత్య, కవితా, నృత్య వాద్యములలో అసమాన ప్రజ్ఞాధురీణులు, కళాప్రపూర్ణులు, సర్వస్వతంత్రులు. శృంగారరస భరితులు, సరస్వతీ అంశ సంభవులు, గాన గంధర్వులు. హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు. పంచముఖి, షణ్ముఖివంటి అసాధ్యములైన తాళములలో రచనలుచేసి, గానంచేసి విద్వాంసుల మన్ననలు పొందిన ఘనవిద్వాంసులు. సహజ పాండిత్య మండితులై సంగీతము, సాహిత్యము, నాట్యము, పాత్రాభినయము, కవిత్వము, వేదాంతము, వ్యాకరణము, జ్యోతిష్యము, ఆయుర్వేదము ఆది విద్యలలోబీ సంస్కృతము, ఆంధ్రము, హిందీ, ఉర్దూ, పారసీకము, అరబ్బీ భాషలయందు అసమానమైన పాండిత్యమును సంపాదించారు. తారకం, హరికథామృతం అనే సంస్కృత కావ్యాలను రచించి జర్మను పండితుల మెప్పు పొందారు. ఋగ్వేదాన్ని స్వర సహింతంగా అచ్చ తెనుగులోనికి అనువదించి వేదంలోని విజ్ఞానాన్నీ, మంత్రమహిమని తెలుగువారికి తెలియచేసారు. ఆంగ్లభాషనుండి వివిధ కవుల రచనలు కొన్ని కొన్నిటిని విశ్లేషించి షేక్స్పియర్ నాటక రంగములోని ఘట్టములను హృద్యముగా తెలుగు లోకి అనువదించారు. ఆయన గాత్ర నిస్వనంలో మైకు, లౌడ్ స్పీకర్లు సహజంగానే అమరి ఉన్నాయంటారు. కంఠం ఎత్తిపాడితే అయిదువేల శ్రోతలకైనప్పటికీ అవలీలగా అందే గాత్ర సౌలభ్యం ఉండేదట. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగష్టు 31న ఆంధ్రప్రదేశ్ లోని నాటి పార్వతీపుర సమీప అజ్జాడ అనే గ్రామంలో (ప్రస్తుతం విజయనగరం జిల్లా) వేంకటచయన, లక్ష్మీనరసమాంబలకు జన్మించారు. ఆయన అసలు పేరు సూర్యనారాయణ. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక ఆయన నారాయణ దాసుగా మార్చుకున్నారు. ఏకసంధాగ్రహిగా, చిరు ప్రాయంలోనే పద్యాలు, శ్లోకాలు విని కంఠస్థం చేసేవారు. కేవలం ఐదేళ్ళ వయసులో నే భాగవతంలోని పద్యాలు ఎన్నో చెప్పేవారట. హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు రాష్ట్రములలో దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయులు. కవిత్వం చెప్పే నైపుణ్యంకూడా ఉండేది. పోతన భాగవతము వలన ప్రభావితులై, ఎన్నో హరికథలను రచించారు. కథాకాలక్షేపము విలక్షణమైనది. స్వవిరచిత కథతో, కవిత్వము, పాటలతో పామరులను సైతం చమత్కారమగు మాటలతోను మెప్పించేవారట. మైసూరు మహారాజు దర్బారులో తన వీణావాద్య కౌశల్యంచే మహారాజు మెప్పుపొంది సన్మానాలు అందుకొన్నారు. మహారాజు గాత్రాన్ని ఫోనోగ్రాముద్వారా రికార్డు చేయించుకొని తరచూ వినేవాడట. విజయరామ గాన కళాశాల ప్రథమ ప్రధానాచార్య (1919లో) పదవిలో 17 ఏళ్లు పని చేశారు. జానకీశపథము, రుక్మిణీ కళ్యాణము, గజేంద్ర మోక్షము, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానము, మార్కండేయోపాఖ్యానము, భీష్మ చరిత్రము, సావిత్రీ చరిత్రము, యదార్థ రామాయణము మున్నగు హరికథలు, హరికథలు రచించారు. పెక్కు శతకములను (శ్రీరామచంద్రశతకము, కాశీ శతకము), కావ్యములను (ఉమర్ ఖయాం, బాటసారి), జగజ్జ్యోతి అనే వేదాంత గ్రంథమును, తారకమను శృంగార ప్రబంధమును, 'నవరసతరంగిణి' అను సంగీతశాస్త్ర గ్రంథమును రచించినారు. భారత కోకిల' సరోజినీదేవి నాయుడు, 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాకూర్, సుప్రసిద్ధ గాయనీమణి జానకిబాయి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, వంటి మహనీయుల ప్రశంసలనందుకొన్న ప్రతిభాశాలి. ఆయన రచించిన 'జానకీ శపథం' (ఉత్తర రామచరిత్ర) హరికథ ఒక సంగీత కళాఖండం. అందులో ఆయన పూర్వాంగ, ఉత్తరాంగములకు చెందిన 35 రాగాలను తీసి, వాటిలో కీర్తనలు వ్రాసారు. ఆ కీర్తనలు గానం చెయ్యడం సామాన్య సంగీత కళాకారులకు కష్ట సాధ్యం. కలకత్తానుండి కన్యాకుమారి వరకు దాసు దేశ పర్యటనలు చేసేవారు. చిన్న గ్రామాలు, పట్టణములు, సంస్థలు విద్వత్సభలలో, దేవాలయాలలో, రాజ దర్బారులలో, అంతఃపురాలలో దాసుగారు చేసిన హరికథా కార్యక్రమాలు వేలకువేలు ఉన్నాయి. సామాన్యులు మొదలుకొని ప్రతిభావంతులు, అష్టావధాన శతావధానులు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, కాశీ కృష్ణమాచార్యులు, జంధ్యాల పాపయ్యశాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణ (రాష్ట్రపతి)... ఒక్క రేమిటి అన్ని వర్గాల వారు వేలాద దాసుగారి హరికథా గానానికి, కవితాశక్తికి, సంగీత - లయల పాండిత్యానికి, ముగ్ధులై ఆనందిచేవారట. సుమారు ఆరున్నర దశాబ్దాల సంగీత, సాహిత్య, హరికథా కళా ప్రస్థానంలో ఆయన అందుకోని సన్మానం లేదేమో. రాజ సన్మానాలూ, పౌర సన్మానాలూ, బిరుదు ప్రదానాలూ, గజారోహణలు, సువర్ణ ఘంటాకంకణ ధారణలూ, గండపెండేర ధారణలూ ఇలా ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు లభించాయి. దైవ సంకల్పమో, యాదృచ్ఛికమో గాని, త్యాగరాజు మరణించిన తిథి పుష్య బహుళ పంచమినాడే, 1945 జనవరి 2న, నారాయణదాసు దేహాన్ని వదలి వెళ్లడం విశేషం.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# చెరగని గీతలు...బాపు బొమ్మలు - ఆగస్టు 31... బాపు వర్ధంతి







ముగ్ధ మనోహర రూపాల సౌందర్యాన్ని నయనానంద కరంగా చూపే కుంచె పేరే బాపు. బాపు గీసే బొమ్మలు మాట్లాడతాయి, సిగ్గు పడతాయి, నవ్విస్తాయి, వెక్కిరిస్తాయి, సకల చేష్టలూ ప్రదర్శిస్తాయి. బాపు రేఖాచిత్రాలు ఎలా గీసినా అవన్నీ కార్టూన్లు అయి సమ్మోహన పరుస్తాయి. అందమైన అమ్మాయికి మారుపేరు 'బాపు బొమ్మ'. బాపు రమణతో కలిసి సృష్టించిన బుడుగు, సీగాన పెసూనాంబ, రెండుజెళ్ళ సీత, అప్పుల అప్పారావు, గిరీశం, లావుపాటి పెళ్ళాం-బొచ్చుకుక్క లాంటి బుజ్జి మొగుడూ... వీరంతా గుర్తుకు వస్తే నవ్వు కాకుండా ఉండడం అసాధ్యం. బాపు వర్ధంతి ఆగస్టు 31న ఆ సందర్భంగా బాపు జ్ఞాపకాలు కొన్ని. బాపు (డిసెంబరు 15, 1933 - ఆగష్టు 31, 2014) బాపు గీత, బాపు వ్రాతలను తెలుగువారి సంస్కృతిలో భాగం చేసుకున్న బహుముఖ ప్రజాశాలి బాపు. అయన చిత్రం ప్రచురించని తెలుగు పత్రికలు బహు అరుదు. బాపు అసలు పేరు సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ. బాపు డిసెంబరు 15, 1933 వ సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం కంతేరులో వేణు గోపాల రావు, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించాడు. 1955 వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి లాయర్ పట్టా పుచ్చుకున్నాడు. అదే సంవత్సరం ఆంధ్ర పత్రిక దినపత్రికలో వ్యంగ్య చిత్రకారునిగా చేరారు. బాపు చిత్రకళ ఒక విషయానికి పరిమితం కాలేదు. 1945 నుండి బాపు చిత్రాలనూ, వ్యంగ్య చిత్రాలనూ, పుస్తకాల, పత్రికల ముఖ చిత్రాలనూ, కథలకు బొమ్మలనూ, విషయానుగుణ చిత్రాలనూ పుంఖాను పుంఖాలుగా వేశాడు. కొత్త రచయితలూ, ప్రసిద్ధ రచయితలూ, పురాణాలూ, జీవితమూ, సంస్కృతీ, రాజకీయాలూ, భక్తీ, సినిమాలూ - అన్ని రంగాలలో ఆయన గీతలు వాసికెక్కాయి. దర్శకుడిగా బాపు మొదటి చిత్రం సాక్షి. తరువాత ఆయన ఎన్నో వైవిధ్యమైన దృశ్య కావ్యాలను వెండి తెరపై సృష్టించారు. అందులో 'ముత్యాల ముగ్గు' సినిమాను తెలుగు సినిమా ప్రేక్షకులు ఎప్పటికీ మరచిపోలేరు. బాపు దర్శకత్వంలో వచ్చిన తెలుగు, హిందీ సినిమాలు అవార్డులు, రివార్డులు పొందటముతో పాటు అచ్చ తెలుగు సినిమాకి ఉదాహరణలుగా చరిత్రలో నిలిచిపోయ. బాపు-రమణలవి అవిభాజ్య శరీరాలు. ఒకరిది లేఖా చిత్రమైతే, మరొకరిది రేఖా చిత్రం. రెండూ కలిస్తే మనోహర చిత్రం... అదే చలనచిత్రం. అందుకే బాపు, రమణ లను వేరు చేసి చూడలేం. 1942లో అప్పటి మద్రాసులోని పీఎస్ హైస్కూల్లో ఐదు, ఆరు తరగతులు కలిసి చదువు కున్నప్పటి నుంచి బాపు, రమణల మధ్య స్నేహం పరిమళించింది. అది చివరి వరకూ కొనసాగింది. పాఠశాల రోజుల్లోనే 'బాల' అనే చిన్నపిల్లల మ్యాగజైన్‌కు 'అమ్మమాట వినకపోతే' అనే కథను రమణ రాస్తే, దానికి బాపు బొమ్మలు వేశారు. అలా వారి ప్రయాణం మొదలైంది. . రమణ రాత, బాపు గీతలో వెలువడ్డ 'కోతికొమ్మచ్చి' 'బుడుగు'లు తెలుగు సాహితీవనంలో ఎన్నటికీ వాడిపోని అక్షర సుమాలు. దర్శకుడిగా బాపు మొదటి చిత్రం సాక్షి. తరువాత ఆయన ఎన్నో వైవిధ్యమైన దృశ్య కావ్యాలను వెండితెరపై సృష్టించారు. అందులో 'ముత్యాలముగ్గు' సినిమాను తెలుగు సినిమా ప్రేక్షకులు ఎప్పటికీ మరచి పోలేరు. 1967లో సాక్షి (సినిమా) చిత్రదర్శకునిగా సినిమా రంగంలో అడుగు పెట్టిన బాపు మొదటి చిత్రంతోనే ప్రసంసలు అందుకొని, మొత్తం 41 చిత్రాలకు దర్శకత్వం వహించాడు. బాపుకు స్వదేశీ, విదేశీ పురస్కారాలు ఎన్నో లభించాయి. సీతాకల్యాణం సినిమా లండన్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్, షికాగో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. బాపు దర్శకత్వం వహించిన ముత్యాల ముగ్గు చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (1975 వ సంవత్సరం) భారత ప్రభుత్వ బహుమతి, 1986 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఎ.పి కళా వేదిక ద్వారా రఘుపతి వెంకయ్య స్మారక బహుమతి మదర్ థెరిస్సా బహూకరించగా తన స్నేహితుడు ముళ్ళపూడి వెంకట రమణతో కలిసి స్వీకరించారు. చెన్నై (తమిళనాడు) శ్రీ రాజలక్ష్మి ఫౌండేషన్ వారి రాజ్యలక్ష్మి బహుమతి 1982లో, 1991లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ కళాప్రపూర్ణ, 1992లో అమెరికా తెలుగు అసోసియేషన్ వారిచే శిరోమణి బహుమతి అమెరికాలో స్వీకరణ,1993లో మిస్టర్ పెళ్ళాం సినిమాకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా భారత ప్రభుత్వ బహుమతి, 1995లో తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా (%తానా%) వారిచే తెలుగు చిత్ర కళా, సాహిత్య, సాంస్కృతిక, సినిమా రంగాలకు తన ఏభై సంవత్సరాల (గోల్డెన్ జూబ్లీ సెలెబ్రేషన్) సేవకు గాను ఘన సన్మానం, బాపు మీద ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు వంశీ తీసిన డాక్యుమెంటరీ చిత్రానికి 1996 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డు, 2001 జూన్ 9 వ సంవత్సరంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్స్ వారిచే జీవిత సాఫల్య బహుమతి, 2002లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట బహుమతి, అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్, తిరుపతి వారిచే ప్రెసిడెంట్ అఫ్ ఇండియా అవార్డు, బాలరాజు కథ (1970), అందాల రాముడు (1973), ముత్యాల ముగ్గు (1975), పెళ్లి పుస్తకం (1991), మిస్టర్ పెళ్ళాం (1993), శ్రీరామరాజ్యం (2011) సినిమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి నంది పురస్కారాలు, 2013 కు ప్రకటించిన పద్మ పురస్కారాలలో కళల విభాగంలో తమిళనాడు రాష్ట్ర విభాగంలో పద్మశ్రీ బహుమతి లభించాయి. 2014 ఆగస్టు 31న చెన్నైలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాపు తిరిగి రాని లోకాలకు వెళ్లి పోయారు.

**కొంటెబొమ్మల బాపు కొన్ని తరముల సేపు గుండె ఊయలలూపు ఓ కూనలమ్మా!** ఇలా ఆరుద్ర బాపుకు ఎప్పుడో చేసిన పద్యాభిషేకం బాపు అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# సంచలన సర్వే...

# దేశంలో బెస్ట్ సీఎం ఆదిత్యా నాథ్

## తెలుగు రాష్ట్రాల సీఎంల నంబర్ ఎంత!?

సీ-ఓటర్ ఇండియా టుడేతో కలిసి 'మూడ్ ఆఫ్ ది నేషన్' అనే సర్వే నిర్వహించింది. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రజాధరణ పొందిన ముఖ్యమంత్రి ఎవరు అనే అంశంపై సర్వే చేశారు. ఇందులో అత్యంత ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రిగా ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. తాజా సర్వే ప్రకారం, యోగి ఆదిత్యనాథ్ ప్రజాదరణ రేటింగ్ స్వల్పంగా పెరిగి, అత్యధికంగా 36శాతానికి చేరుకుంది. 2025 జూలై 1 నుంచి ఆగస్టు 14 మధ్య ఈ సర్వే కోసం దేశవ్యాప్తంగా 54,788 మంది ప్రజల అభిప్రాయాలను సేకరించారు.ఇందులో అదనంగా సీ-ఓటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా నుండి 1,52,038 ఇంటర్వ్యూలను కూడా విశ్లేషించారు. మొత్తం 2,06,826 మంది అభిప్రాయాలను ఈ నివేదిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. యోగి ఆదిత్యనాథ్ దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలవడం



వరసగా ఇది మూడవ సారి. ఆయన కఠినమైన నిర్ణయాలు, నేరస్తులపై తీసుకుంటున్న చర్యలు, ముఖ్యంగా 'బుల్డోజర్ మోడల్' ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. ఈ జాబితాలో రెండవ స్థానంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ((13%) నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (7%) మూడవ స్థానంలో ఉన్నారు. ఈ సర్వేలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల పనితీరు, ప్రజాదరణపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. చిన్న రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మొదటి స్థానంలో ఉన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురించి మాత్రం ఇందులో ప్రస్తావించలేదు. యూపీలో శాం తిభద్రతల మెరుగుదల, అవినీతి నిర్మూలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలు యోగి ఆదిత్యనాథ్ ప్రజాదరణకు ప్రధాన కారణాలుగా ఈ సర్వే నివేదించింది. అయితే, తన సొంత రాష్ట్రంలో మాత్రం ఆయన ప్రజాదరణ కొంత మేర తగ్గినట్లు గతంలో వచ్చిన సర్వేలు సూచించాయి.

కానీ, దేశవ్యాప్తంగా మాత్రం ఆయనకు తిరుగులేని ఆదరణ ఉన్నట్లు ప్రస్తుత MOTN సర్వే స్పష్టం చేసింది. ఈ సర్వే నివేదిక ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ తర్వాత బీజేపీలో ప్రధాని అభ్యర్థిగా యోగి ఆదిత్యనాథ్‌కు ప్రజలు ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు కూడా వెల్లడైంది. ఈ నివేదిక దేశ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ఈ సర్వేలో ప్రధాని నరేంద్ర మోదీ తర్వాత బీజేపీలో ప్రధాని అభ్యర్థిగా ప్రజలు ఎవరిని ఇష్టపడుతున్నారని అడగ్గా, 28% మంది హోంమంత్రి అమిత్ షాను, 26% మంది యోగి ఆదిత్యనాథ్ పేరు చెప్పినట్లు నివేదిక తెలిపింది. ఇది యోగి ఆదిత్యనాథ్‌కు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాదరణకు అద్దం పడుతోంది.

చురకలు

## సంపాదకీయం

### మోడీ గ్రాఫ్ పెరుగుతోందా..అదెలా అంటే ?

దేశంలో మూడు సార్లు వరసగా ప్రధానిగా ప్రమాణం చేసి కొత్త రికార్డుని నెలకొల్పారు నరేంద్ర మోడీ. పండిట్ నెహ్రూ తరువాత స్థానంలోకి ఆయన ఆ విధంగా వచ్చేశారు. మరోసారి ప్రధాని కావాలని కూడా ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం బీజేపీని మోడీని కొంత నిరాశ పరచాయి. మోడీ నాయకత్వం వహించిన బీజేపీ ఫుల్ మెజారిటీకి దూరంగా నిలిచింది. కేవలం 240 ఎంపీ సీట్లు మాత్రమే సొంతంగా సాధించగలిగింది. అయితే పదిహేను నెలలు గిర్రున తిరగకుండానే దేశంలో రాజకీయం మారుతోందని అది మోడీకి అనుకూలంగా ఉందని తాజా అంచనాలు చెబుతున్నాయి.

**బలమైన నాయకుడిగా :** మోడీకి 2014 నుంచి ఈ రోజు దాకా ఉన్న అతి పెద్ద ప్లస్ పాయింట్ ఏమిటి అంటే బలమైన నాయకుడు అని. ఆయన నాయకత్వం మీద జనాలకు ఆ విధంగా నమ్మకం అయితే ఉంది. ఇక దేశంలోనూ అంతర్జాతీయంగా జరుగుతున్న అనేక పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న ప్రజలు ఈ కీలక సమయంలో ఆయన ఉండడమే సబబు అని భావిస్తున్నారు. భారత్ కి ఈ రోజు పక్కలో బల్లెంలా పాక్ తో పాటు బంగ్లాదేశ్ ఉంది. అలాగే చైనా కూడా భారత్ కి నమ్మదగిన నేస్తం కాదు. ఈ నేపథ్యంతో పాటు నిన్నటిదాకా మిత్రుడిగా ఉన్న అమెరికా ఈ రోజు శత్రువుగా మారి కాలు దువ్వుతోంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు భారత్ కి ఇంటా బయటా సవాళ్ళ అనేకం ఉన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో నరేంద్ర మోడీ నాయకత్వం వీటికి సరైన జవాబు చెప్పగలదని అత్యధికుల విశ్వాసంగా కనిపిస్తోంది అంటున్నారు.

**సరిసాటి లేకుండా పోయారా :** ఒకప్పుడు దేశ రాజకీయాల్లో ధీటైన నాయకులు ఎంతో మంది ఉండేవారు. కానీ రాను రానూ ఆ కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజాకర్షణ కలిగిన నాయకత్వంతో పాటు అత్యధిక శాతం మంది మన్ననలు పొందే లీడర్లు అవసరం ఉంది ఇక ఒక్కసారి చూసుకుంటే కనుక గత పదకొండేళ్ళ నుంచి నరేంద్ర మోడీ దేశంలో ధీటైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆయనకు సరిసాటిగా సమీపంలోకి కూడా వచ్చే వారు పెద్దగా కనిపించడం లేదు అని అంటున్నారు. బీజేపీలో కీలక నేతలు సీనియర్లు ఎంతో మంది ఉన్నా కూడా ఎవరికి వారుగా గొప్పవారే కానీ మోడీ స్థానాన్ని ఆయన స్థాయిని ఆక్రమించేవారు అయితే ప్రస్తుతానికి లేరని అంటున్నారు. ఇక బయట చూసినా విపక్షంలోనూ అదే కొరత ఉంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇపుడిపుడే రాటు తేలుతున్నారు. ఆయనకు పాలనానుభవం అయితే లేదు. అదే విధంగా కాంగ్రెస్ కి మునుపటి ఆదరణ ఇంకా దక్కాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో వస్తున్న సర్వేలు కానీ అంచనాలు కానీ బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని చెబుతున్నాయి.

**సిద్ధాంత రాహిత్యం :** ఇంకో వైపు చూస్తే దేశంలో సాగుతున్న రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే రాద్ధాంతాలతం మీదనే పోరు ఎక్కువగా కనిపిస్తోంది. ఒకనాడు సిద్ధాంత పరంగా పార్టీల మధ్య సమరం సాగేది అది జనాలకు కూడా నచ్చేది కానీ ఇపుడు పూర్తిగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వ్యక్తిగత విమర్శలు ఎక్కువగా చేసుకుంటున్నారు. ఈ పరిణామాల వల్ల జనాలకు ఆయా పార్టీల పట్ల అంతగా మొగ్గు కనిపించేందుకు ఆస్కారం ఉండడం లేదని విశ్లేషణలు ఉన్నాయి.

**చట్ట సభలను వాడుకోవాలి :** రాజకీయంగా పై చేయి సాధించాలంటే సిద్ధాంతపరమైన పోరాటం ఉండాలి. దానికి గానూ చట్ట సభలను ఎక్కువగా ఉపయోగించుకోవాలి. కానీ పార్లమెంట్ లో చూస్తే కనుక ప్రతీ సారీ వాయిదాల పర్వమే సాగుతోంది. ఒకే అంశం మీద మొత్తం సెషన్లు కొట్టుకుని పోతున్నాయి. దాని వల్ల అధికార పక్షానికి పోయేది ఏమీ లేకపోయినా విపక్షానికే రాజకీయంగా నష్టం వాటిల్లుతోంది. ఇవన్నీ కూడా ప్రజల మూడ్ ని కూడా తెలియచేస్తున్నాయి.

**మూడ్ ఆఫ్ ది నేషన్ ఇదేనా :** ఇదిలా ఉంటే ఇండియా టుడే సీ ఓటర్ కలిసి చేసి మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో మరోసారి మోడీ నాయకత్వంలోని బీజేపీకి అవకాశాలు మెరుగు అవుతాయని తేలింది. 2024లో 240 ఎంపీ సీట్లు మాత్రమ సాధించిన బీజేపీ ఈ పదిహేను నెలల్లో మరో ఇరవై సీట్లను పెంచుకుని 260 కి ఎగబాకడం అంటే అది మోడీకి పెరిగిన గ్రాఫ్ గానే చూడాలని అంటున్నారు అదే సమయంలో ఎన్డీయే మిత్రులతో కలిపి ప్రస్తుతం 292 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు ఈ సంఖ్య ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే ఏకంగా 324కి ఎగబాకుతుంది అని అంటున్నారు. అంటే ఇందులో బీజేపీకి పెరిగిన ఇరవై సీట్లు పోనూ మిత్రులు మరో పది సీట్లు ఎక్కువ సాధిస్తారు అని లెక్క తేల్చింది అన్న మాట. చూడాలి మరి ముందు ముందు మోడీ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందో.

# మానవాళికి ఆదర్శం... రాధాకృష్ణుల ప్రేమ తత్త్వం - రాధాష్టమి సందర్భంగా



భాద్రపదమాసం లోని అష్టమి శ్రీకృష్ణ పరమాత్మ పూజకు ఉత్కృష్టమైన రోజు. ఈ నాడు పవిత్ర ప్రేమకు చిహ్నంగా చెప్పబడుతూ ఉన్న రాధా కృష్ణులను పూజించడం సాంప్రదాయం. ఈ దినానికి 'రాధాష్టమి' అని పేరు. ఈ రోజు రాధాకృష్ణులను పూజించడం వల్ల సంసార సుఖం లభిస్తుందని, భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని చెప్పబడుతూ ఉంది. రాధాయ నమః అనే మంత్రాన్ని శ్రీకృష్ణుడు ఆ దేవి నుంచి రాస మండలంలో ఉపదేశ రూపంలో పరిగ్రహించాడని, అదే మంత్రాన్ని గురు పరంపర నుంచి నారదుడు గ్రహించాడని 'పద్మ పురాణం' చెబుతున్నది. రాధ జన్మ వృత్తాంతం గురించి భిన్నగాథలు వ్యాప్తిలో ఉన్నాయి. ఆమె కేదారుడు అనే రాజుకు యజ్ఞ కుండంలో పుట్టిన కుమార్తె అని చెబుతారు. పేరు బృంద అని, కృష్ణుణ్ని భర్తగా పొందాలని కోరి తపం ఆచరిస్తే ఆయన ప్రత్యక్షమయ్యాడని విశ్వసిస్తారు. ద్వాపర యుగంలో రాధ తనను సేవించడం వల్ల ఆ ప్రదేశం 'బృందావనం'గా మారుతుందని వరమిచ్చాడనీ ఆ గాథ సారాంశం. వృష భానుడు, కళావతి దంపతులకు పుట్టిన తనయకు గర్గ మహాముని 'రాధ' అని నామకరణం చేశాడు. బ్రహ్మవైవర్తం ప్రకారం, దూర్వాస ముని 'రసరశ్మి' అని పేరు పెట్టాడు. శ్రీకృష్ణుణ్ని రాధాదేవి తన మనసులో లయం చేసి విజయం సాధించిన రోజు– భాద్రపద శుద్ధ అష్టమి. అందుకే 'రాధాష్టమి'గా వ్యవహరిస్తారు. శ్రీకృష్ణుణ్ని ప్రాణాధారంగా చేసుకొన్న రాధ ఆయన వామ పార్శ్వం నుంచి పుట్టిందని చెబుతారు. ఆమె పుట్టగానే రాస మండలంలో కృష్ణుడి సేవకోసం ధావనం (పరుగు) సాగించడం వల్ల రాధగా మారిందని బ్రహ్మవైవర్త పురాణం వివరిస్తోంది. గోలోకాన్ని మహారాస మండలి అంటారు. నిత్య బృందావనం, శ్వేత మండలి అని కూడా వ్యవహరిస్తారు. అది ఒక మహా రస జగత్తు. ఆ జగత్తుకు ప్రభువు గోపాలుడు. ఆయనే రాధా మాధవుడు. ఆ రస సమ్రాట్ శక్తినే రాసేశ్వరిగా భావిస్తారు. 'రాసము' అంటే గోకులంలోని ఒక క్రీడావిశేషం, సల్లాపం అని అర్థాలున్నాయి. ధావనం అంటే పరుగు. రాధాకృష్ణులు– ద్వంద్వ సమాసం. ఆ మాట వినగానే అద్వైత ప్రణయం గోచరిస్తుంది. అప్రాకృతమైన జగత్తులో– ముక్త ధామం, వైకుంఠం, గోలోకం అనే మూడు ప్రధాన లోకాలు ఉన్నాయని నారాయణోపనిషత్తు వర్ణిస్తుంది. రాధ అంటే భగవంతుని విశేషముగ ఆరాధించునది అని (భక్తీ అని ) అర్ధము. అనగా అత్యంత భక్తురాలు. కుండలి నుండి మూలాధార వరకు జాలువారుతున్న అమృత బిందువులను (విశ్వశక్తిని) ధారలా భూలోకము నుండి (మూలాధారా) వైకుంఠము (సహస్రారం)నకు తీసుకుని వెళ్ళగలిగే ఒక శక్తి ... ధార ...రాధ ... ఇదో నిరంతర వాహిని ...ఇదే ధ్యానం ...భక్తీ ... ప్రేమ...కృష్ణుడనగా ఆకర్షించు వాడని యర్ధము. నిరంతరం ఆత్మ అంతర్ముఖం కమ్మంటుంది. కాని మనం అత్మరాత్మ మాట వినం. ఇంద్రియాలు చెప్పినది చేస్తూ ఉంటాము. రాధయనగా సిద్ధింప చేయునది అని అర్ధము (మోక్షం). కృష్ణ (సాధకుడు) ఎక్కడ ఉంటే (నిరంతర) ధార (రాధ) అక్కడ ఉంటుంది. శ్రీకృష్ణుడికి రాధ ప్రాణాధికురాలైన ప్రియురాలు. మహా ప్రకాశ వంతమైన గోలోక రాస మండలంలో రాధాకృష్ణులే ఆది దంపతులు. నాలుక కొన నుంచి పుట్టిన కన్య 'రాధ' కాలాంతరంలో రెండు రూపాలు ధరించిందని పురాణ కథనం. అందులో ఒకటి లక్ష్మి రూపమని, రెండోది రాధ ప్రతిరూపమని భావిస్తారు. భౌతిక భావాలకు, ప్రేమకు ఎటువంటి సంబంధం లేదని రుజువు చేసిన ప్రేమ రాధా కృష్ణులది. వారి ప్రేమ మీరా భాయి దగ్గర నుండి కబీర్ దాస్ వరకు ప్రతి ఒక్కరికీ ప్రేరణనిచ్చి రచనలు చేసేలా ఉసిగొల్పింది. ఈ నాటికీ ప్రేమికులను లేదా పెళ్ళైన ముచ్చటైన జంటను పోల్చాలి అంటే రాధా కృష్ణుల వలెనే ఉండమని దీవిస్తున్నారు అంటేనే అర్ధం చేసుకోవచ్చు. ఈ విశ్వమే అంతమైనా వీరి ప్రేమ మాత్రం మధుర కావ్యంలా ఎప్పటికీ నిలిచి ఉంటుంది. రాధా కృష్ణులు ప్రేమకు స్వచ్ఛమైన రూపం, వారి ప్రేమ హృదయంలో వికసించే పూలతోట వంటిది. ఇంద్రియాలకు చెందిన సాధారణమైన సంబంధం కాదు , అనిర్వచనీయమైనది. ఇప్పటికీ, ఎప్పటికీ చెక్కు చెదరని ప్రేమ అంటే రాధా కృష్ణులే మొదట స్ఫురణకు వచ్చేది. జీవితంలో అన్నిటినీ పొందగలిగిన కృష్ణుడు, ఏదైనా కోల్పోయాడు అంటే అది రాధ ప్రేమనే. అంతగా కృష్ణుని మనసునే కలచి వేసిన అంశంగా రాధ మిగిలి పోయింది. రాధామాధవం ఎంత రమణీయం! రెండు పవిత్ర హృదయాల దివ్య సంగమం, స్వచ్ఛమైన ప్రేమకు అచ్చమైన ప్రతిరూపం. తనను తాను ప్రేమించుకుందుకు, తన నుండి తాను వేరుపడి మాధవుడు రాధగా జన్మించాడు. రాధ లోకోత్తర సౌందర్యమూర్తి. అరవిందం లాంటి అందం. మకరందం లాంటి మనస్సు. ఇలకు దిగిన ఇంద్ర ధనుస్సు. ప్రణయ మాధురి, రాధా సుందరి. మాధవుడు సౌందర్య సారసర్వస్వం. కోటి మన్మధ లావణ్య కోమలాంగుడు. త్రిజగన్మోహన నీలవర్ణ శోభితుడు. సకల సద్గుణ భూషితుడు. నిర్మల హృదయుడు. నిర్గుణుడు. బృందావనంలో, పాల నురగతో సరిగంచులు దిద్దించిన కొత్త చీర ధరించి, విశేషమైన అలంకారాలతో, చందనం పూసిన కుందనపు బొమ్మలా వినూత్న శోభను రాధ విరజిమ్ము తుంటే, ఆమె ఎదురుగా కృష్ణుడు, సహజాలంకార సుందరుడు, రాగరంజితుడు, అనురాగ బంధితుడు రాధ సన్నిధిలో ఏకాంతంలో తన్మయుడై ఉంటాడు. శ్రీకృష్ణుని ప్రియురాలు రాధ జన్మదిన వేడుకలను రాధాష్టమి సందర్భంగా, రాధా కృష్ణుల విగ్రహాలకు పెరుగు, పాలు, పండ్ల రసాలు, పాలు, కొబ్బరినీరు తదితరాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తితో గీతాలు ఆలపిస్తారు. ప్రత్యేక పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాధా కృష్ణుల విగ్రహాలను అభరణాలు, నూతన వస్త్రాలతో విశేషంగా అలంక రిస్తారు. బృందావనంలో ముఖ్యమైన ప్రదేశాలను భక్తులకు తెలియజేస్తూ వాటి విశిష్టతతో కూడిన వీడియోను ప్రదర్శిస్తారు. రాధను కీర్తిస్తూ వైష్ణవ ఆచార్యులు స్వరపరిచిన అద్భుత పాటలు ఆలపిస్తారు. అమ్మవారికి విశేష హారతి తర్వాత పవళింపు సేవ నిర్వహిస్తారు. పవిత్ర ప్రేమకు చిహ్నంగా భావించి రాధా కృష్ణులను పూజిస్తారు. రాధా కృష్ణులు ఏకైక రూపులు. రాధా కృష్ణులను ఆరాధించడం వల్ల భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని విశ్వాసం.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**


# బాలల వికాస తరంగిణి తురగా జానకీరాణి - ఆగస్టు 31... తురగా జానకీరాణి జయంతి



పిల్లలారా రారండోయ్...బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహంతో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చెరిగిపోని జ్ఞాపకాలే. రేడియో అక్కయ్యగా తురగా జానకీరాణి, ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి. ఎందరో చిన్నారులు బాలా నందంలో పాల్గొనే అవకాశం పొంది, తమ కంఠం వినిపించ డం వెనుక ఆమె పాత్ర మరిచి పోలేనిది. పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటిలో చిన్నారులతో ప్రదర్శింప చేసిన ఆమె కృషి మరిచి పోనిది. ఎందరో ప్రముఖులు తమకు చిన్నతనంలో ఆకాశవాణిలో రేడియో అక్కయ్యతో వున్న అనుభవం మర్చిపోకుండా ఉంటారు. తురగా జనకీరాణి (ఆగష్టు 31, 1936– అక్టోబరు 15, 2014) ఆలిండియా రేడియోలో నేటికీ రేడియో అక్కయ్యగా సుపరిచితురాలు అయిన ఆమె రచయిత్రి, సంఘ సంస్కర్త .. ఆకాశవాణి ఉద్యోగంలో చేరక ముందు రేడియో ఆర్టిస్టుగా , రాత్రి 7 నుండి 7.50 వరకు కథానికా పఠనం చేసే వారు. ఆకాశవాణిలో ఆమె అనేక కొత్త ప్రయోగాలు చేశారు. చొప్పదంటు ప్రశ్నలు, బాలవాణి వంటి కార్యక్రమా లు, కంగారు మామయ్య, కొంటె కృష్ణయ్య, వెర్రి వెంగళప్ప వంటి పాత్రలు ప్రవేశపెట్టి చిన్నారి శ్రోతలకు చేరువ అయ్యారు. వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువ డ్డాయి. మూడు నవలలు, ఐదు బాలసాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయి అనువాద రచనలు కూడా మూడు వచ్చాయి. పలు పత్రికల్లో వీరు రచించిన కథలు ప్రచురించ బడ్డాయి. సన్మానం, మంచిమనస్సు, ఉపాయం, వాదన, ఆడపిల్ల వంటి కథలతో కూడిన 'మిఠాయి పొట్లం 'కథల సంపుటి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'పబ్లికేషన్స్ డివిజన్' ప్రచురిం చింది. మరో కథల సంపుటి 'బంగారు పిలక 'ని నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురిం చారు. రెడ్ క్రాస్ కథను అనువదించారు. ఆకాశ వాణి ద్వారా..."ఇది నా సమస్య" అని స్త్రీల కార్యక్రమం ప్రసారం చేసి స్త్రీలు తమ సమస్యలు ఉత్తరాల ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కా రాలు నిపుణులైన డాక్టర్లు, లాయర్లు మొదలైన వారిచే చెప్పే కార్యక్రమాల, వృద్ధుల కోసం తమ జీవితానుభవాలు తెలిపే "స్రవంతి" అనే కార్యక్రమం వెనుక జానకీ రాణి కృషి అభినందనీయం. దృశ్యశ్రవణ విధానంతో విజ్ఞానం అందించవచ్చని అమ్మ–పాప, చిలుక పలుకులు, ఉదయబాల, అమ్మా నేను బడికి పోతా, బంగారు పాప వంటి పలు సిడిలను రూపొందించారు. జానకీరాణి సేవలకు గుర్తింపుగా 'సనాతన ధర్మ ', బాలసాహిత్య పరిషత్ ' వంటి పలు సంస్థలు సత్కరించాయి. ఆమె 1991,1992లో వరుసగా రెండు సార్లు నేషనల్ బెస్ట్ బ్రాడ్ క్యాస్టరుగా అవార్డు పొందారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎందరో పేరెన్నిక గల వారితో పని చేశారు .అక్కినేని నాగేశ్వర రావు, ఎస్.పి. బాలసుబ్రహ్మ మణ్యం, జె.వి. సోమయా జులు, మంజు భార్గవి, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, స్థానం నరసింహారావు, వేలూరి శివానంద, గోపీచంద్.... ఇలా ఎందరితోనో కలిసి కార్యక్ర మాలు రూపొందించారు. యూనిసెఫ్ లో, ఎన్.సి.ఆర్.టి., ప్రభుత్వ శాఖల కోసం పని చేసేటప్పుడు బాల జాగృతి (బా జా)అనే కార్యక్రమం చేపట్టి 670 (%ర్తీవవ్ ఒష్త్రశీఒం%) వీధి ప్రదర్శనలు చేశారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవాళ్ళు. సామాజిక స్పృహ వున్న విషయాలు, సృజనాత్మక సందేశాలు పిల్లలు, యువతీ యువకులు శిక్షణ పొంది ప్రదర్శించేవాళ్లు. జానకీరాణి... 2011లో బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న" అవార్డు, గహలక్ష్మీ స్వర్ణకంకణం, రెండు సార్లు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, పింగళి వెంకయ్య స్మారక సత్కారం, అరవిందమ్మ మాతృమూర్తి అవార్డు, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో పరిణిత వాణి గౌరవం, 'ఈనాడు' అవార్డు, బాలబంధు, దక్షిణ మధ్య రైల్వే గౌరవ సత్కారం... ఎలా ఎన్నో పురస్కారాలను అందు కున్నారు. కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధ పడుతూ, అక్టోబరు 15, 2014న ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర ఆరుద్ర - ఆగస్టు 31... ఆరుద్ర జయంతి



తెలుగు సాహిత్యంలో ఆరుద్రది ప్రత్యేక స్థానం. అపరాధ పరిశోధక నవలల నుంచి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల వరకు ఆరుద్ర స్పృశించని సాహితీ శాఖ లేదంటే అతిశయోక్తి కాదేమో. కవిగా, రచయితగా, కథకునిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా ఆరుద్ర సాహితీ సేవనం అనితరసాధ్యం. నిరంతరం నవ్యత కోసం పరితపించిన నిత్య శోధనా సక్తులు ఆరుద్ర. శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవిగా పేరు పొందిన ఆరుద్ర 'అభ్యుదయ రచయితల సంఘం' వ్యవస్థాపకుల్లో ఒకరు. తెలుగు సినిమా పాటకు ఓ కొత్త ఒరవడి సృష్టించిన ఆరుద్ర సంగీత దర్శకులిచ్చిన బాణీలకు అనుకూలంగా, సునాయాసంగా, సరళంగా పాటలు రాయగలిగారు. ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖ పట్టణంలో ఆరుద్రా నక్షత్రాన జన్మించిన ఆరుద్ర పండిత వంశంలో పుట్టడం భూమికగా బాల్యం నుంచీ సాహిత్యంపై మక్కువ కలిగి, పట్టు చిక్కించు కున్నారు. తెలుగుతో పాటు అనేక భాషల్లోనూ పాండిత్యం సంపాదించారు. విశాఖపట్నం ఎ.వి.యన్. కాలేజీ ఉన్నత పాఠశాలలో, విజయ నగరంలో యం.ఆర్.కళాశాలలో ఆరుద్ర విద్యాభ్యాసం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికి 1943–47 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్?లో గుమ్మస్తాగా పని చేశారు. మద్రాస్ కు మకాం మార్చి, ఆనందవాణి అనే పత్రికకు రెండేళ్ళు సంపాదకునిగా పనిచేసారు. 1949 లో సినీరంగ ప్రవేశం చేసి, అనేక సినిమాలకు మాటలు, పాటలు వ్రాసారు. 1954 లో ప్రఖ్యాత రచయిత్రి అయిన రామలక్ష్మిని వివాహ మాడారు. చిత్తూరు నాగయ్య నటించిన 'బీదలపాట్లు' చిత్రంలో తొలిసారి ఆరుద్రకు సినీ పాటల రచనకు అవకాశం వచ్చింది. అందులో ఆయన రాసిన "ఓ చిలుకరాజా నీ పెళ్ళెపుడయ్యా%ా%" పాట అలరిం చింది. ఆరుద్ర గురించి తెలిసిన ప్రఖ్యాత హిందీ నటులు రాజ్ కపూర్ తన 'ఆహ్' చిత్రాన్ని తెలుగులో డబ్బింగ్ చేస్తూ, ఆయననే రచయితగా ఎంచుకోగా, రాజ్ కపూర్ 'ప్రేమ లేఖలు' తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. అందులో ఆరుద్ర పలికించిన పాటలన్నీ జనాన్ని మురిపించాయి. "పందిట్లో పెళ్ళవుతున్నాదీ%ౌ% కనువింద వుతున్నాదీ%ౌ%" పాట విశేషాదరణ పొందింది. నాటి రోజుల్లో పెళ్లి పందిళ్ళలో బాజా భజంత్రీల ద్వారా బాగా వినిపించేది. ఆరుద్ర వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు... ప్రధానంగా సినీ గీతాలు ఒక్కటే మిటి, సకల సాహితీ ప్రక్రియల్లో వైవిధ్య రచనల్లో సాటిలేని మేటి అనిపించు కున్నారు. త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలతో పాటు వెన్నెల – వేసవి, దక్షిణ వేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలు రాదారి బంగళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలుతో పాటు కథలనూ, నవలలనూ కూడా రాశారు. మేధస్సునే కాక, ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం ( 14 సంపు టాలు) ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ఠ. వేమన వేదం, మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలో ప్రగతి వాదులు వంటివి ఆరుద్ర సాహిత్య విమర్శనా గ్రంథాలు. రాముడికి సీత ఏమౌతుంది?, గుడిలో సెక్స్ వంటి రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి నిదర్శనాలు. సంగీతం పైనా, నాట్యం, ఇతర కళలపై సాధికారికంగా రచించిన వ్యాసాలు, చదరంగం అంశాన్ని దశాబ్దాలకు పూర్వమే ఒక గ్రంథస్థం చేయడం ఆరుద్రలోని ప్రత్యేకతకు నిదర్శనం. అంతేకాదు, ఆరుద్ర క్లబ్ పాటలు కూడా విశేష సినీ ప్రేక్షకుల ఆదరణకు పాత్రాలు అయినాయి. %ౌ%మ్మ మ్ము మ్ము ముద్దంటే చేదా ఇపుడా ఉద్దేశం లేదా?, తీస్కో కోకాకోలా ఏస్కో రమ్ము సారాబీ మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాలబీ మొదటి పెగ్గులో మజా – వేడి ముద్దులో నిషా లాంటి పాటలెన్నో ఆరుద్రనే రాశారా అన్న అనుమానం కలిగేలా చేశాయి. తెలంగాణ పోరాట ఇతివృత్తం నేపథ్యంలో రాసిన త్వమేవాహం క చదివి ఇక నేను పద్యాలు రాయక పోయినా పరవాలేదు అని మహాకవి శ్రీశ్రీ ప్రశంస పొందిన ఆరుద్ర...ఇతను 'ఆరుద్ర' కాడు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత శ్లాఘించ బడిన గొప్ప వ్యక్తి ఆయన. తెలుగు సాహితీ పుస్తకంలో చెరగని సంతకం చేసిన ఆరుద్ర... మహాకవి శ్రీశ్రీకి మేనల్లుడు, ప్రఖ్యాత తెలుగు రచయిత్రి కె.రామలక్ష్మికి పతి దేవుడు. 1998 జూన్ 4న ఆరుద్ర ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# సర్కారు జాగా.. వేసేయ్ పాగా..!

నల్గొండ : ఈ చిత్రం చూశారా.. ప్రకాశం బజారులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు సీసీ రోడ్డు. ఆ మార్గంలో సగం వరకు రోడ్డు కబ్జా చేసి మూడు అడుగుల మేర ఎత్తు వరకు రాళ్లతో నిర్మాణం చేపట్టారు. పైన తాత్కాలికంగా బస్తాలతో నీడ పందిరి వేశారు. కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ షెడ్డు నిర్మించేందుకు ప్రణాళిక వేశారు. ఇలా ఒకరిద్దరూ కాదు పదుల సంఖ్యలో వ్యాపారులు రోడ్ల స్థలాలకు ఎసరు పెట్టేస్తున్నారు. నల్గొండలో భూకబ్జాదారులు పెరిగిపోతున్నారు. వ్యాపారం ముసుగులో రూ.కోట్ల విలువైన స్థలాలకు ఎసరు పెడుతున్నారు. అక్రమంగా నిర్మాణాలు సాగిస్తూ పాగా వేస్తున్నారు. ఆ తర్వాత కదిలించడం ఎవరి తరం కాదనే ఆలోచనతో పాతుకుపోతు న్నారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి అక్రమాలకు పాల్పడటం పురపాలిక



పరిధిలో పరిపాటిగా మారింది. అధికార యంత్రాంగానికి కబ్జాల వ్యవహారం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నీలగిరిలో వాణిజ్య కేంద్రమైన ప్రకాశం బజారులోని కూరగాయల మార్కెట్‌లో పురపాలికకు చెందిన సుమారు రూ.కోటికి పైగా విలువైన స్థలాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. కంచిశారీ హౌజ్ పక్కన మార్గం కబ్జాలతో మూసుకుపోయింది. కిరాణం, కూరగాయల వ్యాపారులు పక్కాగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో పక్కన ఉన్న సుమారు 50 మంది వ్యాపారులు సైతం రోడ్డును 15 అడుగుల మేర ఆక్రమించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట, పక్కన రోడ్లను పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు సాగించడంతో మార్గం కుచించుకుపోయింది. అధికారుల పర్యవేక్షణ లేమితో మార్కెట్ సముదాయంలోని దుకాణాల ఎదుట స్థలాలు పరులపాలవుతున్నాయి.

**తొలగిస్తాం: మusాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక**
సమస్య మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పురపాలికకు చెందిన ఆస్తులు, స్థలాలను కబ్జా చేస్తే స్వాధీనం చేసుకుంటాం. రోడ్లను కబ్జా చేసి వాహనదారులకు అంతరాయం కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం.

# విపణిలో పాగా.. వ్యాపారుల దగా..!



ఖమ్మం : మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ ఏటా రూ.కోట్లు సంపాదిస్తున్నా వారి దాహం తీరటం లేదు. రైతులు, మార్కెట్‌ను వంచించటం పరిపాటిగా మారింది. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఓ వ్యాపారి ఈపీ(ఎక్స్‌పోర్టు) పుస్తకాలు ముద్రించి మోసగించిన విషయం విదితమే. గతంలోనూ ఈ వ్యాపారి వివిధ రకాలుగా మార్కెట్‌ను వంచించినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు వ్యాపారి.. మార్కెట్‌లో పత్తిని సోమవారమూ కొనటం గమనార్హం. కేసు నమోదైన వెంటనే అతడి లైసెన్స్‌ను బ్లాక్ చేసి ఉంటే ఈపరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు.

**ఏటా రూ.3వేల కోట్ల వ్యాపారం**
ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మిరప, అపరాలతో కలిపి ఏడాదికి రూ.3వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. మార్కెటింగ్‌శాఖకు రూ.30కోట్ల ఆదాయం ఈ ఒక్క మార్కెట్ నుంచే సమకూరుతుంది. ఇక్కడ 215 మంది లైసెన్స్‌డ్ వ్యాపారులు ఉన్నారు. మార్కెట్ కమిటీకి ప్రత్యేకంగా పాలకవర్గం, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఉన్నా కొద్దిమంది వ్యాపారులే పెత్తనం చెలాయిస్తారు. కొన్నేళ్లుగా నకిలీ ఈపీ పుస్తకాలు చలామణి అవుతున్నా అధికారులు అటువైపు దృష్టి సారించకపోవటం అనుమానాలకు తావిస్తోంది.

**అధికారుల ఉదాసీనత** ఐదుగురు వ్యాపారులు రూ.87లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. అధికారులు వీరి లైసెన్స్‌లను బ్లాక్ చేసి నోటీసులిచ్చారు. కొంతమందికి రాజకీయ పలుకుబడి ఉండటం వల్ల చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారని సమాచారం. మరికొందరు వ్యాపారులు మార్కెటింగ్‌శాఖ అధికారులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటంతో మూడు బస్తాలు.. ఆరు అక్రమాలు అన్నట్టుగా దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అడ్డగోలు వ్యాపారం..**
మార్కెట్‌లో రోజూ పత్తి, మిరప వ్యాపారం చేసే వ్యాపారుల్లో కొంతమంది అడ్డదారులను ఎంచుకుంటున్నారు. నకిలీ ఈపీ పుస్తకాలతో పాటు దడవాయిల పుస్తకాలు, గేట్‌పాస్‌లను సొంతంగా ముద్రించుకుని యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. మరికొందరు బినామీ లైసెన్స్‌లతో వ్యాపారం చేస్తున్నారు. ఏ లైసెన్స్ లేకుండా కొందరు దందా సాగిస్తున్నారంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పలువురు వ్యాపారులు మార్కెట్‌కు పన్ను చెల్లించటం లేదు.

ఇటీవల కేసు నమోదైన వ్యాపారి మార్కెట్‌లో పత్తిని సోమవారం కొన్నట్లు మాదృష్టికి వచ్చింది. అతడి లైసెన్స్‌ను బ్లాక్ చేశాం. రేపటి నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉండదు. సదరు వ్యాపారి అక్రమాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తున్నాం. కుటుంబ సభ్యుల పేరిట కొంతమంది లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. అలాంటి వారి వివరాలు సేకరిస్తున్నాం. బకాయిలు చెల్లించకుంటే చర్యలకు ఉపక్రమిస్తాం.
పి.ప్రవీణ్‌కుమార్,మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఖమ్మం

# అధికారుల తప్పిదం.. అన్నదాతలకు శాపం

నిర్మల్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో న్యూ కంజర్, పొట్టపల్లి(బి), పొట్టపల్లి(కె) గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాల ప్రజలకు లక్ష్మణచాంద మండలంలో పునరావాసం కల్పించారు. వారందరికీ ఇళ్ల స్థలాలతోపాటు ఒక్కొక్కరికి అయిదు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి కేటాయించారు. గత భారాస ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రాకముందు ఆ గ్రామాల్లో భూముల క్రయ విక్రయాలు సాఫీగా జరిగాయి. ధరణి పోర్టల్‌లో భూముల వివరాలు నమోదు చేసే సమయంలో మండల రెవెన్యూ అధికారులు లక్ష్మణచాంద మండలం న్యూ కంజర్ గ్రామంలోని 465 సబ్ డివిజన్‌లోని 850 ఎకరాలు, పొట్టపెల్లి(బి), పొట్టపెల్లి(కె) గ్రామాల్లోని 146 సబ్ డివిజన్‌లోని 300 ఎకరాలకుపైగా ఉన్న పట్టా భూములను అసైన్డ్‌గా నమోదు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇవన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. ఆ గ్రామాల్లో భూములు కొనుగోలు చేయాలన్నా.. అమ్ముకోవాలన్నా ధరణిలో ప్రభుత్వ అసైన్డ్ భూములుగా చూపిస్తుండటంతో క్రయ విక్రయాలు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. న్యూ కంజర్, పొట్టపల్లి(బి), పొట్టపల్లి(కె) గ్రామాల్లో వెయ్యి ఎకరాలకుపైగా అసైన్డ్ జాబితాలో నమోదయ్యాయని.. వీటిని పట్టా భూములుగా మార్చాలని ఏడేళ్లుగా సీసీఎల్ఏ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. ఇటీవల ఈ సమస్య పరిష్కరిం



చాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


**తిరిగి తిరిగి అలసిపోతున్నాం – లక్ష్మారెడ్డి, రైతు, న్యూ కంజర్**
ధరణి పోర్టల్ రాకముందు వరకు మా గ్రామంలో భూముల క్రయ విక్రయాలు జరిగాయి. రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటు కారణంగా మా ఊరిలోని పట్టా భూములు అసైన్డ్ జాబితాలో చేరడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్య పరిష్కరించాలని హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**విచారణ చేయాలి– బండారి నడ్పి సాయన్న, రైతు, న్యూ కంజర్**
రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగా మా గ్రామంలోని పట్టా భూములు అసైన్డ్ జాబితాలో చేర్చారు. దీంతోపాటు కొంతమంది రైతుల పేర్లపై ఉన్న భూములను ఇతర పేర్లపై పట్టాగా చేశారు. గ్రామంలోని భూములపై పూర్తి విచారణ జరిపించి తప్పిదాలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

# గండి పడి పక్షం.. ఎన్నాళ్లీ నిర్లక్ష్యం

ఆసిఫాబాద్ : వర్షాలకు వట్టివాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టుదారులు సంతోషించారు. అయితే భారీ వర్షాలకు వచ్చిన వరదలతో కుడి ప్రధాన కాలువకు గండి పడటంతో వారి ఆశలు ఆవిరవుతున్నాయి. నీటి తడులు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. గండి పడి 12 రోజులు దాటినా అధికారులు స్పందించలేదని వాపోతున్నారు. సోమవారం బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సాగునీటి సరఫరా నిలిచి పోవడంతో వేసిన పంటలతోపాటు నారుమళ్లు ఎండుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు ఆసిఫాబాద్ మండలం లోని కొమ్ముగూడ సమీపంలో 8వ కి.మీ. వద్ద వట్టివాగు కుడి ప్రధాన కాలువ డీ4 కు ఈ నెల 13న గండి పడింది. దీంతో అధికారులు నీటి విడుదల నిలిపి వేశారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి తాత్కాలిక మరమ్మతులకు నోచుకోలేదు. డీ3 వరకు కొంత మేర నీరు వస్తున్నా.. ఆ తరువాత డీ4–డీ12 వరకు సరఫరా నిలిచి పోయింది. ఈ కాలువ ఆసిఫాబాద్ మండలం కొమ్ముగూడ, తెనుగ్గూడ, గొల్లగూడ, అప్పపెల్లి, రెబ్బెన మండలం కొండపల్లి, ఖైరిగాం, రెబ్బెన తదితర గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. దీని కింద సుమారు 150 మంది రైతులు 1600 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే నాట్లు వేయగా.. మరో 200 ఎకరాల్లో నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నారు. ఇంతలోనే గండి పడి నీటి విడుదల నిలిచిపోవడంతో.. సాగు చేసిన పంటతోపాటు సిద్ధం చేసిన నారు సైతం ఎండిపోతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. పంట మొదట్లోనే నష్టం వాటిల్లేలా ఉందని, అధికారులు చొరవ తీసుకుని మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

**త్వరగా స్పందిస్తేనే మేలు..**
ప్రధాన కాలువతో పాటు పంపిణీ కాలువల కింద వేసిన వరి పంటలు



నీరు లేక ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కో చేనులో 20 శాతం వరకు పంట ఎండినట్లు వాపోతున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే మరింత ఎండిపోయే ప్రమాదం ఉన్నట్లు ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేసైనా నీటి విడుదల చేస్తే కొంత మేరకైనా బతికే అవకాశం ఉంటుందని ఆయకట్టుదారులు పేర్కొంటున్నారు.

**తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు..**
గండిపడ్డ చోట పూడ్చేందుకు వట్టివాగు ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 6.7 లక్షలు, శాశ్వత పనుల కోసం రూ.14.5 లక్షలతో అంచనాలు తయారు చేశారు. వీటికి ఆమోదం లభిస్తే వెంటనే పనులు మొదలు పెట్టే అవకాశం ఉంటుంది. తాత్కాలిక మరమ్మతుల కోసం కలెక్టర్ నిధుల నుంచి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారని అధికారులు పేర్కొన్నారు.

# ఇరుగు 'పొరుగు.. అవస్థలు దేవుడెరుగు'..!



కొత్తగూడెం : నాలుగు నెలలుగా వేతనాలు అందటం లేదు. కుటుంబాన్ని పోషించాలంటే అప్పులు చేయాల్సి వస్తోంది. కొన్ని శాఖల్లోని ఉద్యోగులకు వేతనాలు చెల్లించటానికి నిధులు ఉన్నా.. తమ సర్వీసును క్రమబద్ధీకరించకపోవటంతో జీతాలు పొందలేకపోతున్నామని కొందరు పొరుగు సేవల సిబ్బందికు తెలిపారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ఉద్యోగులు వేతనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవటంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోందని చెబుతున్నారు. సకాలంలో వేతనాలు అందకపోవటంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో సుమారు 8వేల మంది పొరుగు సేవల ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

**అసలు ఉన్నట్టా.. లేనట్టా**
పొరుగు సేవల ఉద్యోగులు ప్రతిరోజూ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వారు విధులకు హాజరవుతున్నట్టుగా ఎక్కడా రికార్డుల్లో ఉండదు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండానే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం వారితో పని చేయించుకుంటున్నారు. నాలుగు నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పొరుగు సేవల ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు వెలువరిస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు అవుతున్నా.. నాలుగు శాఖల సిబ్బందిని మినహా మిగతా వారి సర్వీసును క్రమబద్ధీకరించలేదు. వేలాది మంది విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉద్యోగంలో ఉన్నామా?లేదా అనే అయోమయానికి గురవుతున్నారు. **కలగానే కార్పొరేషన్ ఏర్పాటు..**
పొరుగు సేవల ఏజెన్సీల స్థానంలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న కార్పొరేషన్ విధానాన్ని అధ్యయనం చేయించింది. అందుకే పొరుగు సేవల ఉద్యోగులను రెన్యువల్ చేయటంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ ఏర్పాటుపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడలేదు. మళ్లీ పాత విధానంలోనే ఏజెన్సీల ద్వారా వేతనాలు చెల్లించనున్నట్లు తెలుస్తుండటంతో కార్పొరేషన్ ఏర్పాటు అంశం కలగానే మారిందని పొరుగు సేవల సిబ్బంది వాపోతున్నారు.

అన్ని శాఖల్లోని పొరుగు సేవల సిబ్బందికి వేతన బకాయిలు సత్వరం విడుదల చేయాలి. అటు సర్వీసు క్రమబద్ధీకరణకు నోచుకోక.. ఇటు కార్పొరేషన్ ఏర్పాటవక.. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి. పులి లక్ష్మయ్య, పొరుగు సేవల ఉద్యోగుల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు

# అప్పు తీర్చేస్తాం.. ఆభరణాలు వెనక్కి ఇవ్వండి

చెన్నూరు : అవసరాల కోసం బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకుని రుణం పొందితే వాటిని మాయం చేశారని రుణగ్రహీతలు ఆందోళనకు దిగారు. అప్పు తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని నగలు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం వారు చెన్నూరు ఎస్‌బీఐ–2 బ్రాంచి ఎదుట ఆందోళనకు దిగారు. జాతీయ బ్యాంకు ఎంతో భద్రమని, తమ కష్టార్జితమైన నగలతో అందులో రుణం పొందితే ఇంత పని చేస్తారనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణగ్రహీతలకు చెందిన దాదాపు 12.500 కిలోల బంగారు ఆభరణాలు బ్యాంకులో గల్లంతైన విషయం తెలిసి వారు నిరసన తెలిపారు. బ్యాంకులో జరిగిన అవకతవకలతో తమకు పనిలేదని, తక్షణం తాము తాకట్టు పెట్టిన నగలు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే బ్యాంకు ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. బ్యాంకు ఎదుట ఉద్రిక్తత నెలకొనగా.. అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. బ్యాంకు అధికారులు బయటకు వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించలేదు. బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ రితీశ్‌కుమార్‌గుప్తా, ఇతర అధికారులు బ్యాంకు ద్వారా ఎలాంటి నష్టం వాటిల్లదని వారికి హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే న్యాయం చేస్తామని చెప్పారు. దీంతో రుణగ్రహీతలు ఆందోళన విరమించారు.

# పరిశ్రమిస్తేనే ఉపాధి అవకాశాలు

చిట్యాల : స్వయం ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరల్లోనే భూములు విక్రయించి ప్రత్యేక ఆహారశుద్ధి పరిశ్రమలు (స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్) ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తుంది. వారి అవసరాలకు అనుగుణంగా భూములను తీర్చిదిద్దడం, రహదారులు, తాగునీరు, కాలుష్య శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాట్లు, వీధి దీపాలు, విద్యుత్తు అవసరాలు ఈ సంస్థ అందజేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వ, అసైన్డ్ పట్టా భూములున్నట్లు గుర్తించింది. వరసగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. చిట్యాల మండలంలో ఇప్పటికే ఫార్మా సంస్థలున్నాయి. వాటి ద్వారా కొంత మేర స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపిస్తే వేలాది మంది స్థానికులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన అవసరం లేదని స్థానిక యువత అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్ల క్రితం అప్పటి టీఎస్ఐఐసీ ప్రస్తుత టీజీఐఐసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి 70 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించిన వెలిమినేడు గ్రామంలో 475 ఎకరాల భూమిని గుర్తించింది. ఒక్కో ప్రాజెక్టుకు రూ.90 లక్షల చొప్పున మొత్తం రూ.146 కోట్లతో 162.28 ఎకరాల మేర అధికారులు ఇప్పటికే సేకరించారు. ఇంకా 313.04 ఎకరాలు సేకరించాల్సి ఉ



ంది. మొత్తం 180 ప్లాట్లు ఉండగా 24ప్లాట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో కేటాయించారు. ఇంకా 26 ప్లాట్లు ఖాళీగా, మిగిలినవి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. మొత్తం ప్రత్యక్షంగా ఒక 600 మందికి, పరోక్షంగా మరో 600 మంది వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**సౌకర్యాలు కల్పించాలి: శ్రీకాంత్, సిలికేట్ పరిశ్రమ ఉద్యోగి**
ఇక్కడ మా పరిశ్రమ మొదటి యూనిట్‌ను ఏర్పాటు చేశాం. ధాన్యం ఊక, ముడి చమురును ఉపయోగించి భవనాల నిర్మాణంలో లీకేజీలు రాకుండా నియంత్రించే సిలికేట్ మిశ్రమాన్ని తయారుచేస్తాం. టీజీఐఐసీ వారు స్థలం విక్రయించగా పంచాయతీ నుంచి నాలా, పర్యావరణ, ఇతరాత్ర అనుమతులు తీసుకున్నాం. విద్యుత్తు నియంత్రికలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరినా ఒకే పరిశ్రమ ఉందనే ఉద్దేశంతో పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి నిర్ణయం తీసుకుంటేనే మకు అన్ని అనుమతులు లభిస్తాయి.

# నిధుల్లో కోత.. పల్లెల్లో వెత!

తలమడుగు : గ్రామ పంచాయతీలు నిధుల్లేక డీలా పడ్డాయి.. దీంతో కార్యదర్శులకు నిర్వహణ భారంగా మారింది. వీధిదీపాలు, మంచినీటి పథకాలకు విద్యుత్తు బిల్లుల చెల్లింపు, ట్రాక్టరు మరమ్మతులు, నిర్వహణ, పారిశుద్ధ్యం, ఇతరత్రా పనులు చేపట్టడానికి పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకుండా పోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా పంచాయతీలకు నిధులు విడుదల చేయాల్సి ఉండగా గత శాసనసభ ఎన్నికల సంవత్సరం నుంచి నిధుల్లో కోత పడుతోంది. జిల్లావ్యాప్తంగా 468 పంచాయతీల్లో పాలన పట్టు తప్పింది.మూడేళ్లుగా కోత : పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. మొదటి మూడేళ్ల వరకు భారీగా నిధులు విడుదలయ్యాయి. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంఘం నిధులు, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. సర్పంచుల పదవీ కాలం గతేడాది జనవరి నెలాఖరులో ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. అప్పటి నుంచి నిధుల్లో మరింత కోత పడింది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు తప్పితే ఇతరత్రా పనులకు పైసలు లేవు. కొన్ని నెలలుగా జిల్లాలో వీధి దీపాలు, మంచి నీటి పథకాలకు మోటారు కనెక్షన్లు, కార్యాలయ విద్యుత్తు బిల్లులు రూ.4 కోట్లు పేరుకుపోయాయి.ఎన్నికల కోసం ఎదురుచూపులు : సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. సర్పంచి, వార్డు సభ్యులు ఉంటే గ్రామస్థులకు ఏ సమస్య వచ్చినా ముందుగా వారికే చెప్పేవారు. కార్యదర్శిపై అంతగా ఒత్తిడి ఉండేది కాదు. పదవీకాలం కాలం ముగియడంతో గ్రామస్థులు ఏ సమస్య ఉన్నా నేరుగా పంచాయతీ కార్యదర్శుల దృష్టికి సమస్య తీసుకెళ్తున్నారు. పనులు చేయిద్దామంటే పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేవు.. అత్యవసర పరిస్థితుల్లో సొంత డబ్బులు ఖర్చు చేసి అనేక మంది కార్యదర్శులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తుందా..? అని కార్యదర్శులు ఎదురుచూస్తున్నారు.తలమడుగు : డోర్లి పంచాయతీలో ట్రాక్టరు ఏడాదిన్నరగా చెడిపోయి మూలకు పడింది. నిధుల్లేక ట్రాక్టరు బ్యాంకు కిస్తీ కట్టలేకపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ భారంగా మారింది.

# గంజాయి తాగుతూ.. మత్తులో తూగుతూ

సిరిసిల్ల : ఒకప్పుడు పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన గంజాయి దందా ఇప్పుడు పట్టణ, పల్లె ప్రాంతాలకు కూడా విస్తరించింది. సరదాగా మొదలైన గంజాయి అలవాటు వ్యసనంగా మారుతోంది. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా మార్చుకొని గంజాయి తాగుతూ మత్తులో తూగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి ఉచ్చులో పడిన యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. గంజాయి వినియోగం.. సరఫరాపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ కొందరు అక్రమార్కులు ఏదోరకంగా తీసుకొచ్చి యువతను మత్తులోకి దించుతున్నారు.

**శివారు ప్రాంతాలే అడ్డాగా..**

జిల్లాలో ప్రధానంగా యువతను విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. విభిన్న రూపాల్లో గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, తదితర తినుబండారాల్లో గంజాయిని ఉంచి విక్రయిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. శివారు ప్రాంతాలు, ఛాయ్ హోటళ్లు తదితర నిర్మానుష్య ప్రదేశాల్లో గంజాయి తాగడానికి అడ్డాలుగా మారుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు యువత గంజాయి తాగడమే కాకుండా సులభంగా డబ్బులు సంపాదించాలని విక్రయాలకు పాల్పడుతూ దొరికిన ఘటనలు ఉన్నాయి.

**మరింత నిఘా అవసరం**

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి కృషి చేస్తున్నారు. నార్కొటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మాదిరిగా గంజాయి కిట్ల సాయంతో పరీక్షలు నిర్వహిస్తూ పట్టిబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 37 గంజాయి కేసుల్లో 95 మందిని అరెస్టు చేసి, 3.449 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 12 గంజాయి మొక్కలను సైతం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు గ్రామాల్లో మరింత నిఘా పెంచడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలు జరిగే అడ్డాల వద్ద తనిఖీలు చేస్తే గంజాయిని కట్టడి చేయొచ్చని పలువురు నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు**

**మహేష్ బి.గితె, ఎస్పీ**

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, తాగినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి సరఫరాను అరికట్టేందుకు నిఘా పెంచుతున్నాం. నార్కొటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పట్టుబడితే కేసుల నుంచి తప్పించుకోలేరు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. గంజాయి గురించి సమాచారం తెలిస్తే 87126 56392 నంబరుకు సమాచారం అందించాలి.

# రోడ్డుపై దుమ్ము.. తప్పదు తుమ్ము

హైదరాబాద్: గ్రేటర్‌లో వాయు నాణ్యత తగ్గడానికి ప్రధాన కారణం పీఎం 10 ఉద్గారాల స్థాయి పెరగడమే. ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి తీవ్ర అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. జాతీయ వాయు నాణ్యతా ప్రమాణాల ప్రకారం.. వార్షిక సగటు పీఎం 10.. ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములకు మించకూడదు. కానీ గ్రేటర్‌లో 82 మైక్రోగ్రాములు నమోదైందని పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ అటైన్‌మెంట్ సిటీస్(ప్రాణ) నివేదిక స్పష్టం చేసింది. నగరంలో 'సోర్స్ ఆఫ్ అపాయింట్‌మెంట్' స్టడీ చేసిన ఐఐటీ కాన్పూర్ బృందం సైతం ఇదే



విషయాన్ని తెలియజేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 24 గంటల్లో పీఎం 10.. ఘనపు మీటరు గాలిలో 45 మైక్రోగ్రాములకు మించకూడదు. కానీ నెల రోజుల్లో 61 నుంచి 71 మైక్రోగ్రాముల మధ్య నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

**శ్వాసకోశ వ్యవస్థ ప్రభావితం..**

ధూళి కణాలను కట్టడి చేయకపోతే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులొస్తాయి. ఉద్గారాల కట్టడికి పరిశ్రమల్లో ఫిల్టర్లు అమర్చడం, నిర్మాణ స్థలాల్లో ధూళి నియంత్రణ చర్యల అమలు, పచ్చదనం పెంపు, పునర్వినియోగ ఇంధన వనరులను ప్రోత్సహించడం కీలకం. ప్రజారవాణా పెంచేలా ప్రోత్సాహకాలు, కార్ పూలింగ్, ఇంధన దహనాన్ని తగ్గించే విధానాలు అవసరం. విద్యుత్ వాహనాలను పెంచి, కాలుష్య తనిఖీలను కొనసాగించాలి.

# పచ్చదనంపై భారీగా వేటు

మూసాపేట : కూకట్‌పల్లి పరిధి గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (జీఓసీఎల్) కంపెనీ ఆవరణలోని వందలాది చెట్లు నరికివేతకు గురయ్యాయి. కట్టుదిట్టమైన రక్షణగోడతో ఉండే ఈ కంపెనీలో ఏం జరిగినా బయట ప్రపంచానికి తెలియదు. ఈ క్రమంలో 20 రోజులుగా భారీ యంత్రాల సాయంతో ఇక్కడ పెద్ద పెద్ద చెట్ల నరికివేత కొనసాగుతున్నట్లు కంపెనీ సిబ్బంది పేర్కొంటున్నారు. వాటిని సమూలంగా నరికేసి రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీ అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**మళ్లీ నోటీసులు ఇస్తాం: లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా అటవీశాఖాధికారి**

జీఓసీఎల్ కొనసాగిస్తున్న చెట్ల నరికివేత వ్యవహారం మా దృష్టిలో ఉంది. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇటీవలే వారి నుంచి రూ. 5 లక్షల జరిమానా వసూలు చేశాం. అయినా కూడా చెట్లను కొట్టేయడం తిరిగి కొనసాగుతున్నట్లు తాజాగా ఫిర్యాదులు అందాయి. మరోమారు నోటీసులు ఇచ్చి కంపెనీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# హద్దులు చెరిపి.. హద్దుమీరి!



శంకరపట్నం: జిల్లాలో అనేక చోట్ల జల వనరులు ఆక్రమణకు గురవుతున్నాయి. క్రమంగా వాటి రూపురేఖలు మారిపోతున్నాయి. సాగు నీటితోపాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదపడే చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. ఈ పరిస్థితి జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నా.. శంకరపట్నం కూడా అందులో ఒకటి. మండలంలో సుమారు 93 చెరువులు, కుంటలు ఉన్నాయి. కొన్నేళ్లుగా వాటిలో కొన్ని ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిపై ఆధారపడిన రైతులు, మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇదేంటని అడిగే వారు లేకుండా పోయారు. పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నా వారు, మమ్మల్ని ఎవరు అడుగుతారులే అనే వారు దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. పొలాలుగా చేసి సాగు భూమిగా మారుస్తున్నారు. కొన్ని చోట్ల శిఖం భూముల్లోనే నిర్మాణాలు చేస్తున్నారు. హద్దులు చెరిపి.. హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆ ప్రదేశంలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండటమే ఇందుకు సాక్ష్యం.

**మచ్చుకు కొన్ని ఉదాహరణలు...**

కన్నాపూర్‌లోని జక్కయ్యగారి కుంట ఆక్రమణకు గురి కావడంతో ఇటీవల సమీప రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదు. కుంట విస్తీర్ణం 1.17 ఎకరాలు ఉండగా.. అక్కడ ఆనవాళ్లు లేకుండా పోయాయి.కాచాపూర్ గ్రామంలోని కొత్తకుంట కట్టను ఇటీవల పొక్లెయిన్ యంత్రంతో తొలగించడంతో అధికారులు అడ్డుకున్నారు.

గతంలోనూ వారే కుంట ఆక్రమణకు యత్నించారు. మొలంగూర్ గ్రామంలోని రామన్నగారి కుంట కబ్జాకు గురైంది. రెండేళ్లైనా అధికారులు చర్యలు తీసుకోలేదు. కుంట విస్తీర్ణం ఆరెకరాలకు పైగా ఉండగా, తగ్గిపోయింది.ధర్మారం గ్రామ శివారులో ఓ కుంటను ఇటీవల కొందరు చదును చేశారు. తాడికల్ గ్రామ శివారులో మేలకుంటలో నిర్మాణాలు వెలిశాయి. అధికారులు హద్దులు నిర్ణయించినా.. కబ్జాలు ఆగడంలేదు.వంకాయగూడెంలోని యాపాలకుంట సమీపంలోనూ కొందరు ఆక్రమిస్తున్నా పట్టించుకోవటం లేదు. గూడాటిపల్లిలో ఓ కుంట స్థలంలో సాగు చేస్తున్నారు.

# 'అమృత్' ప్రగతి అంతంతే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం మెరుగు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో విలీన గ్రామాలు, కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రణాళికలు చేశారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్యాకేజీల వారీగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. ప్రారంభించిన పనులన్నీ వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి కావాల్సి ఉండగా ఆ పనుల ప్రగతి ఇంకా 50 శాతానికి కూడా చేరువ కాలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పనులు మరింత ఆలస్యమవుతున్నాయి..

**ఇదీ పరిస్థితి..** గ్రామీణ మిషన్ భగీరథ కింద వేసిన పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఆ నీరు సక్రమంగా పంపిణీ కావడం లేదు. ఒక్కో ట్యాంకు నిండటానికి గంటల తరబడి సమయం తీసుకోవడంతో ఆశించిన స్థాయిలో సరఫరాకు నీరందడం లేదు.

ఎండాకాలంలో అయితే మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం పైపులైన్ల విస్తరణ, సంపులు, రిజర్వాయర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులన్నీ సకాలంలో పూర్తయితే నగర, పట్టణాల్లో విలీనమైన కాలనీలకు శుద్ధజలం అందనుంది.

**పనుల ప్రగతి ఇలా..**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 10 చోట్ల రిజర్వాయర్లు, సంపుల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా 8 ప్రాంతాల్లో ప్రారంభించారు. 157.95 కిలోమీటర్ల పొడవునా పైపులైను వేయాల్సి ఉండగా 69.54కిమీ మేరనే పూర్తయ్యింది. కొత్తపల్లిలో మూడు రిజర్వాయర్లు, సంపులు నిర్మించాల్సి ఉండగా రెండు చోట్ల పనులు ప్రారంభించారు. 32.97 కిమీ.ల పొడవునా పైపులైను వేయాల్సి ఉండగా 5.48కిమీ మేర పనులు చేశారు. చొప్పదండిలో రెండు సంపులు, రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఒక చోట ప్రారంభించారు. 45.70 కి.మీ.ల పొడవునా పైపులైను వేయాల్సి ఉండగా ఆ పనులే ప్రారంభించలేదు. హుజూరాబాద్‌లో రెండు చోట్ల పనులు ప్రారంభించగా, ఇంకా 12.55 కి.మీ.ల మేర పైపులైన్ వేశారు.

జమ్మికుంటలో రెండు చోట్ల సంపులు, రిజర్వాయర్ పనులు ప్రారంభించగా 44.30 కి.మీ.ల పొడవునా పైపులైను విస్తరించాలి. ఇప్పటి వరకు 9.82 కి.మీ.ల మేరనే పనులు పూర్తయ్యాయి.

**తాఖీదులు జారీ చేశాం**

అమృత్ పథకంలో పనులు త్వరగా పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీకి తాఖీదులు జారీ చేశాం. పైపులైను పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్లు, సంపుల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించాం. గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ, కరీంనగర్

# దొడ్డు బియ్యం.. పురుగులపాలు



పెద్దపల్లి : జిల్లాలోని గోదాముల్లో నిల్వ చేసిన దొడ్డుబియ్యం పురుగులపాలవుతోంది. రూ.30 కోట్ల విలువైన బియ్యం నిల్వలు పాడయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లిలోని ఓ రేషన్ దుకాణంలో 30 క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. వీటిని వెనక్కి తీసుకువెళ్లాలని ఎన్ని పర్యాయాలు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని డీలర్ వాపోయారు. జిల్లాలోని 413 మంది డీలర్ల పరిస్థితి ఇదే. ఇళ్లలో దుకాణాలు నిర్వహించే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. బియ్యంకు పట్టిన పురుగులు ఇళ్లంతా వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. ఈ మేరకు జిల్లాలోని డీలర్లు జులైలో కలెక్టర్, డీఎస్‌వోకు ఫిర్యాదు చేసినా రేషన్ బియ్యం వెనక్కి వెళ్లలేదు.

**స్థలం సమస్య** బియ్యంలో పురుగుతోపాటు ప్రతి నెలా వచ్చే కోటాను నిల్వ చేసేందుకు స్థలం ప్రధాన సమస్యగా మారింది. ఒక్కో డీలర్ వద్ద సగటున 20 క్వింటాళ్ల బియ్యం మిగిలిపోయాయి. గత అయిదు నెలలుగా పురుగులు, ఎలుకలు పడుతుండటంతో తరుగు భారీగా ఉండే అవకాశముంది. కేవలం డీలర్ల వద్దే సుమారు 8,260 క్వింటాళ్ల బియ్యం మిగిలిపోయాయి.

**నిల్వ కేంద్రాల్లోనూ..**

రేషన్ డీలర్లతోపాటు పౌరసరఫరాలశాఖ గోదాముల్లోనూ దొడ్డు బియ్యం నిర్వహణ సమస్యగా మారింది. జిల్లాలోని మూడు ఎంఎల్ఎస్ కేంద్రాల్లో 210 మెట్రిక్ టన్నుల బియ్యం పరుగులు పడుతున్నాయి. అత్యధికంగా మంథని ఎంఎల్ఎస్ కేంద్రంలో 173 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 27 మెట్రిక్ టన్నులు, సుల్తానాబాద్‌లో 10 మెట్రిక్ టన్నుల బియ్యం మిగిలిపోయాయి. వీటికితోడు పౌరసరఫరాలశాఖకు చెందిన బఫర్ గోదాముల్లో 8,638 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం నిల్వలున్నాయి. ఇవి వినియోగించడానికి కూడా పనికిరాని స్థితికి చేరాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వీటిని కొనుగోలు చేసేవారు కూడా ముందుకు రారనే ప్రచారం జరుగుతుంది.

**ప్రభుత్వం ఆదేశాలతో..**దొడ్డు బియ్యంపై ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. డీలర్ల వద్ద ఉన్న బియ్యం పురుగు పట్టి చెడిపోయినట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ వాటిని వెనక్కి తీసుకోవడం, నిల్వ చేసిన వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడంపై స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.శ్రీకాంత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

# తగినంత లేక.. తప్పని వెత!

పరిగి : చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన అంజనయ్య మూడెకరాల్లో వరి సాగు చేశారు. పంటకు వేసేందుకు యూరియా కోసం ఆటోను అద్దెకు తీసుకుని మరికల్ వెళ్లగా అక్కడ దొరకలేదు. అక్కడి నుంచి 22 కి.మీ. దూరంలోని కుల్కచర్లకు వచ్చారు. ఇక్కడా వారికి నిరాశే ఎదురైంది. ఇదీ క్షేత్రస్థాయిలో రైతు పడుతున్న కష్టాలకు ఉదాహరణ. వరి నాట్లు ముందుగా వేసిన రైతులు కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో ఇప్పటి వరకు కొరత లేకపోయినా, సోమవారం కుల్కచర్ల, పరిగి, చౌడాపూర్, మోమిన్‌పేట, ధారూర్ తదితర మండలాల్లో సమస్య నెలకొంది. బస్తా యూరియా కోసం గంటల తరబడి బారులు తీరినా దొరకని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో మరికొద్ది రోజుల్లో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారుల ముందస్తు చర్యలు తీసుకుంటే మేలని పలువురు రైతులు కోరుతున్నారు.

95వేల ఎకరాల్లో సాగు: పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో 95వేల ఎకరాల్లో వరి సాగైంది. ఇంకా అక్కడక్కడా




ముదురు నాట్లు వేస్తున్నారు. రెండు వారాల కిందట వరి కోసం కొనుగోలు చేసిన యూరియా భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వినియోగించడంతో కొరతకు దారి తీస్తోంది. తగినంత మేరకు డీసీఎమ్మెఎస్, ప్రాథమిక ఆగ్రోస్, సహకార సంఘాలు, ఇతర వ్యాపారుల వద్ద తగినంత నిల్వలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే రైతులు ఆందోళన బాట పట్టారు.

**కుల్కచర్లలో ఇలా:** కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఈ సీజన్‌కు వివిధ పంటలకు 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇప్పటి వరకు సగమే సరఫరా అయింది. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. సోమవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలకు 440 బస్తాలు సరఫరా అయింది. ఒక్కో రైతుకు ఒక్క బస్తానే ఇచ్చారు. పరిగిలో ప్రైవేట్ డీలర్ల వద్దకు రాకపోవడంతో ఒక్క ఆగ్రోస్ ద్వారానే అందుతున్నాయి.

**అదనులో పంపిణీ చేయాలి: శ్రీనివాస్ చౌడాపూర్**

సీజన్ సమయానికి ఎరువులు అందుబాటులో ఉంచితేనే ఇబ్బందులు ఉండవు. నాలుగు ఎకరాల్లో వరి, ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశా. వరిలో కలుపు నివారణ పనులు పూర్తిచేసి యూరియా కోసం వారం రోజులుగా తిరుగుతుండగా రెండు బస్తాలు దొరికాయి.

**ఇంకా తెప్పించేందుకు కృషి:వీరస్వామి, పరిమళ, వ్యవసాయాధికారులు కుల్కచర్ల, చౌడాపూర్**

అవసరమైన మేరకు యూరియా ఇంకా గ్రామాలకు అందాల్సి ఉంది. ఇప్పటికే వచ్చిన సంచులను రైతులకు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ఇంకా తెప్పించేందుకు కృషి చేస్తున్నాం. ఎరువుల సమస్యతో ఇబ్బంది పడకుండా చూస్తాం.

# నా పుస్తకం.. నా కథ

ధర్మపురి : విద్యార్థుల్లో చదువుతోపాటు ప్రాపంచిక విషయాలపై అవగాహన, కాల్పనిక శక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సెప్టెంబరు 8 వరకు ప్రతి రోజు 'నా పుస్తకం.. నా కథ' నినాదంతో నిత్యం సాయంత్రం 30 నిమిషాలపాటు ప్రతి విద్యార్థి గ్రంథాలయ పుస్తకాలు చదివేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా 218 ఉన్నత పాఠశాలలుండగా 35,916 మంది విద్యార్థులున్నారు. వీరికి ఉపయోగపడేలా గ్రంథాలయ పుస్తకాలకు రూ.5 వేల ప్రత్యేక గ్రాంటును కూడా కేటాయిస్తున్నారు. ధర్మపురి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కి చెందిన ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో రూ.25 వేల కథల పుస్తకాలను కొనుగోలు చేశారు. 6 నుంచి 8వ తరగతి వరకు ఒక బృందంగా, 9, 10 తరగతులు మరో బృందంగా ఏర్పాటు చేసి సాయంత్రం 30 నిమిషాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

నీతి కథలు, స్వాతంత్ర్య సమరయోధుల కథలతోపాటు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కేటాయిస్తున్నారు. పుస్తకాల పఠనంపై ప్రతిరోజు నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. బాగా చదివే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు కేటాయిస్తున్నారు. విద్యార్థులు చదివిన విషయాలపై సొంతంగా తమ అభిప్రాయాలను రాసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. అయిదుగురు విద్యార్థులు ఓ



బృందంగా ఏర్పడి చదివిన అంశాలను చర్చించుకుంటున్నారు.

**నైపుణ్యాల పెరుగుదల**

ప్రతిరోజు సాయంత్రం అరగంటపాటు నీతి పుస్తకాలు చదవడం బాగా నచ్చింది. చదివిన విషయాన్ని సొంతంగా ఆలోచించి పుస్తకంలో రాసుకుంటున్నాం. దీంతో దోషాలు సవరించుకుంటూనే పఠన, లేఖన నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నాం.

తాళ్లపల్లి మనిచందు, పదో తరగతి, బాలుర ఉన్నత పాఠశాల, ధర్మపురి

**సృజనాత్మకత పెంపునకు చర్యలు**

విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వీరంతా గ్రంథాలయ పుస్తకాలను చదువుకునేలా టీచర్లు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పాఠశాలలో దీన్ని అమలుపరుస్తున్నారు. రామునాయక్, జిల్లా విద్యాశాఖాధికారి, జగిత్యాల

చురకలు



## కొత్త దవాఖానాలు.. చేరువలో వైద్య సేవలు

వికారాబాద్: జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరంత చేరువ కానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే వివిధ పథకాలు ప్రవేశపెట్టాయి. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో జిల్లాలో కొత్తగా మరో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు బస్తీ దవాఖానాలు, నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇవే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ప్రజాప్రతినిధులు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

**జిల్లాకు మూడు పీహెచ్‌సీలు మంజూరు..**

జిల్లాకు కొత్తగా 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేశారు. చౌడాపూర్, దుద్యాల మండలం హాకీంపేట, దౌల్తాబాద్ మండలం బాలంపేటలో ఏర్పాటు చేయనున్నారు. చౌడాపూర్‌లో స్థలం కోసం అన్వేషిస్తున్నారు. బాలంపేటలో 40 శాతం పనులు పూర్తి చేశారు. హకీంపేటలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తాండూరు మండలం కరన్‌కోటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా వైద్యాధికారులు ప్రతిపాదనలను



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు పంపారు. త్వరలోనే ఇక్కడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కానుందని వైద్యాధికారులు తెలిపారు. ఇవే కాకుండా బొంబరాస్‌పేట మండలం రేగడిమైల్వార్, ధారూర్ మండలం తరిగోపుల, మోమిన్‌పేట మండలం మొరంగపల్లి ఉప కేంద్రాలను ఉన్నతీకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

**సేవలు మెరుగు..: డా.లలితాదేవి, జిల్లా వైద్యాధికారిణి**

కొత్తగా ప్రారంభించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. దవాఖానాల ఏర్పాటుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు. పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

## రేపుమాపంటారు.. చెల్లింపులు చేయరు

హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి హెచ్ఎండీఏ దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తోంది. రేపు..మాపంటూ నెలలు గడుస్తున్నా ఎల్ఆర్ఎస్ ఫీజు వాపసు గురించి పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. అధికారుల తీరుపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం కింద గతంలో హెచ్ఎండీఏ పరిధిలో చాలామంది దరఖాస్తు చేశారు.అందుకు ఫీజులు చెల్లించారు. కొందరు రూ.వేలల్లో.. మరికొందరు రూ.లక్షల్లో హెచ్ఎండీఏ ఖాతాలో జమ చేశారు. హెచ్ఎండీఏకు రూ.230 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. కొందరు తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోగా...మరికొందరు నిబంధనల కారణంగా చేసుకోలేదు. జలవనరులు, వివాదాస్పద స్థలాల్లో లేఅవుట్లు ఉన్న వాటి క్రమబద్ధీకరణకు హెచ్ఎండీఏ తిరస్కరించింది. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఛార్జీలుపోగా.. మిగతా డబ్బు తిరిగి ఇస్తామని హెచ్ఎండీఏ ప్రకటించింది. దరఖాస్తులు తిరస్కరించి నెలల గడుస్తున్నా డబ్బు మాత్రం వాపసు రాలేదని దరఖాస్తుదారులు వాపోయారు. అధికారులను నేరుగా కలిసినా.. ఫలితం ఉండటం లేదంటున్నారు. ఏడు జిల్లాల పరిధిలో వందలాది మంది ఫీజు రీఫండ్ కోసం ఎదురుచూస్తున్నారు.

**అసలు విషయం..**

ఎల్ఆర్ఎస్ కోసం హెచ్ఎండీఏకు 2.71 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 74 వేలకుపైగా దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఫీజులు కట్టించుకొని.. తిరిగి చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ విషయాన్ని వెలుగులోకి తెస్తే... త్వరలో వాపసు చేస్తామని హెచ్ఎండీఏ ప్రకటించింది. నెల రోజులు అవుతున్నా ఎలాంటి కదలిక లేదు.

ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు 2,71,352
ఫీజు కోసం నోటీసులు జారీ 2,07,501
ఫీజు చెల్లించిన వారు 74,928
చెల్లించని దరఖాస్తుదారులు: 1,32,973
ఆదాయం రూ.230.38 కోట్లు

## అద్దెకు కొన్ని.. మోక్షం కలగనివి ఇంకొన్ని!

వీణవంక: వీణవంక మండలంలో గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేక ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదు. కొన్నిచోట్ల సగం నిర్మించి వదిలేశారు. నూతన గ్రామపంచాయతీలకైతే నిధుల దిక్కు కూడా లేదు. వీణవంక మండలంలో గతంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. 2016లో కొత్తగా లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్, నర్సింహులపల్లి, బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, ఇప్పలపల్లి నూతన పంచాయతీలు ఏర్పడ్డాయి. 9 ఏళ్లవుతున్నా వీటి పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేయలేదు. పాఠశాలలు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆర్జీఎస్ఏ పథకంలో కనపర్తి, వల్భాపూర్ గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా పనులు సగం వరకు చేసి వదిలేశారు. చల్లూరు, కోర్కల్, కిష్టంపేట, ఎలబాక గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలకు మూడేళ్ల క్రితం ఈజీఎస్‌లో నిధులు రాగా.. పనులు ప్రారంభించలేదు. 12 గ్రామాల్లో పంచాయతీ కార్యకాలపాలు చిన్న అద్దె, పాఠశాలల గదుల్లో అందిస్తున్నారు.

**ప్రతిపాదనలు పంపలేదు** వీణవంకలో కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలకు నూతన భవనాల కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపలేదు. చల్లూరు, ఎలబాక, కిష్టంపేట, కోర్కల్ గ్రామాలకు నిధులు మంజూరైనా స్థలాలు లేక పనులు ప్రారంభించలేదు. కనపర్తి, వల్భాపూర్ గ్రామాలలో సగం పనులు కాగానే నిధులు రద్దయ్యాయి. నిర్మాణాలకు స్థలాలు గుర్తిస్తే నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం.శ్రీకాంత్, డీఈఈ పంచాయతీరాజ్

## అసంపూర్ణం.. అమృత్ భాండాగారం



పరిగి : ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయి. దీనికిగాను వివిధ పథకాల కింద రూ.కోట్లు మంజూరు చేస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో పనుల్లో వేగం మాత్రం కనిపించడం లేదు. దీనికితోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిపడా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

**నిల్వ సామర్థ్యం లేక..**

మిషన్ భగీరథ నీరు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో ఎద్దడితో అవస్థలు పడాల్సి వస్తోంది. రోజూ రెండు సార్లు ట్యాంకులు నింపుతున్నా అవి ఏ మూలకూ చాలడం లేదు. కొన్నిచోట్ల కొళాయిలకు మూతలు బిగించకపోవడంతో తాగునీరు మురుగు కాల్వల ద్వారా వృథాగా పారుతోంది. వార్డు అధికారులు పర్యవేక్షించి కట్టడి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**ఆదుకుంటున్న మోటార్లు..**

పురపాలిక పరిధిలో దాదాపు 70 మోటార్ల వరకు నిరంతరం పనిచేస్తున్నాయి. అవి ఏమాత్రం మొరాయించినా ఎద్దడి సమస్య అంతా ఇంతా కాదు. ఈ కారణంగా అవి మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేసి బిగించడంతో చాలా వరకు ఆదుకుంటున్నాయి. అమృత్-2 పథకం కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తయితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. పనుల పూర్తికి కృషి చేస్తామని పుర కమిషనర్ వెంకటయ్య అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సరఫరాను మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**30 ఏళ్లకు సరిపడా ప్రణాళిక వేసుకున్నా..**

పట్టణ ప్రజలకు తాగునీరు అందించే క్రమంలో అధికారులు 30 ఏళ్లకు సరిపడా ప్రణాళిక తయారు చేశారు. ఈ క్రమంలోనే అమృత్ జల్-2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ.14.5 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో టీచర్స్ కాలనీ, బస్టాండు ఏరియా, తిరుమల వెంచర్, శ్రీనివాస కాలనీల్లో నీటి ట్యాంకులను నిర్మించనున్నారు. వాటి ద్వారా సుమారు 6.5 లక్షల లీటర్ల నీటి పంపిణీకి అవకాశం కలుగుతుంది. ఆయా పనులు నేటికీ ఊపందుకోలేదు. పట్టణంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.

వార్డులు: 15
జనాభా: 30వేలు
కొళాయి కనెక్షన్లు: 5515
నివాస గృహాలు: 5,650
బోర్లు: 66

## తడి.. పొడి.. రోజుల తరబడి



హైదరాబాద్ : మహానగరానికి కేంద్ర బిందువైన కోఠి ప్రాంతం. వర్తక వాణిజ్య, విద్యా, వైద్య, ప్రభుత్వ కార్యాలయాలకు నిలయం.. అలాంటి చోట బ్యాంకు స్ట్రీట్ వెంట ముక్కు మూయకుండా నడవలేని పరిస్థితి. ఫుట్‌పాత్ కాదు కదా.. రోడ్డు సగం వరకు చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. రోజుల తరబడి తరలించకపోవడంతో కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుంటుంది. ఇక్కడ ఒక్క డంపర్ బిన్ కనిపించదు. సైబరాబాద్, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో కొన్ని ప్రాంతాలు మినహా ఏ వీధిచివర చూసినా చెత్త కుప్పలే. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏడు నక్షత్రాలు సాధించిన మహానగరం పరిస్థితిదీ. 150 డివిజన్లలోనూ చెత్తతో ప్రజలు బేజారెత్తుతున్నారు. సిటీబస్టాండుల్లో సైతం బస్సుల కోసం నిరీక్షించలేని పరిస్థితి నెలకొంది.

**బల్దియా పర్యవేక్షణ లేమి..:** నగరంలో చెత్త నిర్వహణపై జీహెచ్ఎంసీ పర్యవేక్షణ లోపించింది. సర్వే సమయాల్లో హడావుడి చేయడం.. తర్వాత మరుగున పడేయడం సాధారణంగా మారింది. జనంలోనూ పౌరస్పృహ లోపించింది. 2012లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని నిర్ణయించారు. ఇంటింటికి రెండు బుట్టలు పంపిణీ చేశారు. చెత్త సేకరణ బండికి అందించాలి. సేకరించిన చెత్తను వేర్వేరుగా కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. కానీ తడి పొడి కలగాపులగం అయింది. ఇంటింటికి చెత్త సేకరించే విధానానికి స్వస్తి పలికారు. వీధి చివరన ఉండే డంపర్ బిన్‌లలో చెత్త వేస్తున్నారు.

**రవాణా వారిదే..**

చెత్త నిర్వహణ జీహెచ్ఎంసీతో పాటు రాంకీ సంస్థకు అప్పగించారు. రవాణా మొత్తం రాంకీదే బాధ్యత. డంపర్‌బిన్లు నిండిన వెంటనే అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పగలు రాత్రి జరగాలి. కానీ సక్రమంగా జరగడంలేదు. వీధుల్లో చెత్త ఎక్కడకక్కడ నిలిచిపోతోంది. పర్యవేక్షణ లోపించింది.

**ఎన్నో లోపాలు..**

నగరంలో రోజుకు 8వేల టన్నుల చెత్త వెలువడుతున్నట్లు అంచనా. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకోసారి తరలిస్తున్నారు.

చెత్తను రోడ్లపై వేయొద్దు. అలా వేస్తే జరిమానా విధించాలి.కానీ ఇది అమలు కావడం లేదు.

హొటళ్లలో పోగైన వ్యర్థాలను రోడ్లపైనే వేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

రోడ్లమీద కాకుండా నాలాలన్నీ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, సంచులతోనే నిండిపోతున్నాయి.

చెత్త నిర్వహణపై పౌరుల్లోనూ అవగాహన కల్పించి చైతన్యం తేవాలని పలువురు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ విస్తీర్ణం 650 చ.కి.మీ
జనాభా: 1.20 కోట్లు (అంచనా)
రోజుకు వెలువడే చెత్త 8,000 టన్నులు
ఇంటింటికి తిరిగి సేకరించే ఆటోలు 5,450
పారిశుద్ధ్య కార్మికులు 18,500

## గుడ్డి నమ్మకమే 'సృష్టి' పెట్టుబడి

హైదరాబాద్ : మీకు పిల్లల్లేరా! సంతానలేమితో ఇబ్బంది పడుతున్నారా! పండంటిబిడ్డను అందిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో ఆర్భాటపు ప్రకటనలతో ఆకట్టుకుంటారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లో ఉచిత కన్సల్టెన్సీలు ఏర్పాటు చేస్తారు. అక్కడకు వచ్చిన దంపతుల బలహీనతను ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటారు. సరోగసీ ముసుగులో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత సాగించిన పాపాల చిట్టా. పోలీసుల దర్యాప్తుతోఒక్కొక్కటిగా వెలుగు చూస్తోంది. ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లి డబ్బులు పోగొట్టుకొని అనారోగ్యం పాలైన ఎంతోమంది బాధితులు ఫిర్యాదుకు ముందుకు వస్తున్నారు. నగర శివారుకు చెందిన ఒక బాధితురాలు నాలుగేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ కేంద్రానికి వెళ్లారు.

వైద్యపరీక్షలు చేసి ఆమె నుంచి అండాలు తీసుకున్నారు. తరువాత పిల్లలు పుట్టరంటూ ఆమెను మనోవేదనకు గురిచేశారు. అండాలు ఏంచేశారని ప్రశ్నిస్తే బెదిరించారని బాధితురాలు కన్నీరు పెట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన దంపతులనుంచి రూ.15లక్షలు వసూలుచేసి సరోగసీ బిడ్డను చేతికిచ్చారు. డీఎన్ఏ పరీక్షతో తమ బిడ్డ కాదని నిలదీస్తే మరో పిల్లాడ్ని తీసుకోమంటూ చెప్పడం వారిని నివ్వెరపాటుకు గురిచేసింది. చాలా మందికి సరోగసీతో బిడ్డను చేతికిస్తామని ఆశచూపి రూ.10-40లక్షలు వసూలు చేస్తారు. మొదట్లో డాక్టర్ నమ్రత, ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుతో వారిని గుడ్డిగా నమ్ముతారు. నెలలు గడిచే కొద్దీ చికిత్సతో ప్రయోజనం లేదని గ్రహించిన కొందరు నిలదీసినపుడు అసలు స్వరూపం బయటపడుతుందని ఒక బాధితురాలు వాపోయారు.



**శిశువిక్రయాలపై పోలీసుల గురి**

సరోగసీ ముసుగులో శిశువిక్రయాలపై పోలీసులు దృష్టిసారించారు. స్వాధీనం చేసుకున్న రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏపీ, తెలంగాణల్లో సుమారు 30మంది చిన్నారులు చేతులుమారినట్టు భావిస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న అనస్తీషియా నిపుణుడు కూడా ముఠాతో చేతులు కలపడం సంచలనంగా మారింది. ప్రభుత్వ వైద్యులు, వైద్యాధికారులతో సృష్టి నిర్వాహకులకు సంబంధాలపై పోలీసులు గురిపెట్టారు. ఈ కేసులో 8మంది నిందితుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

## 'శుద్ధి' అబద్ధం

హైదరాబాద్ : పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి కీలకం. నగరంలో చాలా మంది శుద్ధి జలాల పేరుతో ఆర్వో ప్లాంట్లను నుంచి కొనుగోలు చేసి తాగుతున్నారు. నిబంధనలు పాటించకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న శుద్ధి జల కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంత సురక్షితం అనేది చర్చనీయాంశగా మారింది. పర్యవేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి నీటిని డబ్బాల్లో నింపేసి అమ్మేస్తున్నారు. ఆ జలాలను లక్షలమంది వినియోగిస్తున్నారు. చాలా కేంద్రాల్లో నిబంధనలు పాటించడం లేదు. బోరు నీటిని ఆర్వో ప్లాంట్లలో నుంచి క్యాన్లలో నింపేసి అమ్మేస్తున్నారు. నగరంలో ఇలాంటివి వేలల్లో ఉన్నాయి. మురుగు కాలువల పక్కనే బోర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. 20 లీటర్ల డబ్బా రూ.10 నుంచి రూ.20 దాకా విక్రయిస్తున్నారు. .

**శుభ్రత, నాణ్యత, ప్రమాణాలేవీ?**

ప్రతి డబ్బా(క్యాన్)పై లేబుల్ విధిగా ఉండాలి. నీటిశుద్ధి ప్రమాణాలు,



సంస్థ వివరాలు కచ్చితంగా కనిపించాలి. ఇవి ఏ క్యాన్‌పైనా ఉండవు. ప్లాస్టిక్ క్యాన్లను కూడా ప్రమాణాల మేరకు ఉన్నవాటినే వినియోగించాలి. సరఫరా చేసే వాటిలో తాజా నీరే ఉండాలి. ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదు.దాన్ని ప్రత్యేక యంత్రాల సాయంతో అల్ట్రావైలెట్ కిరణాలతో పరీక్షించి బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసిన తర్వాతే నీటితో నింపాలి. విధిగా సీలు ఉండాలి. సహజంగా నీటిలో శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడే ఖనిజాలు ఉంటాయి. ఆర్వో ప్లాంట్లలో శుద్ధి ప్రక్రియలో పూర్తిగా ఖనిజాలు తొలగిపోతాయి.

**ఈ నిబంధనలుండాల్సిందే**

బోరు నీరు కోసం భూగర్భ జలవనరుల శాఖ అనుమతి, చిన్నతరహా పరిశ్రమ కోసం పరిశ్రమలశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి.
నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాట్లు ఉండాలి.
ప్రతి ప్లాంట్‌లో మైక్రోబయాలజిస్ట్, కెమిస్ట్ ఉండాలి.
పనిచేసే సిబ్బంది కూడా ఆరోగ్యవంతులై ఉండాలి.నిర్దేశించిన పరిమాణంలో ఖనిజాలను కలిపేందుకు ప్రత్యేక ఏర్పాటు ఉండాలి.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ఈపీఆర్

హైదరాబాద్ : ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత, భూమిలో కరిగే ప్లాస్టిక్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్స్ రెస్పాన్సిబులిటీ(ఈపీఆర్) లో నమోదు తప్పనిసరి చేసింది. నగరంలోని అనేక సంస్థలు మార్గదర్శకాలకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నాయి. జీడిమెట్ల, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక సంస్థలకు రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్దేశించినట్టు పీసీబీ అధికారులు వెల్లడించారు.

**ఈపీఆర్ అంటే..?**

ఇది ఒక పర్యావరణ విధానం, దీని ప్రకారం తయారీదారులు, దిగుమతి దారులు, బ్రాండ్ యజమానులు తమ ఉత్పత్తుల వ్యర్థ నిర్వహణకు పూర్తి బాధ్యత వహించాలి. పునర్వినియోగం, రీసైక్లింగ్, సురక్షితంగా పారేయడాన్ని పర్యవేక్షించాలి. ఇవి సాధారణంగా ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, బ్యాటరీ ఉత్పత్తులకు వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక కంపెనీ తయారు



చేసిన ప్లాస్టిక్ బాటిల్‌ను రీసైక్లింగ్ చేయడం లేదా సరిగా పారేయడంపై పూర్తి బాధ్యత వారిపైనే ఉంటుంది.

**ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్స్..:** జీడిమెట్ల, కాచిగూడ, మెహిదీపట్నం, మల్లాపూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి రంగారెడ్డి జిల్లా కొత్తూరు, అబ్దుల్లాపూర్‌మెట్, ఇప్పలపల్లె, షాద్‌నగర్, బూర్గుల, కీసర, చౌపల్లె, చేగూరులో ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్ యూనిట్లు ఉన్నాయి.

భూమిలో కరిగే ప్లాస్టిక్ (కంపోస్టబుల్) ఉత్పత్తుల యూనిట్లు..: చర్లపల్లి, జీడిమెట్ల, తుక్కుగూడ, బాచుపల్లి, కూకట్‌పల్లి, బషీరాబాద్, నాచారం, మహేంద్రహిల్స్, అమీన్‌పూర్, హయత్‌నగర్, బాలాపూర్.

**పౌరుల భాగస్వామ్యం అవసరం..**

ఈపీఆర్ లక్ష్యాలు చేరుకోవడంలో పౌరుల భాగస్వామ్యం అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. తమ ఇళ్లలో లేదా కార్యాలయాల్లో పునర్వినియోగించే వ్యర్థాలను గుర్తించి వేరు చేసి రీసైక్లింగ్ యూనిట్లకు తరలించాలి. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవచ్చు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ)కు బదులుగా బయోడీగ్రేడబుల్ లేదా పునర్వినియోగ సామగ్రిని ఎంచుకోవాలి.

## మూసీ నదిలో ఆక్రమణలు నేలమట్టం

హైదరాబాద్: చాదర్‌ఘాట్ నుంచి ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వరకు మూసీలో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. నదిని ఆక్రమిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి, నిజమని తేల్చుకున్నాక చర్యలు తీసుకున్నామని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కొన్నేళ్లుగా ఆక్రమణదారులు నదిలో మట్టి పోసి పార్కింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. హైడ్రా బృందాలు ఉదయం 6గంటలకు కూల్చివేతలు ప్రారంభించాయి. మొత్తం 9.62 ఎకరాల నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమణల నుంచి రక్షించినట్టు హైడ్రా వెల్లడించింది.

కోర్టు ధిక్కరణ కేసులున్నా.. 'మూసీ ఆక్రమణలతో ముగ్గురు వ్యక్తులకు సంబంధం ఉంది. తికారం సింగ్ ఆధీనంలో 3.10 ఎకరాలు, పూనమ్ చాంద్ యాదవ్ 1.3 ఎకరాలు, జయకృష్ణ చేతిలో 5.22 ఎకరాల భూమి ఉంది. వారిపై కోర్టు ధిక్కరణ కేసులూ ఉన్నాయి. కబ్జాలపై హైకోర్టు గతంలోనే ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆక్రమణదారులపై కేసులు పెట్టారు. పోలీసులు వెళ్లినా కబ్జాదారులు వెనక్కి తగ్గలేదు.

# నేత్ర దానం.. వెలుగుల గమ్యం

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరుకు చెందిన హుసేని (54) గుండెపోటుతో బాధపడుతూ ఇటీవల సర్వజన వైద్యశాలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐ డొనేషన్ కౌన్సిలర్ శంకర్ ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో నేత్రదానానికి సమ్మతించారు. దీంతో మృతుడి కార్నియాలను సేకరించి ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు.

జిల్లాలో నేత్రదానం చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏటా సుమారు 400 మంది కార్నియాలను సేకరిస్తున్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి అమర్చి వెలుగులు నింపారు. “ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం.. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించి కళ్లు దానం చేసే వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం” అని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందురెడ్డి తెలిపారు.

**ఎవరి కళ్లు దానం చేయొచ్చు**

ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆరోగ్యవంతులు, గుండె జబ్బులు,



ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో మృతి చెందిన వారు, సహజ మరణం పొందిన వారి నేత్రాలను దానం చేయొచ్చు.

ఏ వయసు వారి కళ్లయినా ఇవ్వవచ్చు కళ్లద్దాలు ధరించే వారు, మధుమేహం, రక్తపోటు రోగులూ మరణానంతరం తమ నేత్రాలను దానం చేయొచ్చు.క్యాన్సర్‌తో బాధపడుతన్న వారు, నల్లగుడ్డు దెబ్బతిన్న వారు, ఎయిడ్స్ రోగులు, కామెర్లు, పిచ్చికుక్క కాటుతో మరణించిన వారు అనర్హులు.

**అపోహలు.. వాస్తవాలు**

నేత్రదానం 15- 20 నిమిషాల్లో పూర్తయ్యే అతి సామాన్య ప్రక్రియ. అంధులకు కార్నియా (నల్లగుడ్డు)ను మాత్రమే అమరుస్తారు. మొత్తం కంటిని కాదు.ఒక వ్యక్తి మరణించిన తర్వాత 4 గంటల్లోపు అతని కార్నియా పొరను శస్త్రచికిత్స ద్వారా సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించవచ్చు.నేత్రదానానికి ఎవరైనా వాగ్దానపత్రం ఇచ్చినా వారి సమీప బంధువు ఆమోదం కూడా అవసరం అవుతుంది.

**ఎలా దరఖాస్తు చేయాలి**

నేత్రాలు దానం చేయాలనుకొనే వారు దరఖాస్తు పత్రాన్ని భర్తీ చేసి ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి. 18 సంవత్సరాల వయసు నిండిన వారి నుంచి మాత్రమే దాన పత్రం స్వీకరిస్తారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కౌన్సిలర్ నంబరు 9640692299కు ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారు.

# యువత మైకం.. భవిత శోకం

ఒంగోలు: చక్కగా చదువుకుంటూ భవితకు పునాదులు వేసుకోవాల్సిన వయసులో కొంతమంది విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు బానిసైపోతున్నారు. అందరితోనూ కలివిడిగా ఉంటూ సరదాగా తిరగాల్సిన వీరిని మైకం కమ్మేస్తోంది. గంజాయి తాగడం తప్ప మరో దానిపై ధ్యాస పెట్టని వీరిని చూసి కన్నవారు కన్నీటిపర్యంతమవుతున్నారు. గంజాయికి అలవాటు పడిన తమ పిల్లలకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రం (డీ అడిక్షన్ సెంటర్)లో చికిత్స చేయిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 20 ఏళ్ల వయసువారే ఉండడం గమనార్హం.


ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మానసిక వైద్య చికిత్స విభాగంలో గంజాయికి బానిసలైన వారికి వైద్యం అందించి సాధారణ స్థితికి చేరుకునేవిధంగా చేస్తున్నారు. వీరిని ఆసుపత్రిలో చేర్చుకుని రెండు వారాల పాటు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. మొదట్లో వ్యసనపరులు చికిత్సకు సహకరించకున్నా వైద్యులు మందులు ఇవ్వడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తూ వారిని దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అత్యధిక కేసుల్లో మార్పు కనిపిస్తోంది. వీరు స్నేహితుల బలవంతం చేశారనో, ఇతరత్రా పరిస్థితుల ప్రభావంతో తిరిగి గంజాయి తాగితేపరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది. ఇలా రెండు, మూడుసార్లు ఈ తరహాలో అలవాటు పడిన వారు ఆసుపత్రికి వచ్చి




చికిత్స పొంది సాధారణ జీవితం గడుపుతున్నారు.

గంజాయి వ్యసనపరుల్లో ఎక్కువగా 14 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు వారు ఎక్కువగా ఉంటున్నారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో గంజాయి తాగడం అలవాటు చేసుకుని డబ్బులు దొరక్కుంటే గంజాయి అమ్మడానికి వెనకాడటంలేదు. గంజాయికి బానిసలైతే చదువును మధ్యలో వది లేయడంతోపాటు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. కళ్లు ఎర్రగా ఉంటే అనుమానించాల్సిందే..: గంజాయి తాగేవారి కళ్లు ఎర్రగా ఉండి ఏ పని మీద దృష్టిపెట్టలేరు. ముందుగానే మేల్కొని చికిత్సకు తీసుకొస్తే వ్యసనం వారిని బయటపడేయొచ్చు. టోల్‌ఫ్రీ నంబరు 1933కు గానీ, నేరుగా ఆసుపత్రికి వచ్చి మమ్మల్ని గానీ సంప్రదించవచ్చు.సాగర్, మానసిక వైద్య నిపుణులు

# ‘పచ్చి’మోసం



కర్నూలు : ఉల్లి వ్యాపారులు ‘పచ్చి’మోసానికి పాల్పడుతున్నారు. ఉల్లిరైతుకు కన్నీరు తెప్పిస్తున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆగస్టు చివరి వారంలోనే రికార్డుస్థాయిలో కర్నూలు మార్కెట్‌కు దిగుబడులొచ్చాయి. ఒక్కరోజే 302 లాట్లు వచ్చాయి. సరకు నాణ్యత లేదని, పచ్చిగా ఉందని.. తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండదని కొర్రీలు పెట్టి పక్కన పడేశారు. 150 లాట్లకు వ్యాపారులు టెండరులో ధరలు కోట్ చేయలేదు.

**దిగుబడుల వరద.. ధర‘దడ’**

జులై నెల నుంచి మార్కెట్‌కు ఉల్లి దిగుబడులు అమ్మకానికి వస్తున్నాయి. నెల రోజులుగా మార్కెట్‌కు రోజుకు 150- 300 క్వింటాళ్లలోపే రైతులు తీసుకొస్తున్నారు. క్వింటా గరిష్ఠ ధర రూ.1,100 ఉండగా సగటున రూ.600- రూ.800 వరకు పలుకుతోంది.

రైతులు 28,673 ప్యాకెట్లలో 12,903 క్వింటాళ్ల సరకు తెచ్చారు. నాణ్యత లేదని.. పచ్చిగా ఉందంటూ వ్యాపారులంతా సిండికేట్‌గా మారి కొంత సరకును తక్కువ ధరకు కొనుగోలు చేసి మిగిలిన దానికి ధరనే నిర్ధారించలేదు. క్వింటా ఉల్లి కనిష్ఠ ధర రూ.501, మధ్యస్థం రూ.1,075, గరిష్ఠ ధర రూ.1,329 పలికింది. సగం లాట్లను వ్యాపారులు కొనుగోలు చేయలేదు.

**గద్దల్లా వాలిన దళారులు**

ల్కెసెన్స్‌డ్ వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేయకపోవడంతో దళారులు, అనధికారిక వ్యక్తులు మార్కెట్‌లో గద్దల్లా వాలిపోతున్నారు. రైతుల నుంచి క్వింటా రూ.200, రూ.300, రూ.400కు కొనుగోలు చేస్తున్నారు. ఎవరికి వారు మార్కెట్‌యార్డులో కొనుగోలు చేస్తున్నా మార్కెట్ కమిటీ అధికారులు పత్తాలేకుండా పోయారు.

**కన్నెత్తి చూడని అధికారులు**

వ్యాపారులంతా సిండికేట్ అయ్యి సగం దిగుబడులు కొనుగోలు చేయకపోవడం గమనార్హం. వ్యాపారులతో మాట్లాడి మొత్తం సరకును కొనుగోలు చేసేలా ఒప్పించాల్సిన అధికారులు కార్యాలయం నుంచి బయటికి రాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య.. మార్కెట్ కమిటీ సెక్రటరీ, వ్యాపారులతో సమావేశమై వెళ్లిపోయారు. దిగుబడుల వైపు చూడకుండా.. తమతో మాట్లాడకుండానే వెళ్లిపోయారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్యాకెట్ రూ.వందకు అడుగుతున్నారు**

ఐదెకరాల్లో ఉల్లి సాగు చేశా. మొదటి విడతగా ఒక ఎకరా దిగుబడులు 70 ప్యాకెట్లను కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చా కోత కోసి, గ్రేడింగ్ చేయించి, మార్కెట్‌కు తెచ్చేందుకు రూ.34 వేలు ఖర్చయింది. ఎకరా పంట సాగుకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టా. మార్కెట్‌లో అమ్ముదామంటే ఈ-నామ్‌లో వ్యాపారులు సరకు బాగాలేదని కొనుగోలు చేయలేదు. దళారులు వచ్చి ప్యాకెట్ రూ.వందకు ఇస్తావా అని అడుగుతున్నారు. తెచ్చిన సరకంతా అమ్మినా రూ.7 వేలు కూడా రాని పరిస్థితి. పెద్ద రంగన్న, బస్తిపాడు

# ఎవరి‘దారి’ వారిదే



నంద్యాల : రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు విడుదల చేస్తోంది. ప్రజల కష్టాలు తీర్చేలా చర్యలు చేపట్టింది. మరోవైపు పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. తమకు నచ్చిన విధంగానే పనులు జరగాలని నాయకులు.. అస్మదీయ గుత్తేదారుడే చేయాలని అధికారులు పట్టుబడుతుండడంతో నిర్మాణాలు ఆగిపోతున్నాయి. నిధులు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు గుంతల రహదారులపై ప్రయాణించలేక జనం ఇబ్బందులు పడుతున్నారు.ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం-నర్సాపురం మెట్ట రోడ్డు గుంతలమయంగా మారడంతో రహదారి నిర్మాణానికి రెండేళ్ల కిందట నిధులు కేటాయించారు. సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద మొత్తం 50 కి.మీ. పొడవునా చాగలమర్రి నుంచి మహదేవపురం వరకు రహదారి అభివృద్ధికి రూ.32.5 కోట్లు మంజూరయ్యాయి. 32.5 కి.మీల పొడవునా పూర్తి చేశారు. కేవలం 8 కి.మీ. మేర ఆగిపోయాయి. రూ.8 కోట్ల విలువైన ఈ పనుల విషయమై గుత్తేదారుడికి.. ఓ నేతకు మధ్య సఖ్యత కుదరలేదు. ‘ఒప్పందం’ విషయంలో పేచీ పడడంతో ఏడాదికిపైగా పనులు ఆగిపోయాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వారు సై అంటేనే..**

ఆర్అండ్‌బీ పనుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులు ‘సై’ అంటే పని.. లేకుంటే లేదు అనేలా పరిస్థితి మారింది. ఇదే సమయంలో కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారమిచ్చి పనులు జరగకుండా చేస్తున్నారు. పాణ్యం మండలం కొణిదేడు గ్రామ సమీపంలో ఇటీవల ఏర్పాటుచేసిన వంతెన వద్ద సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారుడు ఆ పనులు చేయలేదు. తనకు ఇదే ఒప్పందంపై మరో పని అప్పగిస్తే తప్ప చేయనని మొండికేశారు. గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ పని చేయకపోగా ప్రజాప్రతినిధుల అనుమతితో మరో పని కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో అవసరమైన రహదారులకు ప్రతిపాదనలు కాకుండా తమకు ‘నచ్చిన’ రహదారులకు ప్రతిపాదనలు, నిధులు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**నిత్యం చక్రం తిప్పుతూ..**

నంద్యాల కలెక్టరేట్ ఆనుకుని వెళ్లే బొమ్మలసత్రం-నూనెపల్లె జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడంతోపాటు డివైడర్లు, ఇరువైపులా కాలువల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి. ఎండీఆర్ కింద మంజూరైన ఈ పనులను అంచనా వ్యయం కన్నా 4.1 శాతం ఎక్కువకు గుత్తేదారుడు తీసుకుని రూ.2.6 కోట్ల విలువైన పనులు చేశారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ పనులను అస్మదీయ గుత్తేదారుడికి ఇచ్చేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వైకాపాకు చెందిన ఒక గుత్తేదారుడికి పనులు ఇచ్చేలా పావులు కదుపుతున్నారు. దీనిని ఓ ప్రజాప్రతినిధి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఈ పనులు ప్రశ్నార్థకంగా మారిపోయాయి.నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్-సంజీవనగర్ ప్రధాన రహదారిని నాలుగు వరుసల సీసీ రహదారిగా నిర్మించేందుకు రూ.4.5 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనిని చేసేందుకు నలుగురు గుత్తేదారులు పోటీ పడ్డారు. నిబంధనల ప్రకారం వీరిలో తక్కువ మొత్తానికి వేసిన గుత్తేదారుడికి పనులు అప్పగించాల్సి ఉంది. అస్మదీయ గుత్తేదారుడికి ఈ పనులు రాలేదని ‘అగ్రిమెంట్’ను అధికారులు ఆపేశారు. ప్రస్తుతం దీనిని రద్దు చేసేలా ప్రయత్నిస్తున్నారు.

# ప్రవేశాలు పెరిగాయ్!

ఒంగోలు: జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. ఇవి పేద, సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలలతో సమానంగా బోధన, సౌకర్యాలు మెరుగుపరచడంతో ఆదరణ పెరుగుతోంది. వీటిల్లో చేరే వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఏడాది ఐఐటీ, నీట్ తదితర పరీక్షలకు సంబంధించి మెటీరియల్ (విద్యా సామగ్రి) ఉచితంగా అందిస్తున్నారు. దీంతోపాటు విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఎలా బోధించాలనే దానిపై ప్రతి ఆదివారం ఒక్కో సబ్జెక్టు నిపుణులతో అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నారు.కళాశాలల్లో అధ్యాపకుల కొరత లేకుండా ఎక్కడైనా ఉద్యోగ విరమణ చేసినప్పుడు ఖాళీలు ఏర్పడితే వారి స్థానంలో ఒప్పంద అధ్యాపకులను నియమిస్తున్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించి రసాయనాలు అందుబాటులో ఉంచుతున్నారు. నిధుల రాక కోసం ఎదురుచూడకుండా అవసరమనుకుంటే అత్యవసర నిధితో కొనుగోలు చేస్తున్నారు. పల్లె ప్రాంతాల్లో అమ్మాయిలను చదువు కోసం సుదూర ప్రాంతాలకు పంపలేని వారు స్థానికంగా ఉన్న కళాశాలల్లో చేర్పిస్తున్నారు.

అబ్బాయిలతోపాటు అమ్మాయిల సంఖ్య పెరుగు తూ వస్తోంది. కళాశాలల నిర్వహణ ఎలా ఉంది.. పరీక్షలు ఎలా జరుగుతున్నాయి.. తదితర అంశాలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రతి వారం విధిగా తనిఖీలు చేయాలని బోర్డు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు లోపాలు చక్కదిద్దాల్సిందిగా చెబుతుండడంతో పర్యవేక్షణ మెరుగుపడింది.

**పేద విద్యార్థులకు భరోసా** కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకాలు భరోసానిస్తున్నాయి. పేద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు కృషి చేయడంతోపాటు విద్యార్థులను ఇంటర్మీడియట్ అనంతరం ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ఆంజనేయులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

# మాపై క‘రుణ’చూపండి!

ఒంగోలు: బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, మేదర, కుమ్మరి, శాలివాహన తదితర సామాజిక వర్గాలకు చెందిన పేదలకు స్వయం ఉపాధి నిమిత్తం గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసింది. అయిదేళ్ల అనంతరం యూనిట్లు మంజూరు కావడంతో దరఖాస్తులు అధిక సంఖ్యలోనే వచ్చాయి. మంజూరైన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి బ్యాంకర్ల ద్వారా రుణ మంజూరు పత్రాలు కూడా ఇచ్చారు. వాటి గ్రౌండింగ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీ నగదు విడుదల కాకపోవడంతో నాలుగు నెలలకుపైగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

**2,069 యూనిట్లు...12,675 దరఖాస్తులు**

2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ పాలనలో ఈబీసీలకే కాదు...ఎస్సీ, ఎస్టీ, బీసీతో పాటు అగ్రవర్ణ పేద వర్గాలకు ఒక్క స్వయం ఉపాధి యూనిట్ కూడా మంజూరు చేయలేదు. దీంతో ఆయా వర్గాల యువత ఉపాధి యూనిట్ల మంజూరు నిమిత్తం ప్రైవేటు వ్యాపారులు లేదా వాణిజ్య బ్యాంకులను ఆశ్రయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీల్లో భాగంగా కార్పొరేషన్లను గాడిలో పెట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రజలకు వెన్నుదన్నుగా ఉండేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కూడా జీవనోపాధుల నిమిత్తం రాయితీపై బ్యాంకు అనుసం




ధానం కింద రూ.కోట్లు రుణాల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 2,069 యూనిట్లు..రూ.49.65 కోట్లు మంజూరు లక్ష్యం కాగా నిర్దేశించింది,. ఇందుకు రెండు నెలలపాటు దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 12,675 వచ్చాయి.

**1,070 మందికి బ్యాంకు రుణం**

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాజాగా ఆర్థికంగా వెనుకబడిన అన్ని సామాజిక వర్గాల పేదలకు రాయితీ రుణాలు అందించే క్రమంలో ఆరు రంగాలను ప్రాధాన్యంగా తీసుకుంది. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 11న ఒంగోలులోని కలెక్టరేట్‌లో స్వయం ఉపాధి యూనిట్ల మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ఆ రోజున తొలి విడతగా 611 మందికి రూ.16.24 కోట్ల మేర మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఎంపిక చేసిన వారితో కలిపి ఇప్పటివరకు మొత్తం 1,070 మందికి రూ.32.64 కోట్లు మంజూరుకు బ్యాంకర్లు ఆమోదించారు. రాయితీ 40 శాతం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి రాయితీ విడుదల కాలేదు. నిరుద్యోగులు యూనిట్లు ఎప్పుడిస్తారంటూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

# రెవెన్యూ లీలలు ఇంతంత కాదయా..!

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వంలో అక్రమాల వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని.. కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తెస్తుంటే.. క్షేత్రస్థాయిలో దీనికి భిన్నమైన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రధానంగా గత రీసర్వే అనంతరం తలెత్తిన సమస్యల పరిష్కారంలో కొందరు తహసీల్దార్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. భూ యజమానికి ప్రమేయం లేకుండా వేరే వారికి ఆన్‌లైన్‌లో బదలాయిస్తున్నారు. కొన్నింటిని వివాదాస్పద భూములుగా పేర్కొని నిషేధిత జాబితాలో చేర్చుతున్నారు.

రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో 0.50 ఎకరాల భూమిని 2015లో రాజమహేంద్రవరం గ్రామీణానికి చెందిన రామారావు కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే అనంతరం ఎల్‌పీఎం 1156 కేటాయించారు. దస్త్రాలన్నీ తనవద్దే ఉన్నా, ఎవరికీ విక్రయించకపోయినా 2023లో అప్పటి అధికారులు వేరే వ్యక్తి పేరిట బదలాయించారని వాపోయారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా.. విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో అర్జీదారు పేరు నమోదు చేయాలని తహసీల్దార్‌కు జేసీ చిన్నారాముడు జూన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

రాజానగరం మండలం పాలచర్లలో తనకున్న 0.83 ఎకరాలను వేరే వ్యక్తికి 0.46 ఎకరాలు కేటాయిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు డి.పట్టా మంజూరు చేశారని కొత్త సత్యనారాయణ ఇటీవల ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎటువంటి వివాదం లేకున్నా 22ఏ నిషేధిత జాబితాల్లో చేర్చడంతో ఇబ్బందులు



పడుతున్నామన్నారు. దివాన్‌చెరువు ఫ్లైఓవర్‌కు సంబంధించి చేపట్టిన భూసేకరణ విషయంలోనూ వివాదం నెలకొంది. గతంలో సేకరించి పరిహారం చెల్లించిన భూమికంటే ఎక్కువ విస్తీర్ణం భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రీసర్వేకు ఆర్డీవో ఆదేశించారు.

గోపాలపురం మండలం పరిధిలోని ఓ గ్రామంలోని వ్యక్తికి అయిదెకరాల భూమి ఉండగా.. అతనికి తెలియకుండా మరో వ్యక్తి పేరిట ఆన్‌లైన్‌లో బదలాయింపు జరిగింది. దీనిపై ఫిర్యాదు అందడంతో విచారణకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో కొందరు అధికారులు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.

గోపాలపురం మండలంలో ఓ విశ్రాంత ఆర్మీ జవాన్‌కు అయిదెకరాల భూమి కేటాయించినట్లు నమ్మించి నకిలీ దస్త్రాలు సృష్టించారు. దీనికి గాను రూ.14 లక్షలు వసూలు చేశారు. దీనిలో డీటీతోపాటు మరికొందరు సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులున్నట్లు విచారణలో తేలింది. రెవెన్యూ అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

చురకలు



# విషం వడ్డిస్తున్నారు!



అనంతపురం: రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసం, నాసిరకం నూనెలతో వంటకాలు... పాడైపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన పప్పుదినుసులతో తయారుచేసిన ఆహార పదార్థాలు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు హొటళ్లు, రెస్టారెంట్లలో జరుగుతున్న తతంగం ఇది. కొందరు యజమానులు ధనార్జనే ధ్యేయంగా కల్తీ ఆహారాన్ని జనాలకు అంటగడుతూ జేబులు నింపుకొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా హానికర రసాయనలు, మోతాదుకు మించి రంగులు వినియోగిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆహార భద్రతా అధికారులు కేసులు పెట్టి శిక్షలు విధిస్తున్నా కొందరు నిర్వాహకుల్లో మార్పు కనిపించడం లేదు.

అనంత నగరం గుత్తిరోడ్డులోని వినాయక హొటల్‌లో ఓ వినియోగదారు శీతలపానీయం కొన్నారు. బాటిల్‌ను పరిశీలిస్తే కాలం చెల్లిందిగా తేలింది. ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేయగా అక్కడ ఉన్న బాటిళ్లు అన్నీ కాలం చెల్లినవిగా తేల్చారు. దీంతో హొటల్ యజమానిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కదిరిలోని అరబిక్ రెస్టారెంట్‌కు వచ్చినవారు ఆహార పదార్థాలు తినగా మిగిలిపోయిన వాటిని మరుసటిరోజు మళ్లీ వేడి చేసి.. కొత్తవారికి వడ్డించినట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది. నాణ్యతలేని మాంసాన్ని వంటల్లో వాడుతున్నట్లు గుర్తించారు. రెస్టారెంట్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో పురుగులు పట్టిన శనగల్ని వంటల్లో వాడుతున్నట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది.

**మిగిలింది వేడి చేసి..**

రోజూ వండిన ఆహారాన్ని మరుసటి రోజు వేడి చేసి తింటే అది విషంగా మారుతుంది. అలాంటిది కొన్ని రెస్టారెంట్లలో మాంసాన్ని రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. మిగిలిపోయిన వంటకాల నుంచి మాంసం ముక్కలను వేరు చేసి ఫ్రిజ్‌లో పెట్టేస్తున్నారు. మరుసటి రోజు వాటినే వినియోగిస్తున్నారు. దీనివల్ల ఆయా రెస్టారెంట్లల్లో తిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు అనారోగ్యం బారిన పడుతున్నారు. 70 శాతానికి పైగా హొటళ్లలో నాణ్యమైన నూనె వాడటం లేదు. అదే నూనెను అనేకసార్లు వినియోగిస్తూ ఆహారాన్ని విషతుల్యం చేస్తున్నారు. బిర్యానీ, కబాబ్, స్వీట్లల్లో హానికర రంగులు కలిపి ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు.

**ఈ ఏడాదిలో కల్తీ ఆహారంపై నమోదైన కేసులు**

అనంతపురం జిల్లా : 24

శ్రీసత్యసాయి.. : 25

**నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే కఠినచర్యలు: తస్లిమా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం**

మాంసాన్ని నిర్ణీత ప్రమాణాల మేరకు మాత్రమే నిల్వ చేయాలి. చాలామంది సాధారణ ఫ్రిజ్‌లో పెట్టేసి రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. దీనివల్ల కొన్ని గంటల్లోనే మాంసం చెడిపోవడం ప్రారంభమవుతుంది. దాంతో వంటలు చేస్తే అది విషంగా మారే ప్రమాదం ఉంది. నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం.

# సహకార స్థలం అన్యాక్రాంతం

పుట్టపర్తి: పరిగిలో ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన విలువైన స్థలం అన్యాక్రాంతమైంది. కొన్నేళ్లపాటు ఖాళీగా ఉన్న స్థలంలో కొందరు ఇతర అవసరాలకు ఉపయోగించుకునే నెపంతో ఆక్రమణలకు పాల్పడ్డారని సొసైటీ సభ్యులే ఆరోపిస్తున్నారు. పరిగి మండలం బీచిగానిపల్లి, హొన్నంపల్లి, పరిగి గ్రామాల్లో వ్యవసాయ పరపతి సంఘాలు ఏర్పాటయ్యాయి. దాతలు కె.నంజుండప్ప, ఆర్.ఆదినారాయణరెడ్డి, సి.అంజినప్ప సర్వే నంబరు 421-3ఎలో మొత్తం 18 సెంట్ల స్థలాన్ని 1981, ఏప్రిల్ 4న సొసైటీకి రాసిచ్చారు. పైడేటి సర్కిల్‌లో పెద్ద ఆంజనేయస్వామి గుడి పక్కనే ఈ స్థలం ఉంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇచ్చినట్లు దాతలు పేర్కొన్నారు. అప్పటికే ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ స్థలంలో కొత్తది నిర్మించాలని ప్రయత్నాలు చేయగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిన్నకుండిపోయారు.

**ఒక్కొక్కటిగా..** కొన్నేళ్లుగా స్థలం ఖాళీగా ఉండటంతో కొందరు గడ్డివాములు వేసుకున్నారు. మరికొందరు తమకు తాతల కాలం నుంచి అందులో కొంత స్థలానికి లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయంటూ కరెంటు బిల్లులు, కుళాయి రశీదులు సంపాదించి పంచాయతీ నుంచి అసెస్మెంట్ నంబరు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. దీంతో సొసైటీ సభ్యులు 2003లో హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన కోర్టు.. ఆక్రమణలు తొలగించాలని 2004లో ఆదేశాలిచ్చింది. స్థలం అనుభవదారులు 2008లో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు.



ఈనేపథ్యంలో కొంత స్థలాన్ని కొందరు వ్యక్తులు గతేడాది హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయంగా సొసైటీ సభ్యులు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

**రాజకీయ నాయకుల ఒత్తిళ్లు: బద్రీనాథ్, శ్రీరాములు, పరిగి**

ఆక్రమణలు తొలగించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ముందుకు రావడం లేదు. ఆక్రమార్కులు నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు స్పందించడం లేదు. జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

**లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయి: పూజారి సత్యనారాయణ, పరిగి**

స్థలం ఆక్రమించుకోలేదు. అందులో 39/48 అడుగుల విస్తీర్ణంలో ఉన్న స్థలానికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ ఉంది. ఇతరులు ఆక్రమించుకున్నారు. కొంత స్థలం ఖాళీగా ఉంది.

**తగిన చర్యలు తీసుకుంటాం: హసీనా సుల్తానా, పరిగి తహసీల్దార్**

గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే 15 రోజుల కిందట ఆర్ఐ, వీఆర్ఓలను పంపించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయించాం. సంబంధిత స్థలానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం.

# మీ ఇంటికి చెత్తసేకరణకు వస్తున్నారా..?

తిరుపతి : పారిశుద్ధ్య నిర్వహణకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడం లేదని భావించిన కూటమి ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతోందని ఆరా తీస్తోంది. 'మేం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఇంటికి చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నారా..' అని అడుగుతోంది. 'వస్తుంటే 1 నొక్కండి.. రాకపోతే 2 నొక్కండి' అంటూ ఐవీఆర్ఎస్ విధానంలో అధికారులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణతో పాటు వ్యర్థాల సేకరణ, నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు తీసుకుంటోంది. వాటిని విశ్లేషించి ప్రతి మంగళవారం జరిగే పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల సమావేశంలో వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.



**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు నగరపాలికలు, 10 పురపాలికలు, 1,411 పంచాయతీలు ఉన్నాయి. 2014-19 మధ్య అప్పటి తెదేపా హయాంలో ఉపాధి హామీ నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. వైకాపా హయాంలో వాటిని అటకెక్కించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించింది. తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలు వేర్వేరుగా సేకరించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్వే చేస్తోంది. ప్రజలు అసంతృప్తి చెందితే పంచాయతీల్లో కార్యదర్శి, ఈవోపీఆర్డీలుబీ నగర, పురపాలికల్లో కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కారణం చెప్పాల్సి ఉంటుంది. వారి సమాధానం సహేతుకంగా లేకుంటే నోటీసు ఇస్తారు.

# 21 కి.మీ. ప్రయాణం నరకమే..!

తిరుపతి : వెంకటగిరి– గూడూరు రహదారి ప్రమాదకరంగా మారింది. ఛిద్రమైన తారు రోడ్డులో పెద్దఎత్తున విస్తరించిన గుంతలతో ఈ మార్గంలో వెళ్లాలంటేనే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో పెద్దసంఖ్యలో వాహనదారులు సైతం వెళ్తుంటారు. బంగారుపేట నుంచి బాలాయపల్లి సమీపంలోని వెంకటరెడ్డికాలనీ వరకు సుమారు 21 కి.మీ. ఈ దుస్థితి నెలకొంది. గుంతలు తప్పించే క్రమంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కాగితాల్లోనే విద్యుత్తు ఉపకేంద్రాలు



గుత్తి : గుత్తి విద్యుత్తు సబ్‌డివిజన్‌లో కొత్తగా విద్యుత్తు ఉపకేంద్రాల ఏర్పాటు అందని ద్రాక్షగా మారింది. ఉపకేంద్రాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. ఇవి గత ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్రాల ఏర్పాటుకు రైతులు, ప్రజలు నిరీక్షిస్తున్నారు.

గుత్తి సబ్‌డివిజన్‌లో అదనపు విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఏడాదికేడాది విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. గుత్తి, ధర్మాపురం, ఖాదర్‌పేట, పామిడి పట్టణాలకు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. సబ్‌డివిజన్‌లో రోజుకు రెండు మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం ఉంటోంది. వ్యవసాయ కనెక్షన్లు 8 వేల వరకు ఉన్నాయి. గృహోపయోగ సర్వీసులు 22 వేలు ఉన్నాయి. రైతులు నిరంతరం బోర్లు తవ్వుకుంటూ విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటున్నారు.

**అప్పటి అంచనాలే దిక్కు..**

ఎప్పుడో 30 ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏర్పాటు చేసిన నియంత్రికలపై విద్యుత్తు లోడు అధికంగా ఉంటోంది. ఫలితంగా తరచూ నియంత్రికలు కాలిపోతున్నాయి. పైగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్తు సరఫరాను అధికారులు మెరుగుపరచాలని రైతుల నుంచి డిమాండ్ ఉంది. ధర్మాపురం గ్రామంలో చిన్నపాటి గాలి వీచినా త్రీఫేస్ కనెక్షన్లు ట్రిప్ అవుతున్నాయని మాజీ సర్పంచి శ్రీనివాసులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి మిగిలిన అన్నీ ప్రాంతాల్లోనూ ఉందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

**స్థల సేకరణకే పరిమితం**

గుత్తి, పామిడి మండలాలకు మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి విద్యుత్తుశాఖ అధికారులు స్థలసేకరణ పూర్తి చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు 50 సెంట్ల స్థలాన్ని సేకరించారు. ఒక్కో కేంద్ర నిర్మాణానికి రూ.1.50 కోట్లు వెచ్చించాల్సి ఉంది. మూడు కేంద్రాలకు గాను రూ.4.50 కోట్లు మంజూరైనా పనులకు టెండర్లు జరగడం లేదు.

ఉపకేంద్రాల మంజూరు : 03

నిధుల కేటాయింపు : రూ.4.50 కోట్లు

గృహ, వ్యవసాయ కనెక్షన్లు : 20 వేలు

స్థల సేకరణ విస్తీర్ణం : 1.50 ఎకరాలు

**త్వరలోనే పనులు ప్రారంభిస్తాం: సాయిశంకర్, డీఈఈ,గుత్తి**

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఉపకేంద్రాల నిర్మాణాలు త్వరలోనే మొదలవుతాయి. నిర్మాణ విభాగం అధికారులు టెండర్లు నిర్వహించి పనులు చేయాల్సి ఉంది.

# మెప్మాలో మరో తిమింగలం

తిరుపతి : తిరుపతి నగరంలో మెప్మా ఆర్పీల అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొన్న 26వ డివిజన్ ఆర్పీ సుజాత, నిన్న లక్ష్మీపురం ప్రాంత ఆర్పీ ..ఇలా కొంతకాలంగా వరుసగా రూ.30 లక్షలు నుంచి రూ.కోటి వరకు మహిళల పొదుపు, రుణ చెల్లింపుల సొమ్ము కాజేస్తున్న ఘటనలు బహిర్గతమవుతున్నాయి. తాజాగా నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతంలో ఉన్న ఒక మెప్మా సమాఖ్యలోని మహిళా సంఘాలకు చెందిన రూ.60 లక్షల సొమ్ము ఆర్పీ నౌహీరా స్వాహా చేసినట్లు ప్రాథమికంగా తేలింది. సంఘ సభ్యుల పొదుపు నిల్వలు, రుణ చెల్లింపు సొమ్ము కలిపి రూ.కోటి వరకు మోసపోయామని బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట వెలుగులోకి వచ్చిన ఈ అక్రమంపై మెప్మా అధికారులు రహస్యంగా విచారణ చేస్తున్నారు.

నగరంలోని మెప్మా సంఘాల లావాదేవీలను థర్డ్ పార్టీ ఆడిటర్ల బృందం రెండున్నరేళ్ల నుంచి పరిశీలిస్తున్నాయి. తాము కూడా మోసపోయామంటూ పలు సంఘాల మహిళలు అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు.

**నేనే మోసపోయానంటూ సందేశం**

'నన్ను ఓ మహిళ మోసం చేసింది. మీడియాకు ఇచ్చినా, కేసులు పెట్టినా నేను ఏమి చేయలేను. మీ డబ్బు మీకు ఇచ్చేస్తా' అంటూ నాలుగు రోజులుగా కనిపించకుండాపోయిన ఆర్పీ నౌహీరా వాట్సప్




గ్రూపులో మెసేజ్ పంపింది.

**ఏం జరిగిందంటే..?**

సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతానికి చెందిన 40 సంఘాల బాధ్యతలను నౌహీరా అనే ఆర్పీకి అప్పగించారు. పలు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.20 లక్షల వరకు ఇప్పించింది. వారు వాయిదాల నగదు చెల్లించేందుకు ఉపక్రమించగా.. తాను బ్యాంకులో జమ చేస్తానని ఆ సొమ్ము తీసుకొని.. బ్యాంకు ముద్ర కూడా లేకుండా రసీదులు ఇచ్చేది. కొత్త రుణం కోసం వారు దరఖాస్తు చేయగా పాత బకాయిలు చెల్లించాలని బ్యాంకర్లు చెప్పడంతో విషయం బయటపడింది. ఆడిట్ ప్రక్రియ జరుగుతోందని, వారంలో పూర్తి వివరాలు తెలుస్తాయని మెప్మా సీఎంఎం కృష్ణవేణి తెలిపారు.

# ఆలయ భూముల్లో అక్రమాల సాగు

అంతర్వేది : ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా వర్ధిల్లుతున్న అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి క్షేత్రపాలకుడిగా పార్వతీ నీలకంఠేశ్వరస్వామి పూజలు అందుకుంటాడు. స్వామివారికి వందలాది ఎకరాల భూములు ఉన్నా కౌలు సక్రమంగా రాని పరిస్థితి నెలకొంది. కొంతమంది కౌలురైతులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులు తవ్వేశారు. మరికొంతమంది అక్రమ కట్టడాలు నిర్మించి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ తతంగం యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అంతర్వేదిలోని పార్వతీ నీలకంఠేశ్వరస్వామికి ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రూ.కోట్ల విలువ చేసే 174 ఎకరాలు పల్లం, 191 మెరక మొత్తం 365 ఎకరాలు ఉన్నాయి. వీటిలో అధికారికంగా 742 మంది కౌలురైతులు ఉన్నారు. అనధికారికంగా(క్రయవిక్రయాలు చేయడంతో) మరో వందమంది వరకు ఉంటారని అంచనా. ఎకరాకు రూ.200 నుంచి రూ.1500, మూడు నుంచి ఆరు బస్తాల ధాన్యం వరకు కౌలు వస్తోంది. ధాన్యం, ధన రూపంలో సుమారు రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం వస్తుంది. ఈ లీజులను కట్టడంలో కౌలు రైతులు అలసత్వం వహించడంతో సుమారు రూ.30 లక్షలపైనే బకాయిలు ఉండిపోయాయి.



**అక్రమంగా చెరువుల తవ్వకం**

స్వామివారికి చెందిన భూముల్లో అంతర్వేది, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, గొంది ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఆక్వా చెరువులను తవ్వేశారు. వీటిని ఇతరులకు ఇచ్చి సుమారు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు లీజు పొందుతున్నారు. అక్రమంగా 60 గృహాలు నిర్మించారు. వీటిపై ఏవిధమైన చర్యలు చేపట్టడం లేదు. దీనిపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

**చర్యలు చేపడతాం..**

అక్రమంగా తవ్విన చెరువులు, కట్టిన ఇళ్లపై చర్యలు చేపడతాం. దీనిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. తదుపరి చర్యలు తీసుకుంటాం. –వరప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీనరసింహస్వామి, పార్వతీ నీలకంఠేశ్వరస్వామి, అంతర్వేది

# కరుగుతూ.. కనుమరుగవుతూ

పి.గన్నవరం : ఏటా గోదావరి వరదల ప్రభావానికి నదీకోత కారణంగా జిల్లాలోని రైతులు భారీగా నష్టపోతున్నారు. విలువైన భూములు కోల్పోయి నిరుపేదలుగా మారిపోతున్నారు. జులై, ఆగస్టులో వచ్చిన వరదలకు నదీపాయల వెంబడి దాదాపు 20 ఎకరాల్లో కొబ్బరి తోటలు, లంకభూములు నీటిలో కలిసిపోయాయి. పి.గన్నవరం మండలంలోని బూరుగులంక, జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక.. వైనతేయ తీరంలోని జొన్నల్లంక, మొండెపులంక, మానేపల్లి, పి.గన్నవరం, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లి, కఠార్లంకలో నదీకోత ఎక్కువగా ఉంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నంలంక.. గౌతమి తీరంలోని అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక..కె.గంగవరం మండలం కూళ్ల, సుందరపల్లిలోనూ తీవ్రత ఉంది. ప్రభుత్వం రివిట్‌మెంట్లు, గ్రోయిన్లు వంటివి ఏర్పాటుచేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**కొబ్బరితోట పడిపోయింది**

మొండెపులంకకు చెందిన రైతు కొపనాతి ఠాగూర్‌కు గోదావరి చెంతన 50 సెంట్ల లంకభూమి ఉంది. కష్టపడి కొబ్బరి తోటగా తయారుచేశారు. గతంలో పది సెంట్ల భూమి నదిలో కరిగిపోయింది. ప్రస్తుతం మరో పదిసెంట్లు పోయిందని వాపోయారు. జొన్నల్లంకకు చెందిన కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1986 ఆగస్టు వరదల అనంతరం ఎకరం లంకభూమిని కొబ్బరితోటగా తయారు చేసినట్లు తెలిపారు. ఇంతవరకు 30 సెంట్లు గోదావరి పాలైందని తెలిపారు. బూరుగులంక వాసి డి.సత్యనారాయణదీ అదే వేదన. తనకున్న రెండెకరాలు గతంలోనే నదిలో కలిసిపోయిందని..భూమిలేని రైతుగా మిగిలానన్నారు.

**మట్టి వినాయకులనే పూజిద్దాం** వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలపై ఏర్పాటు చేసిన ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. జలచరాలు మృత్యు వాత పడతాయన్నారు. కాలుష్యనియత్రణ మండలి అధికారిణి ప్రణీత పాల్గొన్నారు.

# తీరం.. ఖనిజ హారం

అల్లవరం : జిల్లాలోని సాగర తీరంలో అరుదైన ఖనిజ సంపద నిక్షిప్తమైంది. ఇటీవల వర్షాలు, వరదలకు సముద్రం ఒడ్డు వెంబడి నల్లటి తెట్టు బయటపడింది. ఇందులో విలువైన లోహ సంపద ఉందని నిపుణులు చెబుతున్నారు. కొండలు, గుట్టల నుంచి నదుల ద్వారా అత్యంత విలువైన లోహాల సముదాయంతో కూడిన ఒండ్రు మట్టి సముద్రంలోకి చేరుతుంటుంది. అలల తీవ్రత వల్ల తేలికపాటి ఖనిజాలు, మట్టి వేరుపడి సముద్రపు లోతుల్లోకి వెళ్లిపోతాయి. భార ఖనిజాలు మాత్రం ఒడ్డుకు చేరి ఇసుక తిన్నెలపై పలచగా ఏర్పడి నల్లని పొరగా కనిపిస్తాయి.

**ఈ రకాలు ఎక్కువ**రాష్ట్రంలోని సువిశాల సముద్ర తీరం వెంబడి అత్యంత విలువైన ఖనిజ నిక్షేపాలు అధికంగా పేరుకుంటున్నట్లు బీఎస్ఓఐ(బీచ్ శాండ్ ఆఫ్‌షోర్ ఇన్వెస్టిగేషన్) నిర్వహించిన పరిశోధనల్లో తేలింది. ప్రధానంగా ఇలమైట్, రుటైల్, జిరా?న్, మోనాజైట్, సిలిమనైట్, గార్నెట్ వంటి ఖనిజాలు తీరం వెంబడి నిక్షిప్తం అవుతున్నట్లు తేల్చింది. కోనసీమ పరిధిలో అల్లవరం, ఎస్.యానాం, అంతర్వేది, మలికిపురం, కాట్రేనికోన సముద్ర తీరం వెంబడి అధికంగా కనిపిస్తున్నాయి.

**ఏపీలోనే అధికం**అత్యంత విలువైన ఈ ఖనిజ నిక్షేపాలు దేశంలోని మూడింట ఒక వంతు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు గనుల శాఖ అధికారులు తెలిపారు. 1996లో కేంద్ర ప్రభుత్వం బీచ్ శాండ్ మైనింగ్‌కు అవకాశం కల్పించింది. దీనిలో వచ్చే మోనోజైట్‌ను మాత్రం అటామిక్ ఎనర్జీ బోర్డుకు అందించాలన్న షరతు విధించింది. ఈ నిబంధనల్ని అతిక్రమించి విదేశాలకు విక్రయించడంతో మైనింగ్ లీజులు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి అనుమతులు ఇవ్వలేదు. ఇలమైట్: అల్యుమినియం కన్నా తేలిక ఇనుము కన్నా దృఢమైనది. దీనిని విమానాల తయారీకి వాడుతుంటారు. అధిక షైనింగ్ కలిగి ఉండటం వల్ల రంగులు, పిగ్మెంట్స్ తయారీకి, తుప్పు పట్టని కారణంగా ఓడలు, గోల్ఫ్ బాల్స్, హిప్ మార్పిడి పరికాల తయారీలో వినియోగిస్తారు.

జిరా?న్, మోనాజైట్: ఇవి ఎక్కువగా న్యూక్లియర్, అటామిక్ ఎనర్జీ రంగలో వాడుతుంటారు. జిరా?న్ ముడి ఖనిజాన్ని సిరామిక్, మోనాజైట్‌ను థోరియం తయారీలో వాడతారు. మోనాజైట్ ధాతువు విలువైన 15 ఖనిజాల సముదాయం ఉంటుంది. వీటిని లేజర్, ఎల్ఈడీ, ఎంఆర్ఐ స్కాన్ పరికరాల్లో వినియోగిస్తారు.

గార్నెట్: శాండ్ బ్లాస్టింగ్స్, వాటర్ ఫిల్టరేషన్‌కు వినియోగిస్తారు. ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

సిలిమనైట్: ఉక్కు పరిశ్రమలో ఏర్పాటు చేసే కొలుముల తయారీకి దీన్ని వినియోగిస్తారు. రీఫ్రాక్టరీ బ్రిక్స్ తయారులో వాడుతారు.

2017 నుంచి నిలుపుదల సముద్రపు తీరం వెంబడి కనిపించే నల్లని ఇసుకలో విలువైన ఖనిజాలు ఉంటాయి. దీనిని శుద్ధి చేస్తే 20శాతం వరకు అవి లభిస్తాయి. వీటిని ప్రాసెసింగ్ చేసేందుకు 2018 తర్వాత అనుమతులు ఇవ్వలేదు.– వంశీధర్‌రెడ్డి, భూగర్భ, గనులు, మైనింగ్ శాఖ అధికారి

# కుందూలో కృష్ణమ్మ

నంద్యాల : కుందూలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. సోమశిల వైపు పరుగులు పెడుతోంది.. గతంలోనే ఎన్నడూలేనివిధంగా కుందూ నదికి జులైలోనే మళ్లించారు. ఈసారి శ్రీశైలం జలాశయానికి వరద ముందస్తుగా వచ్చింది. జూన్‌లోనే నిండు కుండలా మారింది. ఎగువ నుంచి వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో 20 రోజుల క్రితమే అన్ని ప్రాజెక్టులకు నీటి విడుదల ప్రారంభమైంది. గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జులైలోనే కుందూలో కృష్ణమ్మ సందడి చేస్తోంది.

**నిత్యం 18 వేల క్యూసెక్కులు**

శ్రీశైల జలాశయానికి ప్రస్తుతం రెండు లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంటోంది.. దీంతో బనకచెర్ల నుంచి నిత్యం 31 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అక్కడి నుంచి వెలుగోడు రిజర్వాయర్ ద్వారా కుందూకు నిత్యం సగటున 18 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రస్తుతం కుందూ నదిలో 1.5 టీఎంసీల నీటితో నిండుగా ప్రవహిస్తోంది. అంతే వేగంతో సోమశిల రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద ఇదే స్థాయిలో ఉంటే 2 టీఎంసీలకు పెంచే అవకాశం ఉంది.

**తీరనున్న 24 గ్రామాల దాహార్తి**

కుందూ పరివాహకంలో కోవెలకుంట్ల, దొర్నిపాడు, లింగాల,



సంజామల, టంగుటూరు నీటి పథకాలు(సీపీడబ్ల్యూ స్కీం) ఉన్నాయి. వీటి ద్వారా 24 గ్రామాలకు మంచినీరు అందుతోంది. ఒక్క టంగుటూరు పథకం పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో 32 వేల జనాభా ఉంది. కోవెలకుంట్ల పథకానికి సంబంధించి ఆరు గ్రామాల పరిధిలో 26 వేల జనాభా ఉంది. లింగాల, సంజామల, టంగుటూరు గ్రామాల పరిధిలో మరో 20 వేల జనాభా ఉంది. సుమారు 80 వేల జనాభా దాహార్తిని ఈ ఐదు పథకాలు తీరుస్తున్నాయి. ఆయా పథకాలు ప్రారంభమైన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా జులైలోనే నీటిని విడుదల చేస్తున్నారు.

**20 వేల ఆయకట్టుకు వెన్నుదన్ను**

కుందూ పరివాహకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల క్రితమే నాట్లు పడ్డాయి. వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల, బనగానపల్లి, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల పరిధిలో 20 వేల అనధికార ఆయకట్టు కుందూ పరివాహకంలో ఉంది.

**ఆధునికీకరణ చేసి ఉంటే..** బనకచెర్ల నుంచి వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు సమీపంలోని పెన్నానది వరకు 187 కి.మీ. పొడవునా కుందూ నదిని విస్తరించడ ంతో పాటు.. కుందూ వరద నీటిని కేసీ ఆయకట్టుకు మళ్లించి 91 వేల ఎకరాలను స్థిరీకరించడమే లక్ష్యంగా రాజోలి, జొలదరాశి జలాశయాలను నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం చెప్పింది. వరద సమయంలో కుందూ ద్వారా రోజుకు సగటున 3 టీఎంసీల నీటిని సోమశిలకు తరలించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. రూ.1725 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 20 శాతం పనులు చేసిన తర్వాత వదిలేశారు. చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవ డంతో గుత్తేదారు సంస్థ పనులు వదిలేసి వెళ్లిపోయింది. దీంతో కుందూ ఆధునీకరణ పనులు ఆగిపోగా రాజోలి, జొలదరాశి రిజర్వాయర్లు అటకెక్కాయి.

# కడుపు రగిలిపోతోంది!

ఒంగోలు : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మంగళవారం ఉదయం ఒంగోలు నగర శివారు త్రోవగుంటకు చెందిన ఓ నిండు గర్భిణి వచ్చారు. పది గంటలకు వైద్యురాలికి చూపించుకున్న అనంతరం స్కానింగ్ చేయించుకునేందుకు సంబంధిత విభాగానికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమెకు స్కానింగ్ చేయించుకునే అవకాశం వచ్చింది. గంటలతరబడి వరుసలో నిలబడాల్సి రావడంతో ఆమె పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈమె ఒక్కరే కాదు.. నిండు గర్భిణులు స్కానింగ్‌కు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రికి జిల్లా మారుమూల ప్రాంతాల నుంచి ప్రతిరోజు సరాసరి 800 మంది వరకు రోగులు వస్తుంటారు. వీరితో పాటు మరో 100 మంది వరకు గర్భిణులు వైద్య సేవలు నిమిత్తం తరలివస్తుంటారు. చికిత్సలో భాగంగా పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వైద్యసిబ్బంది కొరత, విధుల్లో ఉన్నవారు వేరే వ్యాపకాల్లో ఉండడం తదితర కారణాలతో పరీక్షల్లో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఫలితంగా రోగులకు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా గర్భిణులు గంటల తరబడి నిలబడాల్సి రావడం కంటతడి పెట్టిస్తోంది. స్కానింగ్ విభాగం తెరవక ముందే కాచుకుని కూర్చోవాల్సి వస్తోంది. ఇక్కడ ప్రస్తుతం రెండు యంత్రాలు పనిచేస్తున్నా సిబ్బంది అందుబాటులో లేకపోవడం ఆలస్యంగా జరుగుతున్నాయి. ఎనిమిది నెలల గర్భిణి స్కానింగ్ తీసే గది వద్ద సుమారు గంటపాటు వేచి ఉన్నారు. ఇక నిలబడలేక అక్కడ ఉన్న పీటపై కూర్చుండిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పరిశీలిస్తే పాతిక మంది వరకు ఇంకా వేచి ఉన్నారు. వీరంతా ఉదయమే వచ్చి వరుసలో వేచి ఉండడం గమనార్హం. **సామాన్యులు నిలబడాల్సిందే..**

ఆసుపత్రిలో మిగతా విభాగాల్లో రోగులకు ఎవరైనా స్కానింగ్ అవసరమైతే వాళ్లకి ఇక్కడే చేస్తున్నారు. అదే సమయంలో గర్భిణులు వరుసలో ఉంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు చేసిన పరవాలేదు. అందరికి కలగలిపి చేయడంతో గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు సిఫార్సులు బలంగా పని చేస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది కొంతమందిని నేరుగా తీసుకొచ్చి స్కానింగ్ చేయిస్తున్నారు. వరుసలో ఉన్నవారు చూస్తూ నిట్టూరుస్తున్నారు. రోజుకు ఆసుపత్రిలో వంద వరకు స్కానింగ్‌లు జరుగుతాయి. తమకు ప్రత్యేక సమయం కేటాయించి తొందరగా చేసేవిధంగా చూడాలని గర్భిణులు కోరుతున్నారు. **మరో యంత్రం ఏర్పాటు చేస్తాం**

స్కానింగ్‌కు ఎక్కువ సమయం పట్టడంపై దృష్టిసారించాం. మరో యంత్రం ఏర్పాటు చేసి వెనువెంటనే జరిగేవిధంగా చూస్తాం. గర్భిణులకు ప్రత్యేకంగా గదిని సిద్ధం చేసి వారం రోజుల్లో అందుబాటు లోకి తీసుకొస్తాం. తిరుపతిరెడ్డి, ఆసుపత్రి పర్యవేక్షకులు

# బడిబాటలో వెనుకబాటు



అనకాపల్లి : జిల్లాలో బడిబయట ఉన్న విద్యార్థుల సంఖ్య పెరగనుంది. పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్ని అవకాశాలు కల్పిస్తున్నా.. బడిలో చేరని విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు బడిలో చేరని 4,075 మంది విద్యార్థులను గుర్తించారు. వీరిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు 2,19,715 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో అర్హులైన వారికి తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 13 వేల చొప్పున ప్రభుత్వం నగదు సాయం అందిస్తోంది. అయినా జిల్లాలో కొంతమంది పిల్లలు బడిలో చేరడం లేదు. వీరిని పాఠశాలలకు తీసుకొచ్చేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు.

**వలసలు పోవడంతో ఇబ్బందులు...** జిల్లాలో ఇటుకల బట్టీలు, క్వారీల్లో పనిచేయడానికి వస్తున్న కూలీలు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం లేదని అధికారుల తనిఖీల్లో తెలుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేసి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి ప్రాంతాల్లో చిన్నారులతో భిక్షం ఎత్తిస్తున్న సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలా కొందరు తల్లులు తమతోపాటు పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇదివరకు పోలీస్ అధికారులు దృష్టి పెట్టి వీరిని సంరక్షణ గృహాలకు తరలించేవారు. ఇటీవల కాలంలో దీనిపై నిఘా కొరవడింది. నెలరోజుల ప్రచారం.. ఒకరి గుర్తింపు: బాలకార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా జూన్1 నుంచి నెలరోజుల పాటు జిల్లాలో ప్రచారం చేశారు. కార్మిక, విద్యా, సమగ్ర శిక్షా అధికారులు పరిశీలించి ఒక బాలకార్మికుడిని గుర్తించి బడిలో చేర్చారు. బాలకార్మిక వ్యవస్థను అరికట్టాల్సిన కార్మిక శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**బడిలో చేర్పించేలా చర్యలు...** బడిమానేసిన పిల్లలను చేర్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, క్లస్టర్ల రిసోర్సు పర్సన్లతో ప్రత్యేక పరిశీలన చేస్తున్నాం. వలస వచ్చే విద్యార్థులను విద్యా సంవత్సరంలో ఎప్పుడైనా పాఠశాలలో చేర్చుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇదివరకు బడిలో చేరని విద్యార్థులు తొమ్మిది వేలమందికి పైగా ఉండేవారు. వీరిలో అయిదువేల మందిని పాఠశాలల్లో చేర్పించాం. మిగిలిన వారిని కూడా పాఠశాలల్లో చేర్చడానికి చర్యలు తీసుకుంటాం.

– గిడ్డి అప్పారావు నాయుడు, డీఈఓ

# పరిశ్రమలు పెట్టరు.. స్థలాలు వదలరు!




రాయదుర్గం : పట్టణ సరిహద్దున 74 ఉడేగోళం గ్రామం వద్ద రూ.4 కోట్లు కేటాయించి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు స్థలాలు కేటాయించినా.. నేటికీ పరిశ్రమలను ఏర్పాటు చేయకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పార్కులో వేలాది మందికి ఉపాధి కల్పించి రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. 2007–08లో పార్కుకు కేటాయించిన 15 ఎకరాల్లో 55 మంది వ్యాపారులు స్థలాలు కొనుగోలు చేశారు. 18 ఏళ్లు గడిచినా వ్యాపారులు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా.. ఆ స్థలాల్లో ఇతరులకు వదలకపోవడం గమనార్హం. ఇప్పటివరకు కేవలం 8 మంది మాత్రమే యూనిట్లు ఏర్పాటు చేశారు. 47 యూనిట్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా టెక్స్‌టైల్ పార్కుకు మహర్దశ పట్టేనా అని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**స్పందన కరవు..** టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే యూనిట్లు రద్దు చేస్తామని చేనేత, జౌళిశాఖ అధికారులు పలుమార్లు విజ్ఞప్తులు, హెచ్చరికలు, తాఖీదులు ఇచ్చినా.. ప్రయోజనం కరవైంది. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు, ఇద్దరు పారిశ్రామికవేత్తలతో కమిటీని ఏర్పాటు చేశారు. యూనిట్ల రద్దుకు అనుమతి కోరతూ రెండు నెలల కిందట ప్రతిపాదనలు చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు పంపారు. కమిషనర్ రేఖారాణి వర్చువల్‌గా వ్యాపారులతో సమావేశమయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు మూడు నెలల గడువు కావాలని వ్యాపారులు కోరినప్పటికీ.. నేటికీ ఒక్క యూనిట్ ఏర్పాటుకు మాత్రమే పునాదులు తవ్వడం గమనార్హం.

**తగు చర్యలు తీసుకుంటాం**

టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులతో సామూహిక భూమి పూజకు చర్యలు తీసుకుంటాం. పార్కులో యూనిట్లు ఏర్పాటైతే రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. సుమారు 20 వేల మందికిపైగా అదనపు ఉపాధి లభిస్తుంది. తద్వారా పట్టణాభివృద్ధికి బాటలు పడతాయి. వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి

# అంగన్‌వాడీలకు పురుగు పట్టిన కందిపప్పు



అనంతపురం : జిల్లాకు ప్రతినెలా 628 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. రేషన్ కార్డుదారులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేయాల్సి ఉంది. కొంతకాలంగా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయకున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. ప్రతి నెలా 28 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు రవాణా చేసి... డీలర్లు ద్వారా అంగన్‌వాడీలకు ప్యాకెట్లు (కిలో చొప్పున) ఇస్తున్నారు. ఏప్రిల్ నెలకు 28 మెట్రిక్ టన్నులు కేటాయింపు జరిగింది. ప్యాకెట్లు విప్పి చూడగా చాలావరకు పురుగు పట్టిన పప్పు పిండైపోయింది. డీలర్లు ఫిర్యాదు చేయగా నాసిరకం బయటపడింది. శింగనమల ఎంఎల్ఎస్ పాయింట్లో 8.5 మెట్రిక్ టన్నులు, తాడిపత్రిలో 6 మెట్రిక్ టన్నులు, రాప్తాడు ఎంఎల్ఎస్ పాయింట్లో 5.4 మెట్రిక్ టన్నుల నాసిరకం కందిపప్పు గుర్తించారు. దీంతో సుమారు 20 మెట్రిక్ టన్నులను గత నెలలో గుత్తేదారుకు వెనక్కి పంపారు. ఈనెలలో అదే సరకును మళ్లీ గుత్తేదారు రీప్యాకింగ్ చేసి అంగన్‌వాడీలకు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**నాణ్యత పరిశీలించమని చెప్పాం** కొన్నిచోట్ల కందిపప్పు బాగా లేదని, పిండైందని మా దృష్టికి వచ్చింది. జిల్లాలోని 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో కందిపప్పు నాణ్యతను పరిశీలించాం. నాసిరకంగా ఉండటంతో అంగన్‌వాడీలకు సరఫరా నిలిపేశాం. గుత్తేదారుకు సరకును వెనక్కి పంపుతాం రమేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

# యువత.. మేలిమి భవిత..!

పెదవాల్తేరు: యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి కృషి చేస్తోంది నెహ్రూ యువ కేంద్రం. బీచ్‌రోడ్డులో ఈ కేంద్రాన్ని 1972లో ప్రారంభించారు. యువజనోత్సవంలో భాగంగా ఏటా యువతలోని ప్రతిభను వెలికితీయడం, గ్రామీణస్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం, సాంస్కృతిక సమ్మేళనాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

యువజనోత్సవాలు ప్రతి సంవత్సరం ఆగస్టు 3వ వారం నుంచి నిర్వహిస్తున్నారు. యువత తమలోని ప్రతిభను చాటుకోవడానికి ఇది చక్కటి వేదికగా మారుతోంది. జిల్లా స్థాయిలో ఎంపికైనవారు రాష్ట్ర, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు జాతీయ స్థాయికి అర్హత సాధిస్తారు. వివిధ రాష్ట్రాల యువతను కలవడం ద్వారా ఆలోచన పరిధి విస్తృతమవుతుంది. నాయకత్వ, నిర్వహణ సామర్థ్యాలు మెరుగవుతాయి. దేశభాషలపై అవగాహన పెరుగుతుంది.

యూత్ పార్లమెంట్ పోటీలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహిస్తారు. ఈ ఏడాది వికసిత భారత్–2047 అంశానికి సంబంధించి వక్తృత్వ పోటీలు జరిగాయి. జిల్లా స్థాయిలో 300 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపించి ప్రోత్సహిస్తారు. యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం వినూత్నమైంది. ఇక్కడి యువతను ఇతర రాష్ట్రాలకు పంపిస్తారు. అక్కడి ప్రజల జీవన శైలి, ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేయవచ్చు.

ఫిట్ ఇండియా ఫిట్‌నెస్ క్లబ్‌ల స్థాపనను ప్రోత్సహించడానికి వాకింగ్, సైక్లింగ్, ఉమెన్స్ ఫిట్ ఇండియా క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ యువతకు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. తద్వారా ప్రాంతీయ, సంప్రదాయ క్రీడలను సంరక్షించడంతో పాటు వాటికి ప్రాచుర్యం కల్పిస్తున్నామని నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత 80746 05109 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

# భావితరం.. గొంతులో గరళం

ఆలూరు: ఆలూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల–1లో 596 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇక్కడున్న ట్యాంకులు పాచిపట్టి ఉన్నాయి. మొత్తం ఐదు ట్యాంకులు ఉండగా ఇటీవల ఒకటి శుభ్రం చేసి నాలుగు వదిలేశారు. వాటిపై మూతలు కూడా లేవు.

**రూ.కోట్లు ఖర్చు చేసి తూట్లు**

ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో గంటకు 1000 లీటర్లు శుద్ధి చేసే విధంగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. నాడు–నేడు పనుల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ప్లాంట్లకు రూ.2.50 లక్షలు ఖర్చు చేశారు. ఇలా హైస్కూళ్లలోని ప్లాంట్లకే రూ.2 కోట్ల వరకు వ్యయం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్లాంట్లకు రూ.80 వేల వరకు వ్యయమైంది. నిర్వహణ లోపాలతో ఉమ్మడి జిల్లాలోని 10 శాతం పాఠశాలల్లో ప్లాంట్లు పనిచేయడం లేదు.

సర్కారు బడుల్లో 'మంచి'నీరు కరవైంది. శుచి, శుభ్రత లేకపోవడంతో భావితరం గొంతులో గరళం చేరుతోంది. ఉమ్మడి జిల్లాలో 638 పాఠశాలల్లో సింథటిక్, 20 సిమెంట్ ట్యాంకులు ఉన్నాయి. వీటిని ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలల నిర్వహణకు వచ్చే నిధులతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి శుభ్రం చేసుకునే అవకాశం ఉన్నా చాలా చోట్ల చేయడం లేదు. పలు పాఠశాలల్లో నాడు–నేడు కింద గత ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలను బిగించింది. నాణ్యత లేకపోవడంతో చాలా చోట్ల పక్కన పడేశారు.



మరికొన్ని చోట్ల సిమెంట్, సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఇంకొన్ని బడుల్లో బోరు, చేతి పంపులనే ఆశ్రయిస్తున్నారు. బడుల్లో 'మంచి'నీరు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే సీసాలో తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు.

సిమెంట్ మినీ, సింథటిక్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి కచ్చితంగా శుభ్రం చేయాలి. అదేవిధంగా వారానికోసారి క్లోరినేషన్ లేదా బ్లీచింగ్ పౌడర్ కలపాలి. అవశేష క్లోరిన్(రెసిడ్యుయల్) సాధారణంగా 1 ఎంజీ/ఎల్ ఉండాలి. అప్పుడే మంచినీరుగా మారి తాగడానికి వీలుంటుంది.

**ట్యాంకులు శుభ్రంగా లేకుంటే..**

ట్యాంకులు శుభ్రంగా లేకుంటే ఈక్వలై, క్లెప్సెల్లా, పీడాల్ కోలిఫాం తదితర సూక్ష్మజీవులు వృద్ధి చెంది డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

**నీటిలో లవణాలు..వచ్చే వ్యాధులు**

జల కాఠిన్యత: నీటిలో కాల్షియం, మెగ్నీషియం, సల్ఫేట్, ఫ్లోరైడ్ కలిపి ఉంటాయి. ఇవి ఒక లీటరు నీటిలో 200 నుంచి 800 మి.గ్రా. ఉండాలి. ఎక్కువైతే ఎముకలు పెలుసుబారి పోతాయి. కీళ్లు, మోకాళ్ల నొప్పులు వస్తాయి. తక్కువైతే పళ్లు పుచ్చిపోతాయి. ఎముకల పెరుగుదల ఉండదు.

క్షార స్వభావం: 200 నుంచి 800 ఎంజీ/ఎల్ వరకు ఉండాలి. దాటితే గ్యాస్ట్రిక్ ట్రబుల్, తక్కువైతే జీర్ణ సంబంధమైన ప్రక్రియలో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

ఫ్లోరైడ్: సాధారణంగా 0.5 నుంచి 1.5 ఎంజీ/ఎల్ వరకు ఉండాలి. 0.5 కంటే తక్కువైతే పళ్లు పుచ్చుపట్టి బొర్రలు పడి విరిగిపోయే ప్రమాదం ఉంది. 1.5 కంటే ఎక్కువైతే పళ్లు గారపట్టడం, 3 ఎంజీ/ఎల్ కంటే ఎక్కువైతే మరింత ప్రమాదకరం.

ఐఎస్ఐ మార్కు ఉన్న సింథటిక్ ట్యాంకులనే వాడాలి. చాలా పాఠశాలల్లో నాణ్యతలేనివి(తక్కువ ధరకు లభించే) పెట్టారు. ఎండవేడిమికి ప్లాస్టిక్ కరిగి కర్బన సమ్మేళన పదార్థాలు నీటిలోకి విడుదలవుతాయి. తద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

# దయచేసి వినండి.. సిద్ధంగా ఉండండి!

దర్శి : నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనుల్లో భాగంగా దర్శి రైల్వే స్టేషన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన ట్రాక్ పనులు పూర్తికాగా లూప్‌లైన్ మూడు ట్రాక్ పనులు చివరి దశలో ఉన్నాయి. అధికారుల అతిథి గృహం, టికెట్ కౌంటర్, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోవటానికి బల్లలు, తాగునీటి ట్యాంకు పనులు పూర్తయ్యాయి. కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. స్టేషన్ లోపల, వెలుపల విద్యుత్తు దీపాల ఏర్పాటుతో పాటు పచ్చదనం ఉట్టిపడేలా అలంకరణ మొక్కలు నాటారు. దాదాపు 95 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రయాణికుల రైలు ట్రయల్ రన్ నిర్వహించగా ఈ ఏడాదిలోనే రైలులో ప్రయాణించాలనే దర్శి ప్రాంత




ప్రజల కోరిక నెరవేరే అవకాశం కనిపిస్తోంది.

పూర్తయిన రైల్వే స్టేషన్ల నిర్మాణాలు.. : నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు 309 కిలోమీటర్ల పరిధిలో చేపడుతున్న రైల్వే పనులు అయిదు దశల్లో చేయటానికి ప్రణాళికలు తయారు చేశారు. మూడు, నాలుగో దశలో చేపడుతున్న పనులు జిల్లాలో ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. పొదిలి సమీపంలో 200 మీటర్ల పరిధిలో మినహా ట్రాక్ నిర్మాణం గార్లపేట వరకు (145 కి.మీ) వరకు దాదాపు పూర్తయినట్లు అధికారులు వివరించారు. ట్రాక్‌తో పాటు పొదిలి, కనిగిరి, గౌతువారిపల్లి, గార్లపేట స్టేషన్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. పేరంగుడిపల్లి వద్ద జాతీయ రహదారి పనులు పూర్తయిన అనంతరం రైల్వే వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు చెప్పారు. కనిగిరి–పామూరు మధ్యలో పనుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తవగా పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

# తుంగలో మా'రీచ్'లు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో మా'రీచు'లు తుంగభద్రను దోచేశారు. ఆ పార్టీ పెద్దలు నేరుగా రంగప్రవేశం చేసి.. జిల్లాల వారీగా సిండికేట్లు పెట్టుకొని నదులను ఊడ్చేశారు. ప్రతినెలా రూ.కోట్లు దోచేశారు. ఇసుక దోపిడీపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎంతమేర తవ్వకాలు జరిగాయో తేల్చాలని ఆదేశించింది. అక్రమాల లెక్క తేల్చేందుకు గనులశాఖ అధికారులు ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) సాయం తీసుకున్నారు. గత మూడేళ్లలో లక్షల టన్నుల ఇసుకను అనుమతుల్లేకుండా రీచ్‌ల నుంచి తవ్వేసి తరలించినట్లు గుర్తించారు.

**అధికారులూ వంత పాడారు**

అప్పటి గనులశాఖ డైరక్టర్ వెంకటరెడ్డి కలెక్టర్లతో రీచ్‌లో మొక్కుబడి తనిఖీలు చేయించారు. అక్రమ తవ్వకాలపై దండా నాగేంద్రకుమార్ అనే వ్యక్తి వరుస ఫిర్యాదులతో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ), సుప్రీం కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి.

అక్రమ తవ్వకాలే లేవంటూ అప్పటి జిల్లా కలెక్టర్ సృజన, జేసీ మౌర్య ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. మిగతా జిల్లాల్లోనూ ఇదే తరహా నివేదికలు తయారు చేయించి ఎన్జీటీ, సుప్రీం కోర్టులకు సమర్పించారు. నాటి ఇసుక దోపిడీపై తాజాగా విచారణ చేపట్టడంతో వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.

**ఇక్కడా కొల్లగొట్టారు**

సి.బెళగల్ మండలంలోని ఈర్లదిన్నె, ముడుమాల, పల్దొడ్డి, జి.సింగవరం, కొత్తకోట ప్రాంతాల్లోని డీసిల్టింగ్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక అక్రమాలు జరిగాయి. జలాశయం లోపల, డీసిల్టింగ్ పాయింట్లలో ఎంత మేర తవ్వారన్నది తేల్చేందుకు ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) సాయం తీసుకున్నా అక్రమాలు వెల్లడికాలేదు. వాస్తవంగా అప్పట్లో సీసీ కెమెరాలు సరిగా కనిపించకపోడంతో డీసిల్టింగ్ పాయింట్లలో దోపిడీని గుర్తించలేకపోయారు. వీటి నుంచి రోజుకు 5- 6 వేల టన్నుల మేర ఇసుకను నది నుంచి తోడేశారు. మూడేళ్లలో సుమారు 35 లక్షల టన్నుల మేర అక్రమంగా తరలించారు.



నాటి ప్రభుత్వ లెక్కల ప్రకారం టన్నుకు రూ.475 లెక్కగట్టినా రూ.166.25 కోట్లు దోచుకున్నట్లే.

**2.78 లక్షల టన్నులు తోడేశారు**

నందవరం, కౌతాళం మండలాల్లోని మూడు ఇసుక రీచ్‌ల నుంచి 2021 నుంచి 2024 మే వరకు భారీ ఎత్తున అక్రమ తవ్వకాలు జరిగాయని ఏపీశాక్ గుర్తించింది. ఆయా సంవత్సరాల్లో నెలల వారీగా శాటిలైట్ ఇమేజెస్ తీసి, జీడీ స్టీరియో డేటా, 2డీ గూగుల్ ఎర్త్‌ప్రో ఇమేజ్‌లన్నీ పరిశీలించింది. ఆ ప్రాంతాల్లో గతంలో ఎలా ఉంది? తవ్వకాలు జరిపిన మూడేళ్ల తర్వాత చోటుచేసుకున్న మార్పులను పోల్చి చూసింది. దీంతో పెద్దఎత్తున ఇసుక తవ్వినట్లు బయటపడింది. ఆ వివరాలను గనుల శాఖకు అందించింది.

నందవరం, కౌతాళం మండలాల్లోని మూడు ప్రాంతాల్లో 2,78,243 టన్నుల మేర ఇసుక దోపిడీ సాగిందని తేల్చారు. గత ప్రభుత్వంలో టన్ను రూ.475 చొప్పున రూ.13.21 కోట్ల విలువైన ఇసుకను ఊడ్చేశారని అధికారులు చెబుతున్నారు. అనుతుల్లేకుండా తవ్వకాలు జరిపినందుకు మైనింగ్ అధికారులు టన్ను ఇసుకకు రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ లెక్కన రూ.55.63 అక్రమాలు జరిగినట్లు లెక్క తేల్చి ఆ మొత్తం చెల్లించాలని గుత్తేదారు సంస్థలకు నోటీసులు ఇచ్చారు.

# ఇక్కడ 'పని' చేసేందుకు 'కాసు'క్కూర్చుంటారు!

మార్కాపురం : ఇటీవల జలవనరులశాఖ మార్కాపురం డివిజనల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (అనిశా) దాడి జరిగింది. లంచం తీసుకుంటూ సీనియర్ సహాయకుడు అధికారులకు పట్టుబడ్డారు. గత నెలలో గిద్దలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు.

గతేడాది యర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో ఓ గ్రామ సహాయ రెవెన్యూ సహాయకుడు అనిశా అధికారులకు ఏసీబీ అధికారుల వలలో పడ్డారు.

పశ్చిమ ప్రకాశంలో అవినీతి జలగలు నలుదిశలా పాకుతున్నాయి. అడిగేవారు లేకపోవడం, ఏళ్లుగా మామూళ్ల మత్తుకు అలవాటు పడడం తదితర కారణాలతో ఏదైనా జరిగితేగానీ అవినీతి వెలుగు చూడడంలేదు. జలవనరులశాఖ మార్కాపురం డివిజన్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిపోయిందని బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల్లో పూడికతీత, చెరువు కట్ట, లైనింగ్, కుంటలు, కాలువల పనులకు టెండర్‌ను బట్టి డబ్బులు డిమాండు చేస్తున్నారు. మార్కాపురం డివిజన్‌లోని అన్ని శాఖల్లో లంచం ఇవ్వందే పని కావడం లేదని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

మార్కాపురంలో డివిజన్ పరిధిలోని 15 మండలాల్లోని ప్రభుత్వ శాఖల్లో ఎక్కువగా అవినీతి జరుగుతోందని, ప్రధానంగా పశ్చిమంలోనే ఎక్కువగా ప్రజల నుంచి అనిశాకు ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యుత్తుశాఖలో రైతులకు పరివర్తకాలు నూతనంగా ఏర్పాటు చేయాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు లంచం ఇవ్వందే పని కాని పరిస్థితులు నెలకొన్నాయి.

రెవెన్యూశాఖలో వీఆర్వోలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలంటే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రజలకు అవసరమైన జనన, మరణ ధ్రువపత్రాలు, కుటుంబ సభ్యుల పత్రంతో పాటు ఇతర పత్రాలకు వీఆర్వోలు, గుమస్తాలు దరఖాస్తుదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో ప్రతి పనికి ధర నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. పంచాయతీరాజ్, రహదారులు, భవనాలశాఖల్లో పనులు చేసిన గుత్తేదారుల నుంచి ముందుగానే 10 నుంచి 16 శాతం కమీషన్ తీసుకున్న తర్వాతనే బిల్లులు చేస్తారనే ఆరోపణలున్నాయి. కీలకమైన పోలీసుశాఖలోనూ కేసును బట్టి రూ.1000 అంతకు పైగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏపీవోల దగ్గర నుంచి సాంకేతిక సహాయకుల వరకు రూ.లక్ష పనికి బిల్లు చేయాలంటే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారు.

# నిర్లక్ష్యంతో నిధులు పోయె!



అనంతపురం : రాష్ట్ర ఖజానా పరిస్థితి దయనీయంగా ఉన్నా పేద పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే అంగన్‌వాడీ కేంద్రాలు బాగుండాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం నిధులు ఇచ్చినా సకాలంలో వినియోగించని అధికారుల నిర్వాకమిది. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోవడం గమనార్హం. అనంత జిల్లాలో పక్కా భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు దశల వారీగా తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలను కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గతేడాది సెప్టెంబరులో జిల్లాలోని 1200 పైగా కేంద్రాల్లో వసతులు కల్పించడానికి రూ.3.25 కోట్లు మంజూరు అయ్యాయి. నిర్మాణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. గత మార్చి ఆఖరు నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. తర్వాత రెండు మాసాలు గడువు పొడిగించారు. అయినా సౌకర్యాల కల్పనలో సదరు శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించింది.

**దేనికి ఎంతెంత?**

జిల్లాలో మొత్తం 2302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పక్కా భవనాలు కలిగిన 609 కేంద్రాలకు మరుగుదొడ్లు, 623 కేంద్రాలకు తాగునీటి వసతి కల్పనకు నిధులు వచ్చాయి. మరుగుదొడ్డికి రూ.36వేలు, తాగునీటికి రూ.17వేల చొప్పున మంజూరు అయ్యాయి. మొత్తం 852 కేంద్రాల్లో అరకొరగా పనులు చేశారు. ఉరవకొండ, గుత్తి, కంబదూరు ప్రాజెక్టుల పరిధిలో నిర్దేశిత పనులు సగానికి సగం పూర్తి కాలేదు. కళ్యాణదుర్గం, నార్పల ప్రాజెక్టుల్లోనూ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈక్రమంలో సుమారు రూ.కోటికిపైగా నిధులు వెనక్కి వెళ్లాయి.

**మళ్లీ ప్రతిపాదనలు పంపాం**

సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిన మాట నిజమే. తాజా అంచనాల ప్రకారం ఎన్ని నిధులు అవసరమోనన్న ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. రాగానే పనులు చేయిస్తాం.

వనజాక్షి, నోడల్ అధికారిణి, ఐసీడీఎస్

# జాతీయరహదారి.. రక్షణ చర్యలు కొరవడి



పామిడి : 44వ జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారిపై కొన్నేళ్ల కిందట నాలుగు వరసల రహదారి నిర్మాణం చేపట్టారు. పలు ప్రాంతాల్లోని కూడళ్లలో రెండు వరుసలను వేరు చేస్తూ మధ్యలో ఇనుప కంచెతో కూడిన విభాగిని ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. పామిడి పెన్నా బ్రిడ్జి సమీపంలోని అంబేడ్కర్ కాలనీ కూడలి వద్ద దాదాపు వంద మీటర్ల మేర ఇనుప కంచె ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా జరుగుతున్న వివిధ ప్రమాదాల వల్ల ఇనుప కంచె దెబ్బతినింది. మరికొన్ని చోట్ల ఇనుప కంచె లేకుండా పోయింది.

**అంతులేని నిర్లక్ష్యం**

గతంలో 50 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పిన ఘటనలో పెనుప్రమాదం జరగకుండా రోడ్డు విభాగిని మధ్యలో ఉన్న ఇనుప కంచె అడ్డుకుందని స్థానికులు చెబుతున్నారు. ఆ మధ్య భారీ లోడ్లతో వెళ్లే వాహనాలు ఢీకొనడంతో కంచె దెబ్బతినింది. కాకపోతే పలు ప్రమాదాల్లో దెబ్బ తిన్న ఇనుప కంచెపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దెబ్బతిన్న కంచెను తొలగించిన ప్రాంతంలో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది వరకు జరిగిన ప్రమాదాల సమయంలో కిందపడిపోయిన విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. వీటి వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**పని చేయని నిఘా నేత్రాలు**

జాతీయ రహదారి కూడళ్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. పామిడి మండలంలోని అంబేడ్కర్ కాలనీ సమీపంలో కూడలి, నీలూరు వంతెన, గజరాంపల్లి, రామరాజుపల్లి, గుత్తి మండలంలోని ఊబిచెర్ల, కరిడికొండ, వన్నెదొడ్డి, కొత్తపేట ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినప్పటికీ రక్షణ చర్యలు లేవు. కనీసం రాత్రివేళల్లో విద్యుద్దీపాలు వెలగడం లేదు. జాతీయ రహదారిపై ఉన్న వేగనిరోధకాల వద్ద ఎటువంటి సూచికలు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. కొన్ని సౌర విద్యుత్తు దీపాలు, నిఘానేత్రాలు ఏర్పాటు చేసినా అవి పని చేయడం లేదు.

**వంతెన నిర్మాణం చేపడితేనే ప్రజలకు ప్రయోజనం**

జాతీయరహదారి పక్కన ఉన్న వెంగమనాయుడు, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణ రెడ్డి, టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లోకి వెళ్లాలంటే కాలనీవాసులు జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. రోజూ రాకపోకలు సాగించడానికి ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిపై మిడుతూరు వద్ద రాకపోకలకు అనుగుణంగా నిర్మించిన విధంగా రానున్న ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో మిడుతూరు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం. షఫీ, పామిడి

# 'ఉక్కు' సంకల్పం.. చుట్టూ స్వచ్ఛ పవనం



అగనంపూడి: అగనంపూడిలో 'మియావాకీ' వనంతో ఆ ప్రాంతంలో పచ్చదనం కళకళలాడుతోంది. ఏడాది కిందట ఉక్కు యాజమాన్యం చేపట్టిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు సత్ఫలితాలనిస్తోంది. 'మియావాకీ' విధానంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కల్ని పెంచుతూ పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

**ఉక్కు ఖాళీ భూముల్లో..**

జాతీయ రహదారి పక్కనే ఉక్కు కర్మాగారానికున్న వందల ఎకరాలు.. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండి బీడుగా మారాయి. ఇక్కడ మొక్కలు నాటడానికి స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం ముందుకొచ్చింది. 'మియావాకీ' విధానం అమలు చేసేందుకు తొలివిడతగా 3 ఎకరాలను ఎంపిక చేశారు. ముందుగా ఆ స్థలాన్ని శుభ్రం చేసి, చదును చేశారు. ప్రాజెక్టులో పేర్కొన్న విధంగా ఎరువులు వేసి నేలను సారవంతం చేశారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో సుమారు 14,500 మొక్కల్ని నాటారు. దేశవ్యాప్తంగా లభించే వేప, జామ, టేకు, సపోటా, మామిడి, నేరేడు వంటి వాటితో పాటు మొత్తం 54 రకాల మొక్కల్ని పెంచుతున్నారు. ఎంపిక చేసిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఏడాది వ్యవధిలోనే మొక్కలన్నీ ఏపుగా పెరిగాయి.

జీవవైవిధ్యానికి దోహదం: మియావాకీ విధానంలో అభివృద్ధి చేసిన వనాలు నూరు శాతం సేంద్రియ పద్ధతుల్లో పెంచడం ద్వారా సహజ జీవ వైవిధ్యానికి దోహదం చేస్తాయి. సాధారణ పద్ధతితో పోల్చితే ఈ విధానంలో మొక్కల ఎదుగుదల అధికంగా ఉంటుంది. గాలిలో ధ్వని, ధూళి కాలుష్యాన్ని 30 రెట్లు వరకు తగ్గిస్తాయి. ఈ విధానంలో పెరిగిన చెట్లు అధిక మొత్తంలో ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటాయి. ఈ వనంలో తొలి మూడేళ్ల వరకు మొక్కల నిర్వహణ చూడాలి. అనంతరం వాటంతటవే పెరుగుతాయి.

మరో ప్రణాళిక సిద్ధం: అగనంపూడిలో తొలి ప్రాజెక్టు మంచి ఫలితాలు ఇవ్వడంతో, ఆ చెంతనే మరో వనం అభివృద్ధి చేసేందుకు ఉక్కు యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇంకో మూడు ఎకరాలను ఎంపిక చేసి నేలను చదును చేశారు. వీటితో ఇక్కడ కాలుష్యం స్థాయి పూర్తిగా తగ్గి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఉక్కు అగ్రోఫారెస్ట్ విభాగం అధికారులు చెబుతున్నారు.

# మీరే 'చేప'ట్టండి.. ఆదాయం రాబట్టండి!

ఏలూరు: డ్వాక్రా మహిళలు తమకున్న కొద్దిపాటి స్థలంలో కొరమీను చేపలను పెంచుకుని నికర ఆదాయాన్ని పొందేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏలూరులోని జిల్లా సమాఖ్య ప్రాంగణంలో ఓ ప్రాజెక్టుకు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టింది. అది విజయవంతం కావటంతో 50 యూనిట్ల స్థాపనకు డీఆర్‌డీఏ జీవనోపాధుల విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటి స్థాపనకు కేంద్ర ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తోంది. యూనిట్ ధర రూ.4.41 లక్షలు కాగా 35 శాతం రాయితీ. డ్వాక్రా మహిళలు గతంలో తీసుకున్న రుణాల చెల్లింపులు.. వారి ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

**ఏడాదిలో మూడు పంటలు..** తొలుత పిల్లలు వేసిన 8 నెలలకు ఒక పంట వస్తుంది. తర్వాత నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున వస్తుందని డీఆర్‌డీఏ జీవనోపాధుల విభాగం పేర్కొంది. జిల్లా సమాఖ్య ప్రాంగణంలో మార్చిలో 50 గ్రాముల చేపల పిల్లలను



వదిలారు. అవి ఇప్పుడు కేజీ బరువు పెరిగాయి. ఈ ప్రయోగాత్మక సాగును పరిశీలించేందుకు ఆగస్టు ఒకటిన కేంద్ర బృందం ఏలూరుకు రానుంది. ఆ రోజు జిల్లాలో మరో 50 యూనిట్ల స్థాపనకు ఎంపిక చేసిన లబ్ధిదారులను ఇక్కడకు పిలిపించి ఈ ప్రాజెక్టు విశేషాలు తెలియజేసేలా షెడ్యూల్ రూపొందించారు. 15 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి చెరువులో వీటిని పెంచుతామని అందుకు అవసరమైన సహాయ సహకారాలను ఒక ఏడాది పాటు ఒక సంస్థ లబ్ధిదారులకు అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జీవనోపాధుల విభాగం అధికారి వేణుగోపాల్ తెలిపారు.

**ఆరు మండలాలకు లబ్ధి..** ఐటీడీఏ పరిధిలోని ఆరు గిరిజన మండలాల్లోని డ్వాక్రా మహిళలను లబ్ధిదారులుగా గుర్తించారు. సొంతభూమి, బోరు వసతి కలిగి ఉండాలి. ఎకరా భూమి ఉంటే అందులో చేపలపెంపకానికి 10 సెంట్లు మాత్రమే తీసుకుంటారు. అందులో 5 సెంట్లలో చేపల పెంపకానికి సంబంధించి 6 అడుగుల లోతుతో చెరువు తవ్వుతారు. పక్కనే మరో 5 సెంట్లలో తవ్వి నిత్యం చేపలు పెరిగే చెరువులోని నీటిని ఖాళీ చెరువులోకి వదులుతారు. ఈ నీళ్లతో సభ్యులు ఆకుకూరలు పెంచుకునేలా మరో పథకం ఉంది. లబ్ధిదారుల గుర్తింపు పూర్తయిందని వారికి రుణాలివ్వాలని జిల్లా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ బోర్డు నుంచి బ్యాంకులకు సిఫార్సులు వెళ్లాయి. వారికి త్వరలోనే రుణాలొస్తాయని అధికారులు చెబుతున్నారు.

# నిఘా నీడలో కడలి తీరం!

మొగల్తూరు : భవనాల పరిశీలన.. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల కిందట ఇక్కడి బీచ్‌లో యోగా సాధనకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను వారికి వివరించారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ స్పందిస్తూ బీచ్‌లో ఉన్న రెండు ప్రభుత్వ అతిథిగృహాల్లో అనువైన భవనాన్ని ఎంపిక చేస్తే మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇటీవల సంబంధిత అధికారులు బీచ్‌లోని అతిథిగృహాలను పరిశీలించారు. ఇక్కడ త్వరలోనే మెరైన్ స్టేషన్ ప్రారంభం కానుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పశ్చిమలో మొగల్తూరు, నరసాపురం మండలాల్లో సుమారు 38



కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాలు, ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.

**ప్రయోజనాలు ఇవీ..** తీర ప్రాంతంలో నిరంతరం నిఘా ఉంటుంది. ఇక్కడి బీచ్‌కు వేలాది మంది పర్యాటకులు తరలివస్తుంటారు. వీరిలో కొందరు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పది నుంచి 15 మంది ఇలా మృతి చెందుతున్నారు. ఈ క్రమంలో బీచ్‌ను పూర్తిగా మూసివేయాలని ప్రజల నుంచి అప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో తీరంలో రక్షణ ఏర్పాట్లు, గస్తీ మెరుగుపడి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే వెసులుబాటు ఉంటుంది.

# ఏరు.. హోరు

కౌతాళం : తుంగభద్ర ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మేలిగనూరు వద్ద 1,30,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. వాగులో తుంగభద్ర వరద జలాలు చేరడంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగులో సుమారు 10 అడుగుల ఎత్తులో నీరు నిలిచింది. దీంతో ప్రజలు అదనంగా 25 కిలోమీటర్లు ప్రయాణించి మరో మార్గం ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్, తహసీల్దారు రజనీకాంత్ రెడ్డి, ఇరిగేషన్ ఏఇ ఈశ్వర్ తదితరులు నదీతీర గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

**సుంకేసులకు భారీగా వరద**

సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. నాటికి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజినీరు మహేంద్రరెడ్డి తెలిపారు. 11 గేట్లు 2 మీటర్లు, 10 గేట్లు 1 మీటర్లు ఎత్తు తెరచి దిగువకు 1,24,173 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. మిగిలిన గేట్లు మొరాయించడంతో మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేయగా నిపుణులను పంపిస్తామన్నారని ఆయన వివరించారు. ప్రస్తుతం 21 గేట్ల ద్వారా 3.5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

## మల్లూ బ్యూటీ కొత్త లుక్ ఊహించలేదే

కొందరు ఎంతగా నియంత్రించాలనుకున్నా అధిక బరువు సమస్య నుంచి బయటపడలేరు. అదే జాబితాలో ఉంది నివేద థామస్. ఈ బ్యూటీ తనదైన అందం, ప్రతిభతో పాటు మంచి మాట తీరుతోను అందరి హృదయాలను కొల్లగొడుతుంది. నివేద థామస్ ఒక మలయాళీ అమ్మాయి అయినా కానీ, తెలుగులో అద్భుతంగా మాట్లాడి మనసుల్ని గెలుచుకుంటుంది. అందుకే ఈ బ్యూటీ రేసులో వెనకబడటాన్ని అభిమానులు సహించలేకపోతున్నారు. అయితే నివేద ఇటీవల అవకాశాలు అందుకోలేకపోవడానికి కారణం అధిక బరువు సమస్య అని చెబుతున్నారు. ఇటీవల కొంతకాలంగా నివేద అదుపు తప్పి బరువు పెరగడం తీవ్ర ఆందోళనలకు కారణమైంది. ఇదే తీరుగా



బరువు పెరుగుతూ ఉంటే, మునుముందు మమ్మీ, ఆంటీ పాత్రలకు కూడా ఎంపికవ్వడం కష్టమని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. నివేద తిరిగి నిన్ను కోరి, బ్రోచేవారెవరురా లో కనిపించినట్టుగా హీరోయిన్ మెటీరియల్ లుక్‌తో కనిపించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కానీ నివేద మాత్రం దీనికోసం జిమ్ లో కసరత్తులు చేయకపోవడం, అదనంగా శ్రమించకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. అయితే నివేద ఉన్నట్టుండి ఇటీవల కొత్త ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఈసారి కొంత బరువు తగ్గి అందంగా కనిపించింది. లేటెస్ట్ ఫోటోషూట్ చూడగానే అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నివేద ఈజ్ బ్యాక్! అంటూ ఫ్యాన్స్ తమ ఫేవరెట్ నటికి వెల్ కం చెబుతున్నారు. 2025 గదర్ అవార్డుల్లో కనిపించిన రూపానికి ఇప్పటికి చాలా మెరుగ్గా కనిపిస్తోంది. ఇప్పుడు బరువు తగ్గింది. ఇంకా మునుముందు బరువు తగ్గేందుకు ఆస్కారం ఉందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. నివేద ఇదే తీరుగా కసరత్తులతో మరింత స్లిమ్ గా మారాలని కోరుకుంటున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే ... ఇటీవల 35- చిన్న కథ కాదు%-% అనే చిత్రంలో ఒక స్కూల్ పిల్లాడికి తల్లిగా నటించిన నివేద థామస్ తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఈ సినిమాలో నటనకు గాను గద్దర్ అవార్డ్స్ లో ఉత్తమ నటి పురస్కారాన్ని గెలుచుకుంది. ప్రస్తుతం బరువు తగ్గుతోంది. మునుముందు ఇంకా స్లిమ్ గా మారి టాలీవుడ్ లో మరిన్ని చిత్రాల్లో నటించేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

## అవార్డుల వేళ రాజకీయాలు అవసరమా?

మాలయాళ నటి రీమా కల్లింగల్ కేరళ పిలిం క్రిటిక్స్ అవార్డుకు ఎంపికైంది. 'థియేటర్: దిమిత్ ఆఫ్ రియాల్టీ మూవీలో పాత్రకు గాను ఈ గౌరవం లభించింది. సంతోషంగా అవార్డును కూడా అందుకుంది. అయితే సరిగ్గా ఇదే వేదికగా మాలీవుడ్ మీడియా (అమ్మ) మలయాళం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గురించి ప్రశ్నలు లేవనెత్తడం మొదలు పెట్టింది. అసోసియేషన్ లో నాయకత్వ మార్పుపై మాట్లాడాలని అడిగారు. కానీ వాటిని మాట్లాడటానికి రీమా ఎంత మాత్రం ఇష్టపడలేదు. సంతోషంగా అవార్డు అందుకున్న వేళ అమ్మ రాజకీయాలు మనకెందుకంటూ తప్పించుకున్నారు. ఇది సరైన ప్రశ్నగా తాను భావించినట్లు అసంతృప్తిని వ్యక్తం చేసారు. అమ్మలో మహిళల ప్రాధాన్యత పెరిగాలని కోరారు. కానీ ఈ వేదికపై ఇలాంటి ప్రశ్నలు



వేయడం తనని ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. దీనికి సంబంధించి మరో వేదిక ఏర్పాటు చేసుకుని మాట్లాడుకుందామని మీడియాని కూల్ చేసింది. సినిమా తన నటనకు మాత్రమే అవార్డు వచ్చింది..కానీ ఆ సినిమాలో పాత్రకు బదులు రాజకీ యాలని టచ్ చేస్తున్నారని కాస్త అసహనాన్ని వ్యక్తం చేసారు. ఇటీవలే అమ్మ అధ్యక్ష పదవికి శ్వేతామీనన్ ఎన్నికైన సంగతి తెలిసిందే. ప్రత్యర్థి ప్యానల్ పై శ్వేతా మీనన్ ప్యానెల్ గెలుపొందింది. దీంతో అందులో కీలక పదవులకు గెలిచిన వారంతా నియమితులయ్యారు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే శ్వేతా మీనన్ పై పోలీసు కేసుల అంశం కూడా తెరపైకి వచ్చింది. కావాలనే ఆమెను ఓ పాత కేసులో ఇరించాలనే కొన్ని ప్రయత్నాలు చేసనట్లు మీడియాలో వైరల్ అయింది. ఎన్నికల్లో ఆమెను పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించాలనే కుట్ర జరిగిందనే వార్తలు వచ్చాయి. అయినా వాటన్నింటిని ఎదుర్కొని అధ్యక్ష పీఠంపైకి మెరుపులా దూసు కెళ్లింది. అమ్మ పాత కార్యవర్గం లైంగిక ఆరోపణలు కారణంగా ఎవరికి వారు స్వచ్ఛందంగా రాజీనామాలు ప్రకటించి న సంగతి తెలిసిందే. అప్పట్లో ఇది సంచలనగా మారింది. మాలీవుడ్ పరిశ్రమలో ఈస్థాయిలో లైంగిక వేధింపులున్నాయా? అంటూ అంతా ఆశ్చర్యపోయారు. ఎవరి పేరు ఎలా బయటకొస్తుందా? టెన్షన్ వాతా వరణం నెలకొంది. జస్టిస్ మహే కమిటీ నివేదిక దేశ వ్యాప్తంగా సంచలనమవ్వడంతో మిగతా పరిశ్రమలు కూడా అలెర్ట్ అయిన సంగతి తెలిసిందే.




## తెలుగు - తమిళ్.. ఫ్యాన్స్ వార్ తప్పదా?





టాలీవుడ్, కోలీవుడ్ మూవీ లవర్స్ మధ్య అప్పుడప్పుడు సోషల్ మీడియాలో వార్స్ జరుగుతుంటాయన్న విషయం తెలిసిందే. అక్కడి హీరోలు నటించే సినిమాల డబ్బింగ్ వెర్షన్స్ తో పాటు ఇక్కడ మన హీరోలు యాక్ట్ చేసే సినిమాలు ఒకేసారి రిలీజ్ అయితే చాలు.. ఫ్యాన్స్ మధ్య నెట్టింట మాటల యుద్ధం పక్కానే! ఇప్పుడు అదే మరోసారి జరిగేలా ఉంది. ఎందుకంటే వచ్చే ఏడాది సంక్రాంతికి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రాజా సాబ్, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి జన నాయగన్ సినిమాలు థియేటర్స్ లో విడుదల కానున్నాయి. రీసెంట్ గా రాజా సాబ్ మూవీ జనవరి 9న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత వెల్లడించారు. అదే సమయంలో జనవరి 9నే జన నాయగన్ మూవీ కూడా విడుదల కానుంది. దీంతో ఇప్పుడు ఇద్దరు హీరోల ఫ్యాన్స్ మధ్య వార్ తప్పదనేలా ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు సినిమాలు భారీగా విడుదల అవ్వనుండగా.. అభిమానుల సోషల్ మీడియాలో రివ్యూలు, పోస్టులతో పోటీపడడం తప్పదనే చెప్పాలి. అయితే రాజా సాబ్ మూవీ.. హారర్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతోంది. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ చివరి దశలో ఉండగా.. త్వరలో ప్రమోషన్స్ ను ఫుల్ జోష్ తో స్టార్ట్ చేయనున్నారు మేకర్స్. ఇప్పటికే మూవీపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్ తో సాలిడ్ బజ్ క్రియేట్ చేశారు మేకర్స్. మరోవైపు, జన నాయగన్ విజయ్ కు చివరి మూవీగా ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలల క్రితం పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్.. అందుకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నారు.ల దీంతో జన నాయగన్ మూవీ తర్వాత మరి విజయ్ సినిమాలు చేయరని అంతా అనుకుంటున్నారు. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ చిత్రానికి హెచ్. వినోత్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ నుంచి ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్ రాగా, మంచి అంచనాలు నెలకొన్నాయి.

అలా రెండు సినిమాలపై ఆయా హీరోల ఫ్యాన్స్ భారీ హోప్స్ పెట్టుకున్నారు. కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్స్ అవుతాయని ఫిక్స్ అయ్యారు. ఆయా చిత్రాల అప్డేట్స్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఏదేమైనా మాత్రం జన నాయగన్, రాజా సాబ్ రిలీజ్ లతో తెలుగు, తమిళ అభిమానుల మధ్య మాటల యుద్ధం జరిగేలా ఉంది.

## పెద్ది ఇంట్రడక్షన్ సాంగ్.. విజువల్ ఫీస్ట్ పక్కా




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం చేస్తున్న 'పెద్ది' సినిమా పాన్ ఇండియా లెవెల్‌లో అంచనాలు పెంచేసింది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా మాస్, ఎమోషన్, విజువల్ గ్రాండియర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ చరణ్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ ఇప్పటికే గ్లోబల్ ట్రెండ్స్‌లోకి వెళ్లి సోషల్ మీడియాలో దుమ్మురేపాయి. ఇక మేకర్స్ ఒక మాసివ్ ఇంట్రడక్షన్ సాంగ్‌ను ప్లాన్ చేస్తున్నారు. మైసూర్‌లో 1000 మంది డ్యాన్సర్లతో భారీ స్కేల్‌లో ఈ పాట చిత్రీకరిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ మాస్ నెంబర్ రామ్ చరణ్ కోసం స్పెషల్‌గా రెడీ అయ్యింది. తెలుగు నేటివిటీ, మాస్ సెలబ్రేషన్ అన్నీ కలిపి ఉండేలా బుచ్చిబాబు ఈ సాంగ్‌ను అల్టిమేట్ విజువల్ ఫీస్ట్‌గా ప్లాన్ చేశారని మేకర్స్ చెబుతున్నారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. రామ్ చరణ్ తన ఎనర్జీతో వేసే మాస్ స్టెప్పులు క్లిక్కయితే థియేటర్స్ విజిల్స్‌తో నిండిపోవడం ఖాయం అని చెప్పవచ్చు. ఈ ఇంట్రడక్షన్ సాంగ్ రామ్ చరణ్ క్యారెక్టర్ ఆర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయడమే కాకుండా, సినిమాలోని టోన్‌ను సెట్ చేసేలా ఉంటుందట. సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్ ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే వారి లుక్స్, ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీపై కూడా అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఈ మాసివ్ స్పోర్ట్స్ డ్రామా కేవలం యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్ మాత్రమే కాకుండా, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లోని ఎమోషన్లను కూడా హైలైట్ చేస్తుందని సమాచారం. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్‌లోనే కాకుండా, గ్లోబల్ లెవెల్‌లో విజువల్ స్పెక్టకిల్‌గా నిలుస్తుందని మేకర్స్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. మొత్తానికి, ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, జానీ మాస్టర్ డ్యాన్స్, చరణ్ ఎనర్జీ అన్నీ కలిపి ఈ ఇంట్రడక్షన్ సాంగ్ సినిమాకు హైలైట్‌గా మారనుంది. 'పెద్ది' సినిమా రామ్ చరణ్ కెరీర్‌లో మరో బిగ్ హిట్ గా నిలవబోతుందని అభిమానులు నమ్ముతున్నారు. మరి బాక్సాఫీస్ వద్ద సినిమా ఎలాంటి సంచలనాలను క్రియేట్ చేస్తుందో చూడాలి.

## సుందరి భీగీ సారి కూడా ఓపెనింగ్స్ తెచ్చి పెట్టలేదు..!

జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని హిందీలో చేసిన మరో మూవీ 'పరం సుందరి'. సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటించిన ఈ సినిమాకు తుషార్ జలోటా దర్శకత్వం వహించాడు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి బాలీవుడ్ ప్రేక్షకుల్లోనే కాకుండా సౌత్ ప్రేక్షకుల్లోనూ అంచనాలు పెరుగుతూ వచ్చాయి. ఎందుకంటే ఈ సినిమా సౌత్ ఇండియా నేపథ్యంలో తెరకెక్కింది. ఎక్కువగా కేరళలో ఈ సినిమాను షూటింగ్ చేయడంతో పాటు, శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ కావడం వల్ల పరమ్ సుందరి సినిమాను హిందీ ప్రేక్షకులతో పాటు సమానంగా సౌత్ ప్రేక్షకులు చూడాలి అనుకున్నారు. సినిమా నుంచి వచ్చిన ఒక్కొక్క అప్‌డేట్ సినిమాపై అంచనాలు మరింతగా పెంచాయి అనడంలో సందేహం లేదు. కానీ చివరకు సినిమా ఓపెనింగ్స్ విషయంలో చాలా నిరుత్సాహంను చవి చూసింది.

**బుక్ మై షో లో పరం సుందరి బుకింగ్స్...** సాధారణంగా సౌత్ ఇండియాలో ముఖ్యంగా టాలీవుడ్, కోలీవుడ్‌లో ఈ స్థాయి పాజిటివ్



బజ్ క్రియేట్ అయ్యి, హైప్ వస్తే ఖచ్చితంగా పెద్ద హీరోల స్థాయిలో సినిమాలు ఓపెనింగ్‌ను దక్కించుకుంటాయి. కానీ పరమ్ సుందరి బాలీవుడ్‌లో అడ్వాన్స్ బుకింగ్ విషయంలో చాలా నిరాశను మిగిల్చింది. బుక్ మై షో ఇతర బాక్సాఫీస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దేశం మొత్తం మీద కనీసం 35 వేల టికెట్లు అమ్ముడు పోలేదు.

ఇది బాలీవుడ్ ఇండస్ట్రీ పరిస్థితికి అద్దం పడుతోంది. మహావతార్ నరసింహ సినిమా విడుదలైన నెల రోజుల తర్వాత కూడా వీకెండ్ లో లక్షకు పైగా టికెట్లు అమ్ముడు పోతున్నాయి. కానీ పరమ్ సుందరి కి మాత్రం పెద్దగా బుకింగ్ కావడం లేదు.

**జాన్వీ కపూర్ పరం సుందరి షో...** పరమ్ సుందరి నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పూర్తి స్థాయి రివ్యూలు వచ్చిన తర్వాత, మౌత్ టాక్‌ను అనుసారం ముందు ముందు షో లు, రాబోయే రోజుల కలెక్షన్స్ ఆధారపడి ఉంటాయి. ఇప్పటి వరకు పరమ్ సుందరి ఓపెనింగ్స్ విషయంలో చాలా నిరుత్సాహపరిచింది అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అంటున్నారు. జాన్వీ కపూర్ అందం, సిద్దార్థ్ మల్హోత్ర యొక్క గత చిత్రాల ఫలితాల నేపథ్యంలో పరమ్ సుందరి విడుదల రోజు వరకు ఖచ్చితంగా రూ.10 కోట్లకు మించి అడ్వాన్స్ బుకింగ్ ద్వారా రాబడుతుందని అంతా భావించారు.

కానీ అనుకున్నది తలకిందులు అయింది, అడ్వాన్స్ బుకింగ్ మరీ ఇంత నీరసంగా ఉంటుందని ఊహించలేదని స్వయంగా బాక్సాఫీస్ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు.

## చీరకట్టులో ఆకట్టుకుంటున్న ఆషికా రంగనాథ్!

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత సెలబ్రిటీలు ఎక్కువగా తమకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్బుక్ వంటి తదితర సోషల్ మీడియా ఫ్లాట్ ఫార్మ్ ద్వారా తెలియజేస్తున్నారు. మరీ ముఖ్యంగా పండుగలు వచ్చాయంటే చాలు అందంగా ముస్తాబయి సాంప్రదాయంగా కూడా ఆకట్టుకుంటున్నారు కూడా.. ఈ క్రమంలోనే నేడు దేశవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.ప్రజలే కాదు పలువురు సెలబ్రిటీలు కూడా భక్తి పారవశ్యంలో మునిగి తేలుతున్నారు. దీనికి తోడు ఈ పండుగకు మరింత సాంప్రదాయంగా, అందంగా రెడీ అయ్యి..ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఇప్పుడు



ఈ జాబితాలోకి తాజాగా ప్రముఖ యంగ్ హీరోయిన్ ఆషికా రంగనాథ్ కూడా వచ్చి చేరింది.వినాయక చవితి సందర్భంగా చాలా అందంగా రెడీ అయ్యి.. ఆ ఫోటోలను ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసి.. ఫాలోవర్స్ ను ఆకట్టుకుంది. తాజాగా యాష్ కలర్ ప్లెయిన్ సారీ కట్టుకున్న ఈమె దానికి కాంబినేషన్లో స్లీవ్ లెస్ ఎల్లో కలర్ బ్లౌజ్ ధరించింది. కొద్దిగా జుట్టును ముడి పెట్టి మిగతా జుట్టును లీవ్ చేసిన ఆషికా రంగనాథ్.. ఆ ముడికి చాలా చక్కగా పూలు పెట్టి మరింత సాంప్రదాయంగా కనిపించింది. ఈ ఫోటోలను షేర్ చేస్తూ ప్రతి ఒక్కరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఆషికా రంగనాథ్ విషయానికి వస్తే.. 1996 ఆగస్టు 5న కర్ణాటక తుమకూరు జిల్లాలో కన్నడ మాట్లాడే రంగనాథ్, సుధా రంగనాథ్ దంపతులకు జన్మించింది.ఈమెకు ఒక అక్క అనూషా రంగనాథ్ కూడా ఉన్నారు. ఈమె కూడా కన్నడ సినిమాలలో నటిగా కెరియర్ మొదలుపెట్టారు. ఇక ఆషికా రంగనాథ్ తుమకూరు లోని బిషప్ సార్జెంట్ స్కూల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసింది. ప్రీ యూనివర్శిటీ కోసం బెంగళూరుకు వెళ్లి జ్యోతి నివాస్ కాలేజీలో చేరింది. అక్కడ క్లీన్ అండ్ క్లియర్ మిస్ ఫ్రెష్ ఫేస్ బెంగళూరు పోటీకి ఆడిషన్ లో పాల్గొని.. 2014లో జరిగిన పోటీలలో రన్నరప్ గా నిలిచింది. ఇక కామర్స్ అండ్ సైన్స్ నుండి కామర్స్ లో డిగ్రీ పట్టా అందుకున్న ఈమె.. వెస్టన్, ఫ్రీ స్టైల్ ఇలా వివిధ నృత్య రూపాల్లో కూడా శిక్షణ అందుకుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536